భారతి

ఆగస్టు 1972

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938–1972)

★

ఆగస్టు 1972

సంపుటము : 49 : సంచిక : 8 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఆగస్టు 1972

శబ్దముద్ర

డా. ముదిగొండ శివప్రసాద్

వేలహంసలు, కలధౌతపక్షాలు విప్పుకొని,
వియత్తలంనుండి జారినప్పుడు
వేయిరేకుల కమలాన్ని చుంబించడంకోసం
వినువీధికి, చలువకలువ క్రిందవున్న చిలువకన్నె లేచినప్పుడు
వేలవాయులీనాలూ వీణలూ, నిశ్శబ్దగాంధర్వాన్ని 'ఆరు' మెట్లపై పలికించినప్పుడు
విశ్వం నామరూపాలు సంతరించుకునే, తొలి
ఉషస్సుషమాసుముహూర్తంలో
అమృతం చిద్రుపలుచిద్రుపలుగా తొణికి
అక్షరాలుగా రాలి
అర్థాలుగా మారి
భావాలుగా తోచినప్పుడు
భాషా తరంగాలుగా లేచినప్పుడు
అమ్మా !
నీ అవతారం ఈ మృణ్మయ ఖండానికి!!

*　　*　　*

సుహాసినీ!!
నీ చిరునవ్వే లేకుంటే
ఈ జీవితం
ఎంత నిర్భరం, ఎంత నికృష్టం తల్లీ !!
పలలాస్థిసమూహంతోకూడిన ఈ
బండెడు మాంసపిండానికి కళేబరానికి
భారవాహుడనై బ్రతికేందుకేనా నేను పుట్టింది ??
నా వేదనలో, వ్యధలో, జీవనకథలో
శ్రమలో సుఖంలో కన్నీటిలో పన్నీటిలో తడిపి

అంకురాన్నిగా నిన్ను నేను నాలో నాటినప్పుడు
రక్తం మాంసం మృత్తికా పిండివడకట్టిన రసాయనంలో
నీవు నిట్టనిలువుగా పెరిగి
నీలా, రుణ, శ్వేత, కాండానికి చివర
'నవ' నవోన్మేష కుసుమాలు ఫలదీకరణాన్ని పొంది
రసం పాయలు పాయలుగా నన్ను ప్లావితం చేస్తున్నప్పుడు
ఓహో !
ఆ స్నానంకోసమే తల్లీ, ఈ తనువును, జన్మిద పెట్టింది !
ఆ భగీరథత్వంకోసమేనమ్మా ఈ జీవన వ్రతం పట్టింది !!

*　　*　　*　　*

గద్దెలనెక్కిన రారాజులు
కాలగర్భంలో కరిగిపోవడం చూచి
పరిమితమైన నా జీవనమూ
బాడబగ్నిని కభిముఖంగా పరుగెత్తడంచూచి
అమరత్వాకాంక్షతో
అపరిమేయజీవనవాంఛతో
నిన్ను డోలికగా, ఆందోళికగా చేసికొని ఊగుతూ
'నేల'నుండి చేత 'నాతి మానసతత్వా'ని కెదుగుతూ
అనాదినీ అనంతత్వాన్నీ స్పృశిస్తూ, బ్రతుకును
అనుక్షణం నీలో ముద్రిస్తూ
దేశకాలఉపాధులను అధిగమించి
త్రివిక్రమత్వాన్ని ఆవాహనచేస్తూ
నన్ను-నీవుగా మార్చుకొంటున్నప్పుడు
నాకిక మరణ మెక్కడిది తల్లీ !!

*　　*　　*

శబ్దంనుండి వచ్చిన నా అస్తిత్వాన్ని మరిగించి కరిగించి
తిరిగి
శబ్దపు మూసలో పోతపోయడం నా వృత్తి—
అక్షరాలు - అకార ఆకారాలు - నా ఆకారం
ఘాటలే నా మనుగడ

శబ్దముద్రి

పదాలతో పాదాలతో నా నడక
సమాసకదంబాలు ఉత్పలచంపకాలు నా
సురభిళ శ్వసనాలు—
ప్రతి ధ్వనికీ, ప్రతిధ్వని పలికేది నా హృదయం.
శబ్దమైన లిపిని చిటికెవేసి నిద్రలేపి
భావాలు పలికించడం
గాల నొలికించడం నా విద్య-
మృణ్మయమానవాస్థికలను
నీ సంస్పర్శతో
చిన్మయేతిహాసంగా, సాహిత్యంగా, సంస్కృతిగా మార్చడం
నా వ్యవసాయం !
క్షణక్షణానికీ చెదిరిపోయే భౌతిక సౌందర్యాలను
శిథిలమయ్యే పారిజాత పరీమళాలను
ఉషస్సులను నిశీథులను ఉభయసంధ్యలను, త్రిభువనైకశృంగారహేలలను,
శబ్దముద్రిలో బంధించి
విశ్లథత్వంనుండి రక్షించి
శాశ్వతత్వం ప్రసాదిస్తున్నాను తల్లీ నీ
సుందర దరహాసరేఖావీక్షణంచేత !

* * * *

అనంతమైన మానవాకాశంలో నేను
అజ్ఞాతకాలంనుండి శిల్పినై నిలబడి
మూర్తి నిర్మాణానికి పరిమిత దర్శనం కల
మానవులనే ధ్రువతారలుగా మలచాలని, ఏ
రాముణ్ణో కృష్ణుణ్ణో రామకృష్ణుణ్ణో ఎంచుకొని
రసవిద్యతో నీ జరీ చీరె అంచుమీద
హంసల్లా అద్దకపోతే అంబరాన నిలుపకపోత
మిగిలే వారేనా వీరు మృత్యువాహినినాటి నేటివరకు
దేవతలై —??
మిగిలేదేనా, యుగయుగాల మానవకథ
ఈ నాటివరకు ???

—————

శ్రీ అరవిందదర్శనంలోని 'అతిమానస' తత్వసమీక్ష

శ్రీ కమలాకర వేంకటరావు

[స్వాతంత్ర్యదిన రజతోత్సవ సందర్భంలోనే శ్రీ అరవిందుల శతజయంతి గూడా జరుగుచున్నది. ఆ సందర్భములో శ్రీ అరవిందుల దర్శన సమీక్షను ప్రచురించుచున్నాము.]

శ్రీ అరవిందులు ప్రపంచించిన పూర్ణాద్వైత దర్శనమును, దాని ననుసరించిన సాధనకొరకై ఆయన రూపొందించిన పూర్ణయోగదర్శనమును సరిగ అవగాహన చేసుకోవాలంటే, అందాయన ఒక ప్రత్యేకార్థ స్ఫూర్తితో విరివిగా వాడిన 'అతిమానసం' (సూపర్ మైండ్)—అనే పదభావపు లోలోతులను చక్కగా తరచి చూడడం అత్యంతావశ్యకం. మనస్సున కతీతమై విలసిల్లు నీ అతిమానసతత్త్వావతరణం ద్వారా దివ్యమానవజాతి భూలోకమున ఆవిష్కారం చెందవలసి యున్నదని కదా లోకమున కాయన అందించిన వినూత్న సందేశం? ఏమిటి ఈ అతి మానసమంటే?

అతిమానసమనే పదం కొందరికి విడ్డూరంగా తోచవచ్చును. 'అతి సర్వత్ర వర్జయేత్'లోని 'అతి' ధ్వనిని దీని కాపాదించుకుంటే అట్లా విడ్డూరంగా తోచడం సహజమే. కాని, అతీంద్రియమనే పదాన్ని మనం అర్థం చేసుకుంటున్నట్లే దీనినికూడ అర్థం చేసుకొనేయెడల ఎట్టి విపరీత భావనయు తోచవలసిన పని లేదు. మనస్సున కతీతమైన తత్త్వమని మాత్రమే దాని అభిప్రాయం. కాని, మనస్సున కతీతమైన తత్త్వము లనేకమున్నవి. అవి అన్నియు నీ పదముచే సూచిత మవుతున్నవా? కేవల సచ్చిదానందఘనమైన పరతత్వం మనస్సున కతీతమైనదే. అతిమానస పదం ఆ పరతత్వానికి సూచకమా? కాదు. ఒకానొక నిష్కృష్టార్థములో మాత్రమే శ్రీ అరవిందు లీ పదమును వాడినారు. అది ఎటులనో పరిశీలిద్దాము.

శ్రీ అరవింద దర్శనం 'ఏకమేవా ద్వితీయం' అను అద్వైత భావనతో రూపొందినదే. సమస్తమూ ఒకే వస్తువుయొక్క విలసనమే. సత్—చిత్—ఆనందమే సకలమునకూ మూలం, ఉనికి గలిగినది సత్. కాని, ఆ ఉనికి ఎరుక కూడా కలిగి యున్నది. అదియే చిత్. అంతేకాక, ఆ ఎరుక గలిగిన ఉనికి ఆనంద లక్షణోపేతముకూడ. సత్—చిత్ - ఆనందములు మూడునూ ఒకే వస్తువుయొక్క మూడుతీరులు—అయితే, ఈ వస్తువులకు స్థితి గతి అనేవికూడ ఉన్నవి. దేశకాలముల కతీతముగ తనలోతాను విలీనమై యుండునది స్థితి. దేశకాలములలో తనను తాను విస్తరించుకొనునది గతి. ఈ విస్తరణకు కారణ మానందము. తనలో తాను విలీనమై యుండునది మాత్రమే ఆనందము కాదు వెలికి ఉప్పొంగి విస్తరిల్లునదియు ఆనందమే. జగత్సృష్టి ఇట్టి ఆనందములో నుండియే కలిగినది. 'బహుస్యాం ప్రజాయేయేతి'—అనునది ఇట్టి ఆనందోల్బణముకాక మరియేమి?

ఇదియే ఈశ్వర తత్వము. తనలో తాను విలీనమైయుండు స్థితియం దిది కేవలానందఘనమై యొప్పారుచున్నది. సృష్టికార్యమున విస్తరిల్లు గతియం దిది ఆనందఖేలనముగా విరాజిల్లుచున్నది. ఈశ్వర చేతనయం దీ ఖేలనానందము నిత్యసిద్ధము. మూల స్వరూపమున మన నిజాత్మకూడ ఈశ్వర చేతనతో ఏకత్వము పొందియున్నదే కావున, అదియును ఈ ఖేలనానందమున నిత్యభాగస్వామినియే. కాని, ప్రస్తుత మీ నిజాత్మ మన మానసికాహంకారముచే ముసుగు

వడియున్నది. ఈ ముసుగును తొలగించుకొని మన నిజాత్మను మనము తిరిగి పొందగలిగిననే తప్ప, ఈ భాగస్వామ్యము ననుభవించుటద్వారా దివ్యజీవనోపలబ్ధిని మనము బడయజాలము.

మనస్సు భేదదృష్టి ప్రధానము. సచ్చిదానందము ఏకత్వలక్షణోపేతము. రెంటినీ విడివిడిగా పరిశీలించినప్పుడు ఇవి పరస్పరవిరుద్ధములుగా గన్పట్టుట సహజము. ఇందొకటి సత్యమని అంగీకరించినచో రెండవ దానిని అసత్యమని త్రోసిపుచ్చక తప్పదు. సచ్చిదానందమును అనుభవించవలెనన్న మనస్సును వర్జించి తీరవలెను. కాని, మనఃప్రాణశరీరములయందే పృథ్విపైన మన మనికి. సచ్చిదానందోపలబ్ధికి మనఃప్రాణశరీరచేతనను త్రోసిపుచ్చుటే తప్పనిసరియగుచో, పృథ్విపై దివ్యజీవనమనునది అసాధ్యమేయగును. అట్టి సందర్భములో, మన స్వస్వరూపమైన విశ్వాతీతమును చేరగలుగుటకై విశ్వస్థితినెల్ల భ్రమగా, మాయాకల్పనగా పరిగణించి త్రోసిపుచ్చక తప్పదు. అట్లుగాక, ఈ మనఃప్రాణశరీరములయందే సచ్చిదానందోపలబ్ధిని గాంచి, మనము దివ్యజీవనమును నెరప సమర్థులము కావలెనన్న, రెంటికినీగల యీ వైరుధ్యమును పరిహరించి సామరస్యమును ఘటింపచేయగల తత్వమొకటి యీ అనుసంధానమున కుపచరింపవలసియున్నది.

అట్టి తత్వమేదైనకలదా? కలదనియే శ్రీ అరవిందులు వక్కాణించి, దానికి 'అతిమానసం' అని పేరు పెట్టినారు. వేదములలో 'ఋత చిత్' అనియు, 'సత్యం, ఋతం, బృహత్' అనియు పేర్కొనబడినది ఇదియే అని నిర్దేశించి చూపినారు. అంతేకాదు,— సప్తవ్యాహృతులుగా చెప్పబడిన భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యం— అనువానిలో నడిమిదగు మహస్సు దీని సంజ్ఞయేనన్నారు. ఇందు, భువన సప్తకములోని భూర్భువస్సువర్లోకములు శరీర ప్రాణ మనస్తత్వములకు, సత్య తపోజనుర్లోకములు సచ్చిదానందములకు సంజ్ఞలు కాగా, నడిమిదైన మహస్సు ఈ అపరార్ధ, పరార్ధములకు లంకెయై విలసిల్లు చున్నదన్నారు. తైత్తిరీయమున ప్రస్తావించబడిన అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశములలో విజ్ఞానమయము బుద్ధికాదనీ, ఈ అతిమానసమేనని శ్రీ అరవిందుల అభిప్రాయము.

మనస్సున కతీతమైన తత్వమగుటచే ఇయ్యది అతిమానసం. వస్తుజాతమునకు మూలభూతమగు సత్యమును, ఋతమును, ఏకత్వమును ఆధారముగా గొని ప్రవర్తించునది యగుటచే నిది సత్యచేతన, లేక ఋతుచేతన. మనస్సుయొక్క ప్రవృత్తిలక్షణమిదికాదు. వస్తుజాతపు అంతరాంతర సత్యమును పురస్కరించుకొనిగాక, బాహ్యరూపభేదములను పురస్కరించుకొని అయ్యది ప్రవర్తించుచుండును. అతిమానసతత్వముపైననే పృథ్విపై దివ్యజీవనావిష్కారమాధారపడి యున్నది. ఏలయన, కేవల సచ్చిదానందము దేశకాలాతీతపరతత్వము.జగత్తు—అట్లాకాక,దేశకాలముల లోపల కొనసాగు విస్తరణమై యున్నది. దేశకాలములలో కార్యకారణ సంబంధము లీ విస్తరణయందు ప్రవర్తింపజేయబడుచుండును. కార్యకారణ సంబంధమున నొక నియతి, ధర్మము అనుస్యూతమై యుండును. ఈ ధర్మము వస్తునిష్ఠమగు సత్యముయొక్క ఆవిష్కారము ననుసరించియుండును. ఈ సత్యము సంకల్పరూపము. అనంతములగు సంభావ్యములలో ఏది ఎట్లు రూపొంది ఆవిష్కారం చెందవలసినదియు ముందుగనే నిర్ణీతమగుచున్నది. ఇచ్ఛాజ్ఞానము లేకమైన చిచ్ఛక్తిద్వారమున నయ్యదికొనసాగుచుండును. ఈ ఇచ్ఛాజ్ఞానములు మానసికములు కానేరవు. ఏలయన, మనస్సు ఈ దివ్య నియతికి, దివ్యధర్మమునకు లోబడి వర్తించు వానిలో నొకటియగునుగాని, తనకు తానై ఆ నియతిని, ధర్మమును మూలమనకుబోయి తెలిసికొని దానికి నియామకమై ప్రవర్తింపజాలదు. భేదదర్శనముతో కార్యపరిశీలనము మాత్రమే దాని లక్షణము. అదియునుగాక, వస్తుస్వరూపము నావిష్కరింపజేయు దివ్యజ్ఞానపూర్వకమైన దివ్యేచ్ఛ సకలవస్త్వైక్యజ్ఞానసంపత్తి కలిగినదై, అట్టి ఏకత్వములోనుండియే నానాత్వము నావిష్కరింపజేయవలసియున్నది. మనస్సున కట్టి ఏకత్వజ్ఞానసంపత్తిలేదు.

అనేకత్వములోని ఒకానొకభాగమును అసమగ్రముగ పొదివికొనజాచుట మాత్రమే దానికి చేతనైన పని.

కనుక, మనస్సుకు చేతకాని పనిని చేయ జాలినదగుచు, మనస్సుకంటె అతీతమై విల సిల్లు తత్త్వమొకటి అవశ్యము ఉండి తీరవలెను. ఆ తత్త్వము సచ్చిదానందమే యనుటకు సందే హములేదు. కాని అది తనలో తాను విశ్రాంతమై విలీనమైయుండు సచ్చిదానందముకాదు,—దానికి ఉప కరణముగా విస్తరణకొరకు ప్రవృత్తమగు సచ్చిదా నందము. చిత్—తపస్సు లనునవి అద్దానికిగల శక్తి యుగళము. కావున, దేశకాలములలో కార్యకారణ సంబంధములతో కూడిన జగత్తును సృష్టిచేయుటకు దానియందు జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి అనునవి అవశ్య ముగా విలసిల్లుచుండును. ఈ జ్ఞానము, ఈ ఇచ్ఛ,– రెండూ విడివిడి శక్తులు కావు. రెండూ కలిసి ఒకే మహాశక్తి—సర్వమునూ తనలో నిముడ్చుకొని అనం తమై విరాజిల్లుచుండు శక్తి. దేనికి తాను రూప కల్పనము చేయనున్నదో అద్దానినెల్ల అది తన యందు నిత్యమూ ధరించియుండును. కావున, అతి మానసమనగా జ్ఞానేచ్ఛలరూపమున వెలికి ప్రసృతమగు సచ్చిదానందమే. తనలో గర్భితమైయున్న సత్యములను కొన్నింటిని దర్శించి, వాని యభివ్యక్తి స్వరూపమును నిర్ణయించుట కీ జ్ఞానశక్తి తోడ్పడగా, అట్లు నిర్ణ యింపబడిన వాటిని తన దేశకాలాతీతస్వరూపపు విస్త రణమేయైన దేశకాలములలో అభివ్యక్త మొనర్చుట కీ ఇచ్ఛాశక్తి పనిచేయును. ఇట్లు సచ్చిదానందమున నంతర్గర్భితమైయున్న దానికి రూపమిచ్చెడి జ్ఞానమే ఋతచిత్. అదియే సంకల్పము. అది తపశ్శక్తి సమన్వితముకూడ కనుక, దేశకాలములయందు దాని అభివ్యక్తిని సాధించు నిచ్ఛయు నదియే.

ఇట్టి దివ్యచేతనతో నొప్పారు తత్త్వమునే ఈశ్వ రునిగా పేర్కొనుచున్నాము. కావుననే యాతడు సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునై విరాజిల్లక తప్పదు. అభివ్యక్తము గావింపబడు సకల రూపములూ చేతనాత్మకమైన అతని నిజసత్తయందు దేశకాలములలోని తన విస్తరణలో తన శక్తి విలస నముచే సృజింపబడుచున్నవే కదా! కావుననే అతడు సర్వాంతర్యామి. సకలరూపములూ ఆతని చేతనాత్మక సత్తయందు భాసిల్లుచున్నట్టివే. కనుకనే ఆతడు సర్వజ్ఞుడు. సకలరూపములూ అతని ఇచ్ఛాశక్తి కధీన ములై వర్తిల్లుచున్నట్టివే. కనుక ఆతడు సర్వశక్తి మంతుడు. ఆతని ఇచ్ఛాజ్ఞానములు మన యిచ్ఛాజ్ఞాన ములవలె ఒండొంటితో సంఘర్షించుచుండునట్టివి కావు. ఏలయన, ఆతనియందవిరెండునూ కలిసి ఏక ప్రవృత్తియే కాని వేర్వేరు ప్రవృత్తులు కావు. బాహ్యా భ్యంతరములందు వానితో సంఘర్షించు ఏ ఇతర ఇచ్ఛా జ్ఞానము లుండుటకునూ అవకాశము లేదు. ఏలయన, అద్వయుడగు నాతనికి వెలియైన చేతనగాని శక్తిగాని వేరొకటేదియూ లేదు. సకలమునూ నిర్ణయించు ఒకే ఇచ్ఛాశక్తియొక్కయు, సకలమునూ సమరసింప జేయు నొకే జ్ఞానశక్తియొక్కయు విలసన మాత్రములే సకలశక్తి విశేషములూకూడ. ఖండజ్ఞానమున భేద దృష్టితో నివసించుచు పూర్ణదర్శనములేని మనకు వివిధ శక్తుల సంఘర్షణముమాత్రమే పొడగట్టు చుండును. పూర్ణదర్శనమున నిత్యమూ వెలుగొందు చుండెడి అతిమానసదివ్యచేతనకు అట్లుగాక, పూర్వ నిర్ణీతమైన సామరస్యసాధనలో అంతర్భాగములుగ మాత్రమే అవి అన్నియు కానవచ్చుచుండును.

దివ్యచైతన్య కార్యకలాప మేరూపమున కొనసాగి నను దాని స్వభావ లక్షణము సదా ఈ తీరుననే యుండును. దేశకాలాతీత స్థితియందేకాక, దేశకాల విస్తృతియందుసైతము దాని సత్తావిస్ఫూర్తి అఖం డమై తేజరిల్లునదగుటచే, తన ప్రవృత్తియందది ఏ ఒక క్రియా విశేషమునకును పరిమితమై యుండదు. మానవులమైన మనకు సృష్టిలో ఒక ప్రత్యేక విధమగు చేతనారూపము మాత్రమే కలదు. దాని మూలమున మనము ఒకే సమయమున అనేక ముతో తాదాత్మ్యము చెందలేము. ఏదో ఒక దానితో మాత్రమే తాదాత్మ్యము చెందగలుగుదుము. దేనితో మనము తాదాత్మ్యము చెందుదుమో అదియే

మనకు సత్యముగా గన్పట్టును. తక్కినవి సత్యములుగా గన్పట్టవు. కాలాంతరమున నీ పరిస్థితి మారవచ్చును. ఈశ్వరుని దివ్యచేతన ఆ రీతిని పరిచ్ఛిన్నమై పరిమితమై యుండదు. ఏకకాలమున అనేక రూపములు ధరించు సామర్థ్యము దానికున్నది. ఎల్లకాలమునకు శాశ్వతముగ నిలువగల రూపవిశేషములను సైతము అయ్యది ధరించగలదు. జగన్నిర్మాణసన్నివేశములో అతిమానస దివ్యచేతన ఇట్టి శాశ్వత రూపవిశేషములను మూడింటిని ధరించినట్లుగా మనకు పొడగట్టుచున్నది. మొదటిది వస్తుజాతపు అఖండైకత్వమున ప్రతిష్ఠితమైన రూపము. రెండవది ఏకమున అనేకము, అనేకమున ఏకము అభివ్యక్తమగుట కాధారమై విలసిల్లునట్లుగా ఆ ఏకత్వమును మలచిన రూపము. మూడవది నానావిధములగు వ్యక్తిత్వావిష్కారమున కాధారభూతమగునట్లుగా ఆ ఏకత్వములో మార్పుచెందించిన రూపము. ఈ బహువిధ వ్యక్తిత్వావిష్కారమే అవిద్యాకార్యఫలితముగ మనలో వేరుభావనతో కూడిన అహంకారమై రూపొందినది.

వస్తుజాతపు అఖండైకత్వమున రూపప్రతిష్ఠితమగు అతిమానసచేతనయొక్క ప్రాథమిక స్థితిలోని ఏకత్వము, కేవలసచ్చిదానందస్థితిలోని ఏకత్వము కాదు. ఆ కేవలసచ్చిదానందస్థితి దేశకాలాతీతము. చిచ్ఛక్తి అచట ఏవిధమైన విస్తరణ ప్రయత్నమునూ చేయదు. అందు జగత్తు ఒకవేళ ఉన్నచో అయ్యది నిత్యవిలీనస్థితిలో, మున్ముందు సంభావ్యముకాగల అదృశ్యస్థితిలోనుండునేకాని వాస్తవికముగా నుండదు. అతిమానస చేతన యందలి స్థితి అట్లుకాదు. ఇది సచ్చిదానందముయొక్క విస్తరణ విశేషము. సచ్చిదానందము సర్వగ్రాహియై ఇందు సమస్తమునూ తనయందు గర్భితమొనర్చుకొని కుంభించుకొనియుండును. అయినను ఇది ఏకమే, అనేకముకాదు. సృష్టిస్వరూపకల్పన మచట ఎంతమాత్రమునూలేదు. ఈ అతిమానస చేతనయొక్క ప్రతిబింబము మన నిశ్చల విశుద్ధాత్మపై పడుట తటస్థించినపుడే వ్యష్టిత్వభావన నెల్ల మనము కోల్పోవుచుందుము. ఏలయన, వ్యష్టిత్వభావనను పెంపొందించగల లక్షణమేదియు ఆ చేతనయందులేదు. సర్వమూ ఏకత్వమునందే, ఏకమునందే అచట ప్రతిష్ఠితమైయున్నది. అన్నింటినీ తన రూపములుగానే ఈదివ్యచేతన తనయందు ధరించియుండును. దేనికినీ ఏవిధమైన ప్రత్యేకసత్తాస్ఫూర్తియునుండదు. మన మనస్సునందు తోచెడి ఆలోచనలు, రూపములు ఏవిధముగా మన మానసికచేతన ధరించిన రూపములై మనకంటె వేరుసత్తా కలిగియుండవో అటులే ఈ అతిమానస చేతనయొక్క ప్రాథమిక స్థితియందలి నామరూపములన్నియును దానికంటె వేరై యుండవు. అయ్యది అనంతునియందలి విశుద్ధ దివ్యభావనారూపము. మానసికభావనారూపమున వ్యవస్థితమైన అవాస్తవిక ఖేలనముగాక, చిత్సత్తుయొక్క వాస్తవిక ఖేలనము. ఈ స్థితియందు చిదాత్మకు, శక్త్యాత్మకు భేదముండదు. జడవస్తు, ఆత్మవస్తు భేద ముదయించదు. సర్వమూ కేవలమాత్మయొక్క రూపవిశేషము.

అతిమానసచేతనయొక్క ద్వితీయరూపస్థితియందు సృష్టి సంకల్పభావనాగతినుండి దివ్యచేతనము వేరై నిలిచి దాని ననుసరించుచు, దాని క్రియాకలాపమున నధివసింపుచు, దాని ననుభూత మొనర్చుకొనుట జరుగుచుండును. ప్రతి నామరూపమునందును అంతటా సమానముగ నెలకొనియున్న ఒకే చిదాత్మగా అయ్యది తనను తాను కనుగొనుచుండును. అంతియే కాదు— సృష్టియందు వ్యష్టిఖేలనమున కాధారభూతమగుచు తదితర ఖేలనమునుండి దానిని వేరుపరచునదై విలసిల్లు కేంద్రీకృత చిదాత్మగా కూడ అయ్యది తనను తాను కనుగొన నేర్చును అనగా, అంతటా నెలకొనియున్నది ఒకే ఆత్మతత్వమైనను, దాని రూప విశేషములు మాత్ర మనేకము. ఇట్టి కేంద్రీకృత చిదాత్మయే జీవాత్మ. సర్వాత్మకమై విలసిల్లు పరమాత్మకంటె భిన్నము. అయితే, ఈ భిన్నత్వము సృష్టిక్రీడ కొనసాగుట కవసరమైన వ్యావహారిక ప్రయోజనానుగత భిన్నత్వమేకాని, తత్వతః భిన్నత్వముకాదు. ఈ భిన్నత్వ మా తాత్వికైకత్వమును భంగపరుపనేరదు. సర్వాత్మకుడైన పరమాత్మ సకల జీవాత్మలును

తానేయని తెలిసికొనియుండును. అయినను ప్రతి జీవాత్మతోనూ ప్రత్యేక సంబంధమును నెలకొల్పు కొనుటతోపాటు, ప్రతిజీవాత్మలోనుండియు ఇతర జీవాత్మలతోకూడ వేర్వేరు సంబంధములను ఆతడు ప్రతిష్ఠించుకొనును. ఇక జీవాత్మయో, తానా అద్వయుని ఒకానొక రూపవిశేషము నన్న ఎరుక గలిగియుండి ఆ అద్వయునితోడను, ఇతర జీవాత్మలతోడనూ తన ఏకత్వము నుపభోగించ గలుగుటతోపాటు ఆ ఏకత్వములోనే భిన్నత్వమున తన ప్రత్యేక వ్యక్తిత్వమును వెల్లార్చుకొనుచు ప్రత్యేక సంబంధములను అనుభూత మొనర్చుకోగల స్థితిలో నుండును. అతిమానస దివ్య చేతనయొక్క ఈ రెండవ రూపవిశేషము మన విశుద్ధ మానసమున ప్రతిబింబించుట తటస్థించి నపుడు, వ్యష్టిత్వభావనను కోల్పోకుండగనే మన యాత్మ సర్వాత్మకుడైన పరమాత్మతో ఏకత్వము ననుభవింప గలుగుచు తన ప్రత్యేక వ్యక్తిత్వమున గూడ పరమాత్మతోడను, ఇతరులతోడను ఈ ఏకత్వానుభూతిని పొందగలుగుచుండును. అతిమానస స్థితియందు ఇంకే ఇతరమైన మార్పు ఉండదు. ఏకము అనేకముగా అభివ్యక్తమై, అనేక మింకనూ ఏకమై విలసిల్లుచుండు క్రీడ సుసంపన్నముగా కొనసాగుచుండు టొక్కటే ఇచట కానవచ్చెడిమార్పు.

అతిమానస చేతనయొక్క తృతీయ రూపస్థితి యందు దివ్యచేతనము సృష్టిసంకల్పభావనాగతి నుండి వేరైనిలిచి దాని ననుసరించుచు దాని క్రియాకలాపమున నధివసించుచు దాని ననుభూత మొనర్చు కొనుటకు మారుగా దానిలోనికి విస్తరిల్లి దానియందు మెలివడుట సంభవించును. సృష్టి క్రీడయొక్క స్వభావమిచట మార్పు చెందుచున్నది. ఇందు జీవాత్మ పరమాత్మతోడనూ ఇతర జీవాత్మల తోడనూ గల సంబంధములకు మాత్రమే విశేష ప్రాధాన్య మొసగుచు, నాటినే తన అనుభవక్షేత్రపరిధి గావించు కొనును. పరమైకత్వానుభూతి పరమమైన చరమానుభవ స్థితియందు మాత్రమే కలుగును. కావున జీవాత్మ పరమాత్మలమధ్య దివ్యానంద సంధాయకమగు నొక విధమైన ద్వైతస్థితి యిచట దానికి కావలసిన సకల పరిణామములతోనూ ఏర్పడుచున్నది.

అనేకమే వాస్తవికమైతోచి, ఏకమును ఆ అనేకముయొక్క సంకలనముగ మాత్రమే పరిగణించు అవిద్యలోనికి దిగజారుటే ఇందు సంప్రాప్తమగు తొలి పరిణామమని తలంచుట కవకాశము లేకపోలేదు. కాని, అట్టిచ్యుతి ఇచట కలుగవలసిన అవసరమేమియు లేదు. ఏలయన, జీవాత్మ ఇచట తాను పరమాత్మ వలెనే ఏర్పడితిననియు, ఆయన శక్తి ఫలితముగనే రూపొందితిననియు ఎరుక గలిగియుండును. దేశకాలములలో జగల్లీలావినోదము కొరకై పరమాత్ముడు సంకల్పించిన నానాత్వసృష్టియందు తానొక భాగము నన్న సంగతి నది మరువదు. తనకు సర్వస్వతంత్రత నాపాదించుకొనుట దానిలక్షణము కాదు. సర్వాధారమగు ఏకత్వమెటుల సత్యమో నానాత్వముకూడ అటులే సత్యమని అయ్యది తలంచును. ఒకే సత్యమునకు ఒకటి ఉత్తర ధ్రువముకాగా రెండవది దక్షిణ ధ్రువమని భావించును. ఒకే దివ్యలీలకు ఒకటి మూలస్థానముకాగా రెండవది అద్దాని చరమపరిణామ సీమగా తలపోయును. ఐక్యానందమును సంపూర్ణముగా అనుభవించుటకు జీవాత్మ పరమాత్మలు వేరుగనే ఉండవలెననియు, అట్టి వేరుతనమే ఆనందసంధాయక మనియు పరిగణించును.

అతిమానస దివ్యచైతన్యపు ఈ మూడు భంగిమలును ఒకే దివ్యసత్యముతో వ్యవహరించెడి మూడు తీరు లనునది సుస్పష్టమే. అనుభవించెడి సత్యమొక్కటే. కాని, దాని ననుభవించుటలో ఆత్మచైతన్యపు తీరులు, భంగిమలు మాత్రము భిన్నములు. ఆ యనుభవానందపు రీతులు వేర్వేరుగా నుండవచ్చును. కాని, అన్నియు అతిమానస దివ్యచైతన్య పరిధిలోనివే. అనృతములోనికి, అవిద్యలోనికి దిగజారుట అనునది అచటలేదు. ఏలయన, అతిమానసపు ప్రాథమిక భంగిమయందు దివ్యైకత్వమున నిష్ఠితమై యున్నదానినే ద్వితీయ, తృతీయ భంగిమలందు దివ్యానేకత్వ శోభాన్వైభవమున పెంపొంద

జేయుట జరుగుచున్నది. ఈ మూడు భంగిమలలో ఏ ఒక్కదానికిని అజ్ఞానపు ముసుగు వేయుటకు వీలు లేదు. సృష్ట్యున్ముఖమైన దివ్యచైతన్య స్వరూపమును వర్ణించుపట్టున ఈ దివ్యసత్యానుభూతులకు పరమ ప్రమాణములై వెలసియున్న ఉపనిషత్తులలోగల భాషావైఖరిని శ్రద్ధగా పరిశీలించి చూతుమేని, ఈ అనుభూతులన్నియు నిక్కమైనవేయని స్పష్టమగును. అనేకత్వముకంటె ఏకత్వమునకు మనము ప్రాధాన్య మిచ్చుట జరగవచ్చును. కాని ఇది కాలమునుబట్టి గాక అనుభవమునుబట్టి ఇచ్చెడి ప్రాధాన్యము. ఏక త్వమునకుగల ఈ ప్రాధాన్యము—అనగా అనేకము ఏకము పైన నిత్యమూ ఆధారపడియున్నదనెడి సత్యము సకల వేదాంత సమ్మతము. కాలగతిలో అనేకము అశాశ్వతమై కన్పట్టి, తమ అభివ్యక్తికి మూలమైన ఏకములోనికే మరలిపోవుచున్నట్లు గోచరించుచున్నందున, అవి వాస్తవికములు కావని త్రోసిపుచ్చుట జరుగుచున్నది. కాని, కాలగతిలో ఈ అనేకము నిత్యమూ మరల మరల ద్యోతమానమగుచునే యుండుటనుబట్టి, ఏక త్వమువలెనే అనేకత్వముకూడ కాలాతీతపరవస్తువు లోని యొక వాస్తవికాంశమేయని అంగీకరించక తప్పదు. అట్లది వాస్తవికము కానిచో కాలగతిలో ఈ తీరున నది మరల మరల నిత్యమూ పొడసూపు చుండుట యనునది సంభవింపనేరదు.

ఆధ్యాత్మికానుభూతియందలి ఒకానొక అంత మునకుమాత్రమే మానవబుద్ధి సర్వప్రాధాన్య మొసగి, అది ఒక్కటియే నిత్యసత్యమని విభజనాత్మకమైన మానసిక తర్కముతో వాదింపదొరకనిప్పుడే,పరస్పరము ఖండించుకొనెడి తాత్విక సిద్ధాంతము లుదయించు చున్నవి. ఈవిధముగా, కేవల సచ్చిదానందమే ఏకైక సత్యమని చాటుటలో, అద్దాని దివ్యైకత్వఖేలనను వాస్తవిక భేదముగా మన మానవబుద్ధితో అవగాహన మొనర్చుకొని, బుద్ధిచేయు నీ పొరపాటును ఉచ్చతర సత్యానుభూతిద్వారమున సవరించుటకు సమ్మతించలేక పోవు పరిస్థితియందు, ఈ ఖేలనమంతయూ వట్టి మాయగా, భ్రమగా మనము కొట్టి పారవేయుట సంభవించుచుండును. లేక, అనేకములో ఏకము యొక్క ఖేలవకు సర్వప్రాధాన్య మొసగుచు, ఏకమును విశేషణ విశిష్టముగావించి జీవాత్మను పరమాత్మని అంశముగానే పరిగణించు పరిస్థితియందు, ఈ విశిష్టా ద్వైతస్థితియే నిత్యసత్యముగ మననుద్ఘాటించుచు శుద్ధాద్వైతస్థితిని పూర్తిగా త్రోసిపుచ్చుట సంభ వించుచుండును. లేక, భేదముతోకూడిన ఖేలనకే సర్వప్రాధాన్య మొసగుచు, పరమాత్మయు జీవా త్మయు సర్వదా వేర్వేరని మనము భావించెడి పరి స్థితియందు, ఈ భేద భావమున కతీతమై అద్దానిని రద్దు పరచునదిగ చూపట్టు అనుభూతి విశేషము నెల్లనూ అసంగతముగ నెంచి ఖండించుటయు సంభ వించు చుండును. అట్లుగాక, పైన వివరించిన అతి మానస దివ్యచైతన్యస్వరూపభావనయందు మనము సుప్రతిష్ఠితుల మగుదుమేని, ఒండొంటిని బహిష్క రించుకొనజూచు నీ పాక్షికదృష్టులతో మనకిక పని లేదు. ఏకత్వమును గురించియు అనేకత్వమును గురించియు మనకుగల పరిచ్ఛిన్నభావముల కతీతమైనది ఆ పరాత్పర తత్వము. ఆ తత్వములో, ఏకత్వానేకత్వముల ఖేల అనంతముగా, అవిచ్ఛిన్నముగా కొనసాగుచున్నది. ఆ ఖేలయందు, ఏకత్వము అనేకత్వాభివ్యక్తికి ఆధార స్థానమై వరలుచుండగా, అనేకత్వము తిరిగి ఏకత్వ మును చేరుకొని పరమాభివ్యక్తియం దద్దాని నుప భోగించుటకు ఆధారస్థానముగా విరాజిల్లు చున్నది. ఏకత్వానేకత్వముల కీ రీతిగా అనుసంధానము కూర్చెడి దివ్యతత్వమే అతిమానసచేతన.

అవిద్య, అజ్ఞానము, అనుదానికీ అతిమానస చేతనలో ఎంతమాత్రమూ తావులే దనునది గమనించ వలసి యున్నది. అచట ఉన్నదెల్ల విద్యాలీల, విజ్ఞాన లీలయే. అవిద్యాక్షేత్రము దీనిక్రింది భూమికల యందు. కాని యీ అవిద్యను కల్పించినదియు అతి మానసమే. ఏ దివ్యలీలను లక్షించి సచ్చిదానం దము అతిమానసమై ఋతచిద్విలాసమై వెలసినదో, దాని విస్తృత సాఫల్య సిద్ధికొరకే ఈ అవిద్యాకల్పనము జరిగినది. స్వరూపమును మరుగుపరుచుట ఈ అవిద్యా లక్షణము. స్వరూపమునట్లు మరుగుపరుచుట ద్వారముననే అవరలోకసృష్టి జరిగినది. మనః ప్రాణ భూమికలు నడిమి అంతస్తులుగా ఏర్పడిన ఈ అవర సృష్టియందు అట్టడుగుభూమిక జడము. స్వరూప మీ జడపదార్థమునందు పూర్తిగా మరుగుపడి పోయినది—

కాని అట్లు మరుగుపడి పోవుటకు కారణమా జడము నాధారముగా చేసికొని తిరిగి స్వస్వరూపోపలబ్ధి దెసగా పునర్వికాసమునందగోరుటయే. అతిమానస చేతన యందు ముందుగనే నిక్షిప్తమై యున్న సంకల్పము ప్రకారము ప్రకృతియే ఈ మహాయోగ సాధన కార్య క్రమమునంతనూ నిర్వర్తించుచున్నది. జడరూప మైన అంధతమస్సులోనికి తొలుత కూరుకుపోయిన ప్రకృతియే ఆ తమస్సును క్రమక్రమముగా సడలించు కొనుచు ప్రాణమయ, మనోమయచేతనల వెలువరించి, ప్రాణసమన్విత జడశరీరమునందే మనోమయుడగు మానవుని వెలయించినది. కాని, మనస్సుకూడ అవిద్యా క్షేత్రములోనిదే యగుటచే, లక్షింపబడిన గమ్యము దెసకింకనూ మరో ప్రస్థానము కొనసాగవలసియే యున్నది.

మనస్సు నతిక్రమించి పరతత్త్వమును చేరుకొను ప్రయత్నములను మానవుడు యుగములుగ చేయుచునే యున్నాడు. పలువిధములైన యోగమార్గములు వీటి ఫలముగనే ఎన్నెన్నో వెలసియున్నవికూడ. ఇంతవర కునూ అతడు సాధించిన విజయములు అల్పములని చెప్పుట కెంతమాత్రమునూ వీలులేదు. కాని మనస్సు నతిక్రమించి పరతత్త్వమును చేరుట మాత్రమేకాదు— విశ్వప్రకృతియు, విశ్వప్రకృతి ద్వారమున అతిమానస దివ్యచేతనయు లక్షించిన గమ్యము. విద్యాక్షేత్రములోని అతిమానసచేతన అవిద్యాక్షేత్రములోని కవతరించి అవరప్రకృతిని రూపాంతరము చెందించుటద్వారా మనః ప్రాణ దేహములయందే దివ్యలీలను ప్రతిష్ఠించవలసి యున్నది. అతిమానసచేతనయందు లక్షితమైన బహుత్వలీలావైభవమునకు చరమ సాఫల్య సిద్ధి అప్పటికిగాని కలుగదు. అతిమానసచేతన అవర ప్రకృతిలోని కవతరించి దానిని రూపాంతరము చెందించు మహాకార్యము విధి నిర్దిష్టము. కాని, అతిమానసచేతన క్రిందికి అవతరించివలెనంటే అద్దానికొరకు క్రింద నుండి తీవ్రమైన ఉత్కంఠ, అందుకవసరమైన విశుద్ధి సంపాదన, అనన్యదీక్షతోకూడిన ఆత్మసమ ర్పణము ఒనగూడుట అత్యంతావశ్యకము. శ్రీ అరవిందులు రూపొందించిన పూర్ణయోగము ఇందుకొరకేర్పడిన సాధనప్రణాళికయే.

వేదములయందలి ఋతచిత్ భావన మాదిరి గనే, తంత్రగ్రంథములలోని సదాశివ, ఈశ్వర, శుద్ధ విద్యాతత్త్వములు, భగవద్గీతయందలి పరాప్రకృతి, పురు షోత్తమతత్త్వ భావనలుకూడ శ్రీ అరవిందుల అతి మానస తత్త్వార్థసూచకములే యనుటకు సందేహము లేదు. తన దర్శనమును రూపొందించుకొనుటలో అవి ఆయన కెంతగానో తోడ్పడియుండుటకూడ అసంభా వ్యము కానేరదు. కాని, తార్కికప్రజ్ఞాతిశయముపై ఆధారపడికాక, మహోన్నతములైన ఆధ్యాత్మికానుభవ సంపద్విశేషములపై ఆధారపడి ఆయన తన దర్శనమును వెలయించుకొనియుండుటచే ఒక వినూత్న సందేశమును లోకమునకు అందీయ గలిగి నారు. ఆయన కావించిన అతిమానసదివ్యచేతనా స్వరూప వివరణము ఈ వినూత్న సందేశానుసారముగా కూడ తన రూపురేఖలను దిద్దుకొనినది. అతిమానస చేతన అవరప్రకృతిని రూపాంతరము చెందించి పృథ్విపై దివ్యమానవజాతిని వెలయింపవలసి యున్నదనునదే ఆ వినూత్న దివ్యసందేశము.

అతిమానసచేతనకు మాయాపదమును కూడ శ్రీ అరవిందులు వాడియున్నారు. ఆ మాయ దేవమాయ, పరాశక్తి. గుణాత్మికయైన అవరమాయకాదు— 'యా మా సా మాయా'—'ఏది లేనిదో అది మాయ,'— అనే వ్యుత్పత్త్యర్థము ఆ దేవమాయకు చెల్లదు. 'మాతీతిమాయా,' 'ఏది కొలతవేయుచున్నదో అది మాయ,'—అనే వివరణము చెల్లుతుంది. అనగా, పర తత్త్వాభిన్నమైన ఆ దేవమాయ తన స్వరూపములోని అనంతవైభవసంపత్తిని కొలిచిపోయుచున్నట్టిది. అనగా బహుప్రకారములుగా తననుతాను అభివ్యక్తముగావించు కొనుచున్నట్టిది. కాని, ఎంతగా కొలిచిపోసినను, ఎంతగా అభివ్యక్తమొనర్చుకొనినను ఆ సంపత్తి తరుగు నదికాదు. అది అనంతము. కావుననే ఆ సచ్చిదానంద మెట్లనంతమో, ఈ సృష్టిక్రీడకూడ అట్లే అనం తము. దేవమాయాశక్తిద్వారా ఈ అనంతక్రీడ కొన సాగుచున్నది. ఇది మనఃకల్పితమైన భ్రమకాదు. సృష్టిలోనిదేయైన మనస్సుచేత సృష్టి కల్పించ బడినదనుట అసంగతము. అవరమాయాకల్పితములైన భ్రమలు తొలగి అవిద్యలోనుంచి బయటపడవలసినదే. కాని, అది దేవమాయాకల్పితమైన దివ్యలీలలోనికి మనకు ప్రవేశము కల్పించునదిగా పరిణమించుట అత్యంతావశ్యకము.

ఆంధ్రకవులు - దేశస్వాతంత్ర్యము

డా. దివాకర్ల వేంకటావధాని

స్వీయములయిన దేశ రాష్ట్ర మతాదులపై నభిమానముండుట మానవు లెల్లరికిని సహజమే. వారి మాటలయందు, వ్రాతలయందు ఆ యభిమానము జ్ఞాతముగనో, యజ్ఞాతముగనో వ్యక్తము చేయబడుచునే యుండును. సాధారణ సమయములందు కంటె నా దేశరాష్ట్రమతాదుల యభ్యుదయమున కంతరాయము కలిగించు పరిస్థితు లేర్పడునప్పుడది ద్విగుణీకృతమై యావేశపూరితముగా వెల్లివిరియు చుండును. ఆంగ్లేయులు మన దేశమును బరిపాలించు నపుడే పలు రాష్ట్రము లేర్పడినవి. ఆంధ్రులెంత యత్నించినను ప్రత్యేకరాష్ట్రమును బడయ జాలకపోయిరి. రాష్ట్రాభిమానమంతకు ముందును ఆంధ్రకవుల హృదయములందు నిండారియుండినను అది బహిర్గతముకాక గాఢముగనే యుండిపోయెను. తమకు ప్రత్యేకరాష్ట్ర మేర్పడలేదను వ్యథ కాలక్రమమున వర్ధిల్లి కావ్యరూపమును బొంద నారంభించెను. రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల మున్నగువారి రచనలలో దాని యుజ్జృంభణము మనకు గానిపించును. రాష్ట్రీయభావమును ప్రజాహృదయము లందు రేకెత్తించి రాష్ట్ర సంపాదనమునకు నాయకు లొనరించిన యత్నములు, త్యాగములు మున్నగు వానితోపాటు కవుల యావేశ పూరితములయిన రచనలును చాలవఱకు దోడ్పడెననుటలో నత్యుక్తి యుండజాలదు. జాతీయభావ మంత విశాలమును ఉదారమును గాక పోయినను రాష్ట్రీయభావముకూడ ప్రశంసింప దగినదే. సమరస భావముతో బరికించినచో జాతీయభావ మంగిమనియు, రాష్ట్రీయభావ మంగ మనియు జెప్ప వచ్చును.

క్రీ. శ. 14 వ శతాబ్దివఱకును భారతదేశమునందలి పలుభాగములను దేశీయరాజులు పాలించిరి. వారి పాలనమున ప్రజలు స్వాతంత్ర్య సంపత్సౌఖ్యముల ననుభవించుచు నానందమున విలసిల్లిరి. తరువాత దేశమునందలి కొంతభాగము మహమ్మదీయరాజుల యేల్బడి క్రిందికి వచ్చెను. అదృష్టవశమున నాంధ్రదేశము మాత్రము రెడ్డి పద్మనాయకులయు, విజయనగర సార్వభౌములయు పరిపాలనమునుండి స్వాతంత్ర సౌఖ్యము ననుభవించుచునే యుండెను. విజయనగర రాజ్యపతనముతో నాంధ్రుల స్వాతంత్ర్యసౌభాగ్యమును అంతరించెను. తరువాత నాంధ్రదేశము పలువురు రాజులచే పరిపాలితమై తుద కాంగ్లేయ రాజ్యమున నంతర్భవించెను. ఆంగ్లేయులు సుమారు రెండున్నర శతాబ్దులకాలము భారతదేశము నాక్రమించి దానిని నిరంకుశముగా బరిపాలించిరి. ఆ కాలమునం దంతయు దేశము పారతంత్ర్యపంకమగ్నమై, వివిధ రంగములం దభ్యుదయమును గోల్పోయి, యధమ పరిస్థితు లనుభవించెను.

పరరాజపరిపాలనాభారము సోకినకొలది భారతీయులలో స్వాతంత్ర్యపిపాస పెంపొంద సాగెను. వివిధ రాష్ట్రములందు బలువురు నాయకులు ధన మాన ప్రాణములనైన లెక్కసేయక స్వాతంత్ర్య సంపాదనా బద్ధకంకణులయి యఖండమైన కృషి కావించిరి. ఆ కృషియే క్రమముగా బెంపొంది, మహాత్ముని నాయకత్వమున ఫలించి, దేశమును మఱల స్వాతంత్ర్య సంపద్శోభిత మొనరింప జాలినది.

పరరాజపరిపాలితమై దేశము దాస్యాంధకారమున నల్లాడు సమయమున వివిధ ప్రాంతములందు కవివర్యుల హృదయములు కుమిలి కవితారూపమున ప్రసరించినవి. ఆ కవితయు నప్పటి రచనలును జాతీయభావ బంధురములయి చదువువారి యొడళ్లు పులకింప జేయును. ఆ రచనలు వివిధ ప్రక్రియలలో నున్నవి.

కొన్ని గేయములు, కొన్ని కావ్యములు, కొన్ని నవలలు, కొన్ని జీవిత చరిత్రలు, కొన్ని నాటకాదులు. మఱియు రాజకీయనేతల చేతలు కవిపుంగవుల కైతలు రెండును రెండు విధముల చైతన్య పునరుజ్జీవనముకు సాధనము లయినవి. దేశభాషలన్నింట నప్పుడు జాతీయతోద్బోధకములు, స్వాతంత్ర్య వాంఛా సముద్దీపకములునగు జీవవంతములయిన రచనలు వెలువడినవి. ప్రత్యక్షముగా గాకపోయినను పరోక్షముగానైనా ఆ రచనలు స్వాతంత్ర్య సంపాదనమునకు సాయపడినవనుటలో సందేహము లేదు.

ఆంధ్ర దేశమున నాబాలగోపాల విదితమై పండిత పామరులందఱికిని ప్రబోధకరమై స్వాతంత్ర్య వాంఛను రేకెత్తించిన తెలుగు గేయములలో శ్రీ గరిమెళ్ల సత్యనారాయణగారి 'మాకొద్దీ తెల్లదొరతనము' అనునది ప్రథమగణ్యమైనది. ఇది పరదేశీయులయిన యాంగ్లేయులు దేశమును బాలించుచు గావించిన యక్రమముల నధర్మములనన్నింటిని సులభసరళమైన భాషలో వెల్లడించి దేశీయు లందరికిని తెల్లవారి దొరతనముపై నసహ్యాభావము కలిగించినది. జనుల హృదయాంతరాళములం దడగి వెలువడ వెఱచుచున్న జాతీయ భావమును నది పొంగి పొరలునట్లు చేసినది. ఆంధ్రజనులందఱిలో జాతీయభావమును రగుల్కొల్పిన యింత శక్తివంతమైన రచన మఱి యొకటి లేదు. తరువాత వెలువడిన జాతీయ రచనలలో శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి స్వరాజ్య రథము మొదలయినవి పేర్కొనదగినవి.

ఆంధ్రదేశమున జాతీయతా సంధుక్షకములయిన చరిత్రలు జీవిత చరిత్రలు పెక్కున్నను వానిలో రెండు ముఖ్యముగా బేర్కొనదగియున్నవి. ఒకటి డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి కాంగ్రెసు చరిత్రకు శ్రీ కొడాలి ఆంజనేయులుగారు చేసిన యాంధ్రానువాదము. రెండవది మహాత్ముని స్వీయ చరిత్రకు విద్వదగ్రణులు, శతావధానులునైన శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారొనరించిన యాంధ్రీకరణము. రెండును జాతీయోద్యమ చరిత్రను పరపరిపాలనా పీడనమును బహువిధముల వ్యక్తీకరించి తెలుగు వారిలో జాతీయ భావమును నిండారునట్లొనరించినవి. అందును మహాత్ముని యాత్మకథ కథవలెనే సాగుచు కొకవంక నహింసా సత్య ప్రభావమును, వేఱొకవంక స్వాతంత్ర్య సంపాదనాసక్తిని ప్రబోధింప జాలినది. ఇట్లే నెహ్రూ, వినాయక సావర్కార్, బోసు మున్నగు వారి జీవిత చరిత్రలుకూడ జాతీయ భావ సంవర్ధకములై సన్నుతికెక్కినవి.

ప్రత్యక్షముగనో, పరోక్షముగనో పతితలలో జాతీయ భావమును ప్రేరేచిన నవలలును, ఖండ కావ్యములును బెక్కువెలసినవి. అట్టినవలలలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి ముఖ్యమైనది. స్వాతంత్ర్య సంపాదనము దేశభక్తి మున్నగునవి యిందు ప్రత్యక్ష వస్తువులు కాకపోయినను, అస్పృశ్యతా నివారణమును మహాత్ముని యాదర్శ సిద్ధాంతముల కిందు మిక్కిలి ప్రాధాన్యమొసంగ బడినది. ఇట్లు పరోక్షముగా జాతీయ భావమును బెంపొందించిన రచనలింకను ననేకములున్నవి. ఆ కాలపు కవులు పత్రికలలో ప్రకటించిన ఖండకావ్యములు పెక్కింటిలో దేశభక్తియు స్వాతంత్ర్యానురక్తియు ప్రముఖస్థానము నాక్రమించియున్నవి. అవి యప్పటి ప్రజల భావసంచలనమునకు ప్రతినిధులు. భారత మాతృ దాస్య శృంఖలా విచ్ఛేదమునకై వారు పడు నావేదన యందలి ప్రత్యక్షరమందును ప్రత్యక్షమగుచుండును.

మనదేశచరిత్రలో స్వాతంత్ర్య సంపాదనమునకై సర్వస్వమును సమర్పించి, భారతీయ ధర్మ సంస్కృతి ప్రతిష్ఠాపనార్థము యావజ్జీవితము పాటుపడిన మహనీయులనేకులున్నారు. అట్టివారిలో రాణా ప్రతాపుడు, శివాజీ మున్నగువారు అగ్రగణ్యులు. వారి జీవితమంతయు దేశదాస్యనిర్మూలన పరాయణమై భాసిల్లియుండెను. అట్టివారి జీవిత చరిత్రలను వస్తువులుగా గ్రహించి మహాకావ్యములు నిర్మించుట జాతీయతాభావ ప్రచారమున కెంతయైన తోడ్పడుననుటలో సందేహము లేదు. ఈ విషయమును గ్రహించి శ్రీ రాజశేఖర శతావధానిగారును, శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారును, రాణా ప్రతాప చరిత్రము, శివభారతము, రచించిరి. అవి భావములచేతనుగూడ జాతీయతా నిధానములని చెప్పదగిన మహనీయకావ్యములు. కవులందు దమ నాయకుల నాదర్శపురుషులనుగా దీర్చిదిద్దుటయేకాక, భారతీయ సంస్కృతి ధర్మవిశేషములను

జాల మెలకువతో నిరూపించి నిరుత్సాహ నిర్విణ్ణమయిన యాంధ్రజాతికొక యాదర్శమార్గము నందీయ జాలిరి. ప్రతాపుడును శివాజీయు ధైర్యోత్సాహములు ప్రేరేప ప్రబలులైన శత్రువులపై కుటికి విజయము సాధింప యత్నించుట పారతంత్ర్యపరాభూతులయిన పఠితలకు కర్తవ్య నిశ్చయమున పరమోపదేశమై పరిఢవిల్లినది.

'భరతఖండంబు నుద్ధరింపగ జనించు
ధూర్జటివి నీవు రాజమాత్రుడవు కావు'

'భారతమహాఖండంబు దాస్యాంధకార
నిమగ్నంబయియుండ
లోకముల దౌర్భాగ్యమ్మునుం
దీతెనేడని హర్షింప ప్రతాపభాను
డుదయంబైయుండె'

'అతిభీమంబుగ బెల్లురేగి
నిబిడంబై మూగి యీ సర్వ భా
రతదేశంబును ముంచివైచిన
మహోగ్రంబైన దాస్యాంధకా
ర తతిన్ దేవుని దృష్టికూడ
నణుమాత్రంబున్ జొరంబోని దు
స్థితి సంధించెడు పాపికాల
మరుదెంచెంజూచి యెట్లోర్తునో'

మున్నగు పద్యములు చదువునపుడు పఠిత కథా ప్రకరణమును విస్మరించి కార్యరంగమునకు దుముకు ననుటలో సందియము లేదు. పై రెండు కావ్యములును వస్తు సంఘటనమున యందును, రచనా పాటవము నందును, భావగాంభీర్యమునందును అద్వితీయములై యక్షరమక్షరమందును జాతీయతను వెదజిమ్ము చున్నవి.

శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి విజయశ్రీ కావ్యము కూడ నిట్టిదే. ఇందలి శరీరము ప్రాతదేకాని చైతన్యముమాత్ర మతినవ్యమైనది. సుపరిచితమైన భారతకథయందే కవిగా రాధునిక భావముల నెన్నింటినో యిమిడ్చి పఠితలకుత్తేజము కలిగించి యున్నారు. ఇందు కురుక్షేత్ర సంగ్రామమునకును భారత స్వాతంత్ర్య

సంగ్రామమునకును బోలిక వ్యంగ్యము చేయబడి యున్నది. దేశమునందలి వివిధ పక్షములవారి వివిధ వయస్సులవారి భావములిందు జక్కగా వివరింపబడి యున్నవి. ఇది నిజమునకు పాండవ కౌరవ సంబంధి గాథయేయైనను, నిశితముగా బఠించువారికి మైమఱపు కలిగించి స్వాతంత్ర్య సంగ్రామ భ్రాంతి యొదవించుచున్నది. కావ్యాంతర్గతములయిన స్వతంత్ర భావములకు మృదుమధురశైలి యెంతయో మెఱుగు దిద్దజాలినది.

గౌతమ బుద్ధునికిని గాంధీ మహాత్మునికి పెక్కు విషయములలో సాదృశ్యమున్నది. సత్యాహింసలా యిరువురికిని ఆరాధ్య లక్షణములు. అందుచే నా యిరువురిలో నొకరి చరిత్ర రెండవవారి చరిత్రను స్ఫురింపజేసి యానందావహము కాజాలుచున్నది. ఈ కారణము చేతనే కాబోలు నా కాలమున బుద్ధజీవిత వస్తుకములయిన కావ్యములు పెక్కు బయలుదేఱినవి. ప్రత్యక్షముగా వానికిని, భారత జాతీయతకును నంతగా సంబంధము లేకపోయినను గాంధీ మహాత్మునకును బుద్ధదేవునికిగల భావసాదృశ్యము వానినిగూడ జాతీయతాభావ బంధురముల నొనరించినది. శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు మహాత్ముని జీవితమును వర్ణించుచు రచించిన పద్యకావ్యముకూడ నిట్టిదే.

స్వాతంత్ర్యము లభించినపిమ్మట ధర్మ చక్రమునకును ప్రాధాన్యము కలిగినది. అది అశోక చక్రవర్తికి సంబంధించినదగుటచే కొందరు కవులా మహారాజు చరిత్రమును గ్రహించి కావ్యములు రచించిరి. అట్టివారిలో శ్రీ కల్లూరి నారాయణగారి అశోక సమ్రాట్టు చరిత్రము పేర్కొనదగినది. స్వాతంత్ర్యలాభమునకు బూర్వము కవులును, రచయితలును తత్సంపాదనమునకు సాధనములయిన రచనలు కావించిరి. స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట స్వతంత్ర ప్రభుత్వము కవులను రచయితలను ప్రోత్సహించుచు దేశమునందలి అన్ని భాషల యభ్యుదయమునకును దోడ్పడుచున్నది.

జాతీయతాభావ సంధుక్షణమునకు దోహదమును గూర్చిన ముఖ్యములయిన రచనలను మాత్రమే యిచ్చట స్పృశించి విడిచితిని. కాలపరిస్థితునుబట్టి యిట్టి రచనలెన్నో యిప్పుడు బయలుదేరి స్వాతంత్ర్యసిద్ధికి దోడ్పడ జాలినవి. రాష్ట్రీయభావప్రేరకములయిన కావ్యములు మన భాషలో జాలగలవు. అవికూడ నొక విధముగా జాతీయతకు బెంపు చేకూర్చినవే.

'నేటితో నస్వతంత్రతా నియతమైన
యీ బ్రదుకు తెల్గువారు భరింపలేరు'

మొదలయిన భావములతో గూడిన రచనలు రాష్ట్రీయ భావ ప్రధానములయిన గ్రంథములలోనివే యైనను జాతీయతాభావమునకుగూడ నుత్తేజము గల్పించునట్టివే. కవుల కావ్యములు ప్రజలలో జాతీయ భావమును చెలరేచినట్లే దేశమున పొంగిపొరలుచున్న జాతీయభావముకూడ కవుల నావేశపూరితుల గావించి రచనోన్ముఖుల నొనరించినవి. ఈ విధముగా జాతీయభావమును, కవిత్వమును పరస్పర పోషకములై వర్ధిల్లినవి.



కోరిక

శ్రీ తులసీకృష్ణ

ఏ సుదీర్ఘ శుభోదయ భవిష్యమందొ
బృందలో, గోపాలునిగ పుట్టుకొఱకు
వంశగౌరవకీర్తి సంపదలనైన
త్యాగమొనరింతు, నట్టి భాగ్యమ్ముకొనగ

ఆ యమునానదీ పరిమళావృత శీతలవారిలోన, నే
హాయిగ స్నానమాడెద, వనాంతర సీమల మేయు గోవులన్
కాయుచు కూరుచుండెద, నొకానొక నీల తమాలశాఖికా
చ్ఛాయల, ప్రొద్దుపుచ్చెదను చక్కని 'కుంజ' సుమమ్ములల్లుచున్

తెలతెలవాఱుచున్నపుడు దిక్కులుషోదయ రాగరంజిత
మ్ములయిన గోపికా కర విముక్త వినిర్గత క్షీర ధారలో
లలితమనోజ్ఞ గాన మతిశ్రావ్యతనింపి, బయళ్ళకేగు గో
వుల పదధూళిలో, చెలులు, పోదమురండని నిద్రలేపెదన్

నీలనీలతమాల నికురంబముల క్రింద
కటిక చీకటి గుంపు కప్పినపుడు,
కడసంజ వెలుగులో కల్లోల వాహినిన్
గడవ గోపికలు భయంపడినవేళ,
ఘననిదాఘాత్యయ కాదంబినులచూచి,
అడవినెమళులు నాట్యమాడువేళ,
తరుణవికసిత పుష్పతారుణ్యవతివోలె,
తొలి వసంతపురాత్రి నిలిచినపుడు

దక్షిణానిల స్నిగ్ధగాంధర్వగీతి
వినుచు గోపాలకుల గూడ వేడ్కలాడువు
ఏ అశోక నికుంజ సామీప్యమందొ,
బృందలో నొ, మునుముందు పుట్టుకొఱకు

లేదుమిత్రమ! నాకు లవలేశమేని
మాతృభూమిని గొప్పసన్మానమొంది
కీర్తి గడియింప, జ్ఞానకుధార్తులకును
దానమొనరింపకోర్కె సుంతేనిలేదు.

యేననెడి సర్వమును మొత్తమిచ్చివైతు
ఏ అశోకనికుంజ సామీప్యమందొ
బృందలోననొ, మునుముందు పుట్టుకొఱకు...

(రవీంద్రుని 'లవర్స్‌గిఫ్ట్'కు భావానుకరణ)

———



తెలుగు మాండలికాలు - కరీంనగర్ జిల్లా

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం

హైదరాబాదు తెలుగు అకాడమీవారు తెలుగు దేశంలోని భిన్నభిన్న ప్రాంతాల మాండలిక వ్యవహారాన్ని పరిశీలించడానికి పూనుకొని దాంట్లో తొలి ప్రయత్నంగా కరీమునగరంజిల్లా మాండలికాన్ని సర్వే చేయించి మొదటి బుల్లెటిన్‌గా ప్రకటించారు. ఈ ప్రయత్నం అభినందించదగినదనీ, ప్రయోజనకరమైనదనీ వేరే చెప్పనక్కరలేదు. ఈ సర్వేవల్ల ఉద్దేశించిన లక్ష్యాలను అకాడమీ డైరెక్టరు డాక్టరు పోణంగి శ్రీరామఅప్పారావుగారున్నూ, బులెటిన్ సంపాదకులు డాక్టరు బూదరాజు రాధాకృష్ణగారున్నూ తమ భూమికల్లో వివరించి ఉన్నారు.

1. తెలుగు మాండలికాలలోని ఏకత్వాన్ని నిరూపించడం.

2. ఈ ఏకత్వాన్ని వర్ణనాత్మక వ్యాకరణంగా రూపొందించడం.

3. కావ్యనాటకాలలో దేశ, పాత్రలకు అనుగుణంగా వ్యవహారభాషాప్రయోగానికి వీలుకలిగించడం.

డాక్టరు అప్పారావుగారి ప్రకారం మాండలికాల సర్వే ఉద్దేశాలు ఇవి. డాక్టరు రాధాకృష్ణగారు వీటినే భంగ్యంతరంగా వివరించారు.

1. తెలుగు భాషలోని ప్రాంతీయ సాంఘిక భేదాలను సాధ్యమయినంత విపులంగా సేకరించి గ్రంథస్థం చేయటం.

2. స్థానికంగా భిన్నవిధాలుగా ఉన్న భాషాప్రమాణాలు రాష్ట్రవ్యాప్తమైన ప్రామాణిక భాషగా పొందుతున్న నిరంతర పరిణామక్రమాన్ని నిరూపించటం.

ఇక్కడ కొందరు ఒక శంక చేస్తారు. మన సంఘంలో వర్గభేదాలు, కులభేదాలు, మతభేదాలు కోకొల్లలుగా ఉండనే ఉన్నాయి. వాటిని తుడిచివేయడానికీ, మరిచిపోవడానికీ, సంఘంచే మరపింప చెయ్యడానికీ ప్రయత్నం చెయ్యాలికాని, ప్రాంతీయ భేదాలను సాంఘిక భేదాలను విపులంగా సేకరించి గ్రంథస్థం చేయటం, సంఘానికి అపకారం చెయ్యడం కాదా అంటారు. ఇది మన రాజనీతిజ్ఞుల దృక్పథం. ఇదీ ఉచితంగానే ఉంది. జీవితము ఆర్థిక పోరాటానికి రంగము. వర్గాన్ని, కులాన్ని, మతాన్నిబట్టి ఆర్థికావకాశాల సంకోచ వ్యాకోచాలు నిరోధించి, మాత్సర్యాలు కలహాలు వారించటానికి వర్గ, కులభేదాల్ని తగ్గించాలనీ, మరిపించాలనీ రాజకీయవేత్తలు భావించడం బాగానే ఉంది. అయితే తెలుగు అకాడమీవారు ఇక్కడ అనుసంధిస్తున్నది—సాంఘిక విభేదాలు, ఆర్థిక అసమానతలు కావు. భాషాసంబంధమైన ఐక్యతలూ వైవిధ్యాలు వారు అనుసంధిస్తున్నారు. దీనిలో ఎవరికీ లాభనష్టాల ప్రసక్తి లేదు. పైగా ఇది శాస్త్రవిషయం. ఒక వస్తుతత్వం ఎల్లా ఉండాలో శాస్త్రం విధించదు. అది వాస్తవికంగా ఎట్లా ఉందో విశ్లేషణ చేసి చూపిస్తుంది. శాస్త్రము ఆదర్శవాదికాదు. వాస్తవప్రదర్శిని. వైద్యశాస్త్రజ్ఞుడు శరీరాన్ని విశ్లేషణచేసి నరాలు, ఎముకలు, గ్రంథులు, రక్తమాంసాదులు వాటి సంస్థానాన్నిగూర్చి చెప్పతాడుకాని ఒక శరీరాన్ని సౌందర్యవంతంగా చెయ్యడం ఎట్లాగో చెప్పలేడు ఆ భారము అఘటనఘటనాసామర్థ్యంకల ప్రకృతిశక్తిది.

భాషాశాస్త్రంకూడా వైద్యశాస్త్రం మల్లేనే వికారమైన శాస్త్రము. శరీరాన్ని విశ్లేషణచేసి చూపిస్తే జుగుప్సాకరంగా ఉంటుంది. భాషను వ్యాకరించి చూపిస్తే విసుగ్గా ఉంటుంది. మాండలిక భాషా

విశ్లేషణం ఇంకా వికారంగా కనబడుతుంది. కరీంనగరంజిల్లా మాండలికమని ఉదాహరణ ఖండికలుగా ఇచ్చిన భాగాలను చదివితే కరీంనగరంమీద అక్కడి జనులమీద కృష్ణా గోదావరి జిల్లాల వారికి విరక్తి కలుగుతుంది. ముందు ముందు అకాడమీవారు కృష్ణా గోదావరి జిల్లాల మాండలిక భాషా ఖండికలు ప్రకటిస్తే, అవి చదివిన కరీంనగరం మండలంవారికి కృష్ణా గోదావరిజిల్లాల భాషమీద విరక్తి జనింపక తప్పదు. మాండలిక భాషా పరిశోధనము చివరికి అన్యోన్య విరక్తి కలిగించేదైతే ఈ శ్రమంతా ఎందుకు, ఈ ధనవ్యయం ఎందుకు అని స్థూలంగా సందేహం కలుగుతుంది సాధారణ పౌరునకు.

ఇక్కడ మనము ఆ పౌరునికి ఓపికతో నచ్చ చెప్పాలి. భాష అనేది ఒక విచిత్ర వ్యవస్థ. దానిలో ఏకత్వమూ ఉంది, అనంతమైన వైవిధ్యమూ ఉంది. అసలు భాష అంటేనే వైవిధ్య మూలకము. లోకంలో భాష ఎక్కడ ఉంది? మాట్లాడే జనుల నోళ్ళల్లో ఉంది. వారంతా ఎవరికి ఇష్టం వచ్చినట్లు, ఎవరికి చేతనైనట్లు వాళ్ళు మాట్లాడుతూంటారు. ఫలాని విధంగా మాట్లాడాలని లోకుల్ని ఎవరూ శాసించలేరు. అట్లా శాసనం చేసినా అది చెల్లదు. దుర్భాషలు, అశ్లీలాలు పదిమందిలో మాట్లాడకూడదని సంఘంలో ఒక అలేఖ్య సంప్రదాయం ఉంది కనుక నలుగురూ దానికి కట్టుబడి ఉంటున్నారు కాని అంతకుమించి భాషణ విషయంలో శాసనాలేవీ లేవు. ప్రతీ వ్యక్తికి ఒక ఉచ్చారణ విశేషం ఉంటుంది. అందుచేత అతని భాష అతనికి ప్రత్యేకం అన్నమాట. దీన్నే మాండలికము అంటున్నాము. ఇదే నిజమైతే తెలుగు వారెంత మంది ఉన్నారో అన్ని తెలుగు మాండలికాలు ఉన్నాయన్న మాట. వాదంవరకూ ఇది సత్యమే. ఒప్పుకోక తీరదు. అయితే లోకంలో వ్యవహారం జరగడం ఎల్లాగ? ఒకరి మాట ఒకరికి అర్థంకాని అనర్థకం ఏర్పడుతుంది గదా అంటే—శాస్త్రజ్ఞులు దీనికొక పరిష్కారం చెప్పారు. ఆ పరిష్కారం వారు కల్పించింది కాదు. సంఘం తనకుతానే అప్రయత్నంగా, అవిదితంగా కల్పించుకుంది. ఎట్లాగంటే—ప్రతీవ్యక్తీకూడా నిరంతరం ఒక ప్రయత్నం చేస్తూనే ఉంటాడుట. భాషా విషయంలో తన వ్యక్తిత్వం నిలుపుకుంటూనే ఎదుటి వ్యక్తికి అర్థమయేటంత స్పష్టంగాను సావధానంగానూ మాట్లాడడానికి ప్రయత్నిస్తాడు. ఇది ప్రకృతి శాసనమన్నమాట. లేకపోతే అతనిమాట ఎదుటి వానికి తెలియకపోవడం, వ్యవహార భంగము అవడం అనే అనర్థాలు ఏర్పడతాయి. ఈ ప్రయత్నాన్నే శాస్త్రజ్ఞులు Average pronunciation-సగటు ఉచ్చారణరీతి - అని వర్ణిస్తారు. సగటు ఉచ్చారణ పద్ధతిపై సంఘముయొక్క భాషావ్యవహారం నడుస్తూందన్నమాట.

ఎదుటి వారికి అర్థమయేరీతిలో మాట్లాడాలనేది అపూర్వ విషయమేమీ కాదు. కరీంనగరం మాండలిక ఖండికల్లో దీనికి ఒక చక్కని నిదర్శనం దొరుకుతూంది. ఉన్నత విద్యావంతుడైన ఒక వ్యాపారి సంభాషణ మచ్చుగా మనకు ఇవ్వబడింది. (పుటలు 95—100). వ్యాపారి గనుక సహజంగానే ఉపాయశాలి అని మనం గ్రహించవచ్చును. ఆయన అంటాడు గదా—'ఇంటిమెట్ల్తోని మాట్లాడ్ టవ్ డొమొ కొదిగ క్లోజ్గ మాట్లాడ్తవ్ః—అరెతురె అన్కుంట ఏమొ ఎట్లగొ జేస్తున్నవే సంగతి అనుకుంట. అంటే మన ఇక్కడి టెంపోలో ఇక్కడి లేంగ్వేజ్లో మాటాడ్ తవ్ః గద. ఇఅవేరె కొత్తవాళ్ళొస్తే మీయట్ వంట్ ఫెండ్సొస్తే కొదిగ్ లేంగ్వేజ్ డిఫరెంట్గ చేంజెసి, ఏవండి ఎవ్డొచ్చిను—ఏ సంగతి అంతమంచిదెన. ఎక్కడ్ జదివ్రిను—ఇట్లగ్ మంచిగ్ మాటాడ్తవ్ క్లియర్గ.

అడిస్ట్రిట్స్ వాళు క్రిష్ణా డిస్ట్రిక్టు, గోదావరి డిస్ట్రిట్సు ఇవునయ్గద ఆ డిస్ట్రిట్స్ వాళు వాట్లాడ్తె అసల్ మనకు మనసునేబట్టది సరిగ లేంగ్వేజ్—ఇకడ కొదిగ్ మొదట్ల డిఫ్కల్టి అయింది. దాతర్వాత ఇప్పుడిప్పుడు కొద్దిగ డెవలప్ అయ్తందన్కొండి—వాళ్ల లేంగ్వేజ్ మన దాన్మీద ఇంప్రెసెవ్డు దాన్తోని వాలతోని మన వొకటి కాంటేట్సు పెర్యనా కొద్ది మనవ్ః గుడ, ఏవండి ఎక్కడ్ బొతాను. ఏం సంగతి ఇట్ల మనవ్ః డెవ్లవ్జెస్న." కొంచెం దీర్ఘమైన ఖండమే ఇచ్చాము ఈ వ్యాపారస్తుని మాండలికం తెలియాలని.

దీన్ని మాండలికాంతరంచేస్తేనేకాని కొన్ని జిల్లాలవారికి తెలియదు గనుక నా కర్థమైనట్లు చేస్తాను. ఈ వ్యాపారి అంటాడు. 'ఇంటిమేట్లతో (Intimates) మాట్లాడడమొ కొద్దిగ క్లోజుగా మాట్లాడుతాము. అరేతురే అనుకొంటూ, ఏమే (ఏమోయి అనుట) ఎట్లాగో చేస్తున్నావే. ఏం సంగతి అనుకుంటూ. అంటే మన ఇక్కడి టెంపోలో (Tempo) ఇక్కడి లాంగ్వేజిలో మాట్లాడుతాము గదా. ఇక వేరే క్రొత్తవాళ్ళొస్తే, మీ యటువంటి ఫ్రండ్సు వస్తే కొద్దిగా లేంగ్వేజి డిఫరెంటుగ ఛేంజి చేసి—ఏమండి, ఎప్పుడొచ్చినారు. ఏం సంగతి అంతా మంచిదేన. ఎక్కడ చదివినారు—ఇట్లాగ మంచిగ మాట్లాడుతాము. క్లియరుగ.

ఆ డిస్ట్రిక్టువాళ్ళ—క్రిష్ణా డిస్ట్రిక్టు, గోదావరి డిస్ట్రిక్టు—ఇవి ఉన్నాయిగద— ఆ డిస్ట్రిక్టు వాళ్ళ మాట్లాడితే అసలు మనకు మనసునేబట్టదు సరిగా లేంగ్వేజి. ఇక్కడ కొద్దిగ మొదట్లో డిఫికల్టీ అయింది. దాని తర్వాత ఇప్పుడిప్పుడు కొద్దిగ డెవలపు అవుతూందనుకోండి. వాళ్ళ లాంగ్వేజి మన దాని మీద ఇంప్రెస్ అవుడు (Impress) దానితో వాళ్లతో మన కాంటాక్ట్సు (Contacts) పెరిగినకొద్దీ మనం గూడా 'ఏమండి, ఎక్కడ పోతున్నారు. ఏంసంగతి? ఇట్లా మనం డెవలపు చేసినాము.'

ఈ వ్యాపారి భాషాశాస్త్రం అధ్యయనం చెయ్యక పోయినా దాని తత్వాన్నిమాత్రం బాగానే ఆకళింపు చేసుకున్నాడు. శ్రోతనుబట్టి వక్తయొక్క భాషణరీతి మారుతూ ఉంటుంది. సంఘంలో ప్రతీవ్యక్తికి ఆతని స్వాతంత్ర్యాన్నిబట్టి ఒక ప్రత్యేక మాండలికం ఉండడం శాస్త్రసమ్మతమైనా ఆచరణసాధ్యమైతేకాదు. అటు వంటి సజాతీయమైన కొందరి వ్యక్తుల గుంపునే మండలము అంటున్నాము. వీరందరి ఉచ్చారణరీతుల్లో కొన్ని సాధారణ లక్షణాలు ఉండడంచేత వారివారి భాష వారికి అర్థమయి వ్యవహారం నడిచిపోతూ ఉంటుంది. ఈ మండలాలు అనగా సగటు ఉచ్చారణరీతులుగల గుంపులు కులాన్నిబట్టికాని, వృత్తినిబట్టికాని, ఏక ప్రాంతనివాసంచేతకాని ఏర్పడవచ్చును. అవే మాండలిక భాషలు. కరీంనగరంజిల్లావాసుల సమష్టి ఉచ్చారణ రీతులూ, స్వరవైశిష్ట్యాలు, పదబంధాలు, పదాలు, సామెతలు—ఇవన్నీ కలిసి కరీంనగరం మాండలికము అనిపించుకుంటుంది. సర్వేచేసినవారు ఇంతదూరం వెళ్లినట్లు కనబడడంలేదు. కరీంనగరంవారికి ప్రత్యేక మని చెప్పదగ్గ పదబంధాలు, పదాలు, స్వరరీతులు మనముందు ఉంచబడలేదు. సంపాదకులైన డాక్టరు రాధాకృష్ణగారు ఆయాఖండికల చివర కొన్నివ్యాఖ్యా నాంశాలుచేర్చి, సదరు వ్యక్తియొక్కభాషను పాఠకుడు అర్థంచేసుకోడానికి కొన్నిసూచనలు చేశారు. అంత వరకూ బాగానేఉంది. కాని ఇది చాలదనిపిస్తుంది.

ప్రతినిధివక్తల విషయంలో ఒకటి రెండు సూచనలు చెయ్యాల్సిఉంది. వీరిలో రాజకీయ కార్య కర్త, బ్యాంకి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, ఉన్నత విద్యా వంతుడైన వ్యాపారి, కాలేజి విద్యార్థి, స్కూలు విద్యార్థి, నేతపనివాడు, రైతు ఉన్నారు. ఇందులో కొందరి ఉపన్యాసాలు లేక వక్కాణములు చాలా దీర్ఘంగా వినుగుపుట్టించేటట్లు ఉన్నాయి. వీరి వాచా లతను తగ్గించి, సంఘంలో మరికొన్ని వర్గాలకు ప్రతినిధ్యం కల్పిస్తే బాగుంటుంది. ముఖ్యంగా ప్రతి నిధివక్తల్లో స్త్రీలు లేకపోవడం లోపంగా తోస్తుంది. సంఘంలో నూటికి యాభైమందికి ప్రతినిధ్యం పోయిందన్నమాట. మహిళాకార్యకర్తలనుంచి కూడా వక్కాణాలు సేకరించాలి. గ్రామజీవితానికి నడిబొడ్డైన మునసబు కరణాలు పటేలు పట్వారీలు ఇందులో ప్రత్యక్షం అవలేదు. ఇంకా కొన్ని ప్రముఖ కులాల వ్యక్తులనుంచికూడా వాఙ్మూలాలు సేకరించవచ్చును. ప్రసంగవిషయాల్లో కూడా ఇంకా వైవిధ్యం ఉండవచ్చు ననిపిస్తూంది. ప్రస్తుతం ఆకాంక్షించిన ప్రసంగ విషయాలన్నీ అత్యాధునిక జీవితానికి సంబంధించినవి అవడంచేత అన్యభాషాపదాలు—అంగ్లము, ఉర్దూ భాషా పదాలు ఎక్కువగా తలదూర్చాయి. అంగ్లపదాల ఉచ్చారణలో కూడా మాండలికత్వం తొంగిచూస్తుంది. ఎవరిగోడు వాళ్లు వెళ్లబోసుకోవడంచేత వక్తకూ— శ్రోతకూ దూరం ఎక్కువైపోయి, వక్తల ప్రసంగాలు కూడబలుక్కోవడమే దుర్లభం అవుతూంది. ఉభయు లకు పరిచితమైన విషయాలు - రామాయణ, మహా

భారత కథలూ, గాంధీజీవంటి మహాపురుషుల జీవితాల్ని గురించి కూడా మాట్లాడిస్తే వక్తృ—శ్రోతల మధ్య ఉన్న అఘాతం తగ్గవచ్చును.

ఈ ఉన్నవి ఉన్నట్లు చదవబోతే సదరు ప్రసంగాలన్నీ వట్టి కంపతోడుగులా ఉన్నాయి. వ్యవహారభాష అంటే అదొక స్వర్గమనీ, దానిలో రచనలుచేస్తే నందనోద్యానంలో విహరించినట్లు ఉంటుందనీ వ్యవహారభాషావాదులు ఉవ్విళ్ళూరిస్తూ ఉంటారు. గుటకలు వేస్తూంటారు. మనకు అందించినమాదిరి ప్రసంగాల భాషవంటి భాషలో సాహిత్యరచనచేస్తే పాఠకుడు 'త్రాహి, త్రాహి' అంటాడు. 'స్వామీ! పాత్రం, అన్నట్లు అవుతుంది. వ్యవహార భాష మాకు వద్దు బాబో అనే విపరీతపరిణామానికి దారితీస్తుంది. గ్రాంధికభాష మృతభాష అనీ, కృతకభాషఅనీ వ్యవహారభాషావాదులు విసుర్లు విసురుతూంటారు. వ్యవహారభాషాధ్వజాన్ని అచంచలవిశ్వాసంతో మోస్తున్నామనుకొనే కొందరు కందుకూరి వీరేశలింగం పంతులు, కొమర్రాజు లక్ష్మణరావుపంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులువంటి సర్వజనామోదం పొందిన మహారచయితల రచనలు కూడా అర్థంకావనే స్థిరనిశ్చయానికి వచ్చారు. వాదంలోని వేడిమి సత్యాన్ని గ్రహించనివ్వదు గదా. ఈ సేకరించిన మాండలికంలోను, సేకరించబోయే మాండలికాల్లోను యథాతథంగా రచనలుచేస్తే అవి ఆ మండలమందలి వ్యక్తుల్నిదాటి అఖిలాంధ్ర ప్రజలను రంజింపచెయ్యలేవనడం తథ్యము. మాండలిక భాషల్ని సర్వేచేయించేవారికి మనము అపచారం చెయ్యకూడదు. ఇటువంటి భాషలో వ్రాయమని వారేవీూ చెప్పలేదు. దీనికి పరిమితప్రయోజనం లేకపోలేదు. ఇప్పటి సాహిత్యకులు వ్రాస్తూన్న కావ్యనాటకాల్లోనూ, నాటికల్లోను, కథానికల్లోను పాత్రోచితభాషా సందర్భంలో ఇటువంటి మాండలికాల్ని యథాతథంగా వ్రాసినా బాధలేదు. చమత్కారజనకంగానే ఉంటుంది. కాని శాస్త్రప్రమేయంలోనూ, గ్రంథం మొత్తంమీద ఎవంవిధమైన భాషవ్రాస్తే ఆ గ్రంథవిషయం అచుంబితంగా ఉండిపోతుంది. మాండలికాల్ని సంస్కరించి అన్యమాండలికాలకు దగ్గరగాతెచ్చి రచనచేస్తేకాని అవి ఉద్దిష్టప్రయోజనాల్ని సాధించలేవనియే తోస్తుంది.

కరీంనగరం మాండలికాన్ని విశ్లేషణచేసి డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు, డాక్టరు బూదరాజు రాధాకృష్ణగారు కొన్ని లక్షణాలను నిర్దేశించి చూపెట్టారు. అవి శాస్త్రసమ్మతంగాను, చాలావరకు అంగీకారయోగ్యంగానూ ఉన్నాయి. ఒకటిరెండు విషయాల్లో మేము శ్రీ కృష్ణమూర్తిగారితో ఏకీభవించలేకుండా ఉన్నాము. సంస్కృతభాష అన్యదేశ్యం అయినట్లు వీరు వ్రాయడం ధర్మంకాదు! 'చాకలి, కంసాలి, గొల్ల' మొదలైన మాటలకుబదులు 'రజక, విశ్వబ్రాహ్మణ, యాదవ'అనే శబ్దాలకు ప్రస్తుతం ఎక్కువ గౌరవం వచ్చింది అని వీరు పేర్కొన్నారు (పుట 21). కావచ్చును. ఆయావర్ణములవారు సంఘపు త్రాసులో తమ బరువును పెంచుకోడానికై దేశ్యశబ్దాల బదులు అభ్యర్హితమని భావింపబడే సంస్కృతశబ్దాల్తో తమ సంఘాన్ని చెప్పకుంటున్నారు. వీరు అన్యదేశ్యంలోనే చెప్పదలచుకొంటే Washerman, Goldsmith, Shepherd అని చెప్పకోవాలి. వాళ్ల పుణ్యమా అని సనాతనము, దేశీయము అయిన సంస్కృతంలోనే తమ సంఘాల్ని చెప్పకోవాలని ఉత్సాహపడుతున్నారు. ఎవరికీనీ ఏవీూ విప్రతిపత్తి ఉండదు. ఉండకూడదు.

మరొక ప్రధానమైన విషయం ఏమి కనబడుతుందంటే—అజంతములైన తెలుగుశబ్దాల్ని ఆధునిక భాషావాదులు హలంతాలుగా విభాగంచేస్తూఉంటారు. కరీంనగరం మాండలిక ఖండికల్లో ఇది బాగా కొట్టవచ్చినట్లు కనబడుతుంది. ఇది సహజమో, తెచ్చికోలు వ్యవహారమో అవగతం కావడంలేదు. కరీంనగరం మండలపు మిత్రుల్తో మేమూ సంభాషిస్తూనే ఉంటాముకాని ఈ విధంగా శ్రుతికటువైన హలంత శబ్దప్రయోగం వినరాలేదు. ఇటువంటి తెలుగును స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారివంటి అభిజ్ఞులు 'తౌరుష్కాంధ్రము' అని ఛలోక్తిగా అంటూ ఉండేవారు. అన్యభాషాప్రభావానికి బాగా లోబడినవారుకాని మృదువైన తెలుగుభాషను అత్యంత పరుషమై హలంత ప్రధానం అయిందిగా చెయ్యలేరు. ఉచ్చారణ త్వరలో పదాలు కలిసిపోయి, అచ్చులు లోపించి సంయుక్త వర్ణాలు ఏర్పడడం భాషాస్వభావమేకాని అసలు పదాలు వ్యస్తంగా ఉన్నప్పుడు హలంతంగా

ఉండడం తెలుగుభాషా స్వభావం కాదు. 'మాట్లాడుతున్నాను' అనడానికి ఉచ్చారణ త్వరలో 'మాట్లాడ్తున్నాను' అనడం కలదుగాని దానిని విడదీసి చూసేటప్పుడు 'మాట్లాడ్ + తున్నాను' అని పదచ్ఛేదం చెయ్యడం తెలుగుభాషాతత్వానికి విరుద్ధం అనక తప్పదు. అతినవ్యభాషాశాస్త్రజ్ఞుల్లో ఒక అభినివేశం గోచరిస్తుంది. తెలుగుభాష ద్రావిడభాషాకుటుంబ జన్యమని ఇప్పుడు అందరూ సామాన్యంగా ఒప్పుకుంటూనే ఉన్నారు కాని, అంతమాత్రంచేత తమిళ భాషవలె తెలుగు భాషకూడా హలంత ప్రధానము కానక్కరలేదు. ఒకవేళ అత్యంత ప్రాచీన దశయందు తెలుగుపదాలు హలంతత్వాన్ని ఎక్కువ ప్రదర్శించి ఉండవచ్చును. కాని ప్రాచీన శాసనాల కాలం నుంచీ కూడా అజంతత్వమే ఈ భాషాలక్షణంగా స్థిరపడి ఉంది. న, ల అనే రెండు ధ్వనులు మాత్రమే హలంతతకు సూచకంగా పదాంతములందు నిలుస్తాయి. అవి దంత్యవర్ణములు మృదుధ్వనులూ అవడంచేత పదాంతమందు పొల్లురూపంతో ఉన్నా బాధాకరంగా ఉండవు. 'ర'కారము కూడా సకృత్తుగా పదాంతమున పొల్లు రూపంతో వినబడుతూంటుంది. 'తత్పాలుర్ భయం బందగన్' అని నన్నయ భట్టుగారున్నూ, 'చనచాళుక్య రాజు మొదలుగ బలువుర్' అని నన్నెచోడుడును ప్రయోగించినప్పటికీ, అవి విరళ ప్రయోగాలు. ఇప్పుడిప్పుడు యువతరంవారు 'య, వ' లనుకూడా పొల్లులుగా పదాంతముల వాడుతున్నారు. య, వలు అంతస్థములూ లఘువర్ణములూ అవడంచేత అవికూడా కొంత శ్రుతిసహంగానే ఉంటాయి. 'వస్తున్నా వంకాయ్—రావోయ్ టెంకాయ్' అని పిల్లల నోట బాగానే అనిపిస్తుంది. మొత్తంమీద తెలుగు భాష అనేక శతాబ్దాల వెనక విడిచిపెట్టిన హలంతత్వాన్ని దానికి తిరిగి అంటగట్టడానికి లింగ్విస్టులు చేసే ప్రయత్నాలు సఫలం అవుతాయని మేము అనుకోము. గ్రాంథికభాషమీద అవజ్ఞచేతనూ, చిన్నయ సూరిమీది చికాకుచేతనూ తెలుగుభాషయొక్క ఉత్తమవారసత్వాన్ని, కోమలధర్మాన్నీ పోగొట్టుకొనలేము. ఈ భాషాభుజంగమపతి విడిచి పెట్టిన కుబుసాన్ని తిరిగి దానిమీద కప్పుతారా?

కరీంనగరంమాండలికం లోని కొన్ని విశేష రూపాలను డాక్టరు రాధాకృష్ణగారు భాషాశాస్త్రసూత్రాలమేరకు వివరించడానికి చక్కని ప్రయత్నం చేశారు. తెలంగాణా భాషలో క్రియారూపాల్లో '...' 'న్రి' ప్రత్యయాంతాలు తరుచు వినబడుతూంటాయి. చేసిను, చెప్పిన్రు (చేసినారు, చెప్పినారు అనుటకు) చదువున్రి, నడువున్రి (చదువుడు, చదువుండు, నడువుడు, నడువుండు అనుటకు). 'న్ర' అనగా నకార రకార సంయోగం భాషలో చాలా ప్రాచీనదశను సూచిస్తుందనీ, ఈ సంయోగమే 'ణ్డ, ండ, డ,'గా పరిణమించినదనీ, అందుచేత అడుగున్రి అని కరీంనగరం మండలభాషలో కనబడే ప్రార్థనార్థక బహువచన రూపము సర్కారుప్రాంతము మొదలైనచోట్ల కనబడే 'అడగండి' అనే రూపంకన్న ప్రాచీనమైనదనీ రాధాకృష్ణగారు భావించారు. ఇందులో కొంత వ్యత్యాసం కనబడుతూంది. తెలుగులో విధ్యర్థమూ, ప్రార్థనార్థకమూ ఒకే రూపంలో ప్రకటింపబడుతున్నాయి. ఉదా॥ 'అడుగు' (అడుగుము). ఇది విధ్యర్థకము, ప్రార్థనార్థకమూ కూడ అవుతుంది. బహువచనంలో 'డు' ప్రత్యయంవచ్చి అడుగుడు, అడుగుండు, అదాదులను ప్రయుక్తములయితే అడుగుమ, అడుగుమా, అడుగుమి, అడుగుమీ అనే రూపాలు ఏకవచనంలో వస్తాయి. బహువచనంలో అడుగుడి, అడుగుడీ అనే రూపాలు వస్తాయి. డు, డి ప్రత్యయాలు అర్వాచీన దశారూపములనీ, ను, న్రి ప్రత్యయాలు ప్రాచీనదశారూపాలని డాక్టరుగారి సమన్వయము. కాని ప్రాచీనభాషలో క్రియారూపాల్లో న్రు, న్రి అంతములు కన్పించలేదు. పన్నస ఇచ్చిరి, ఇచ్చిన పన్నస అన్న రీతిగానే శాసనాల్లో కనబడుతుంది కాని పన్నస ఇచ్చిన్రు అన్న వ్యవహారం కనబడలేదు.

ను అనే ఘటన నామ సర్వనామము లందే ప్రాచీన శాసనభాషలో దొరుకుతూంది. మహేంద్రున్రు, సత్యాదితున్రు, వాన్రు—ఈరీతిగ. ఇవి తరువాతికాలంలో మహేంద్రుండు, సత్యాదిత్యుండు, వాండు అనునట్లు పరిణామం పొందాయి. అనంతరకాలంలో అనునాసికోచ్చారణ ఐచ్ఛికమయి మహేంద్రుఁడువంటి రూపాలును ఏర్పడ్డాయి. ఇక్కడ నకార అకార సంయోగమునకు తగిన హేతువుకూడా ఉండింది. ద్రావిడభాష

లలో మహదర్థక ప్రథమ పురుషైక వచనప్రత్యయం 'అన్' అనిన్నీ, అరవ కన్నడభాషలలో ఇది ఇప్పటికీ ఉందనీ, అది చేర్చడంచేత రామన్, కృష్ణన్ (రాముడు, కృష్ణుడు)వంటి రూపాలు ఏర్పడుతున్నాయని భాషా శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు. ఈ నకారము చతుర్థ వర్గంలోని దంత్య నకారమాత్రంకాదనీ, వేరొక ధ్వని యైన పదాంత నకారంఅనీ అంటున్నారు. దీన్ని కన్న డంలో రన్నగరముఅని వ్యవహరిస్తారట. ఈ ప్రత్యేక నకారధ్వని విశేషం ఏమిటంటే—అది మూర్ధన్య 'ఱ'కారాన్ని సహాయంచేసుకొని పలకబడుతుంది. ఈ సంప్రదాయాన్నిబట్టి తొలిరూపమైన మహేంద్రన్—మహేంద్రుస్టు—మహేంద్రుండుగా పరిణామంచెందింది. న్టు అంతమందుగల రూపాలు తెలుగుదేశం అన్ని ప్రాంతాల్లోను—తెలంగాణా, రాయలసీమ, సాగరసీమ—నన్నయకాలమునకుముందే అస్తమించాయి. ఇవి నామ పదాలకే సీమితమైయుండినట్లు కనపడుతుంది. క్రియాపదాల్లోకి ప్రాకినట్లు ఉదాహరణలు లేవు.

అయితే తెలంగాణాప్రాంతంలో 'న్టు' ఘటన క్రియారూపాల్లో ఇప్పటికీ ప్రత్యక్షమవడం ఆశ్చర్య కరమే. కాని ఈ ప్రత్యయము ప్రాచీన ప్రత్యయాన్ని పోలిన ఆగంతుక ప్రత్యయంగా తోస్తూంది. ఎట్లా గంటే—ప్రాచీనకాలంలో భూతకాలిక ప్రథమ పురుష బహువచనరూపము ఇచ్చిరి, చేసిరి—వంటివి, నన్నయ కాలమున కివి ఇచ్చినవాడు, చేసినవాడు, ఇచ్చినవారు, చేసినవారు అనే రూపంలో వ్యవహృతమయాయి. భూతకాలిక క్రియాజన్య విశేషణమునకు తచ్ఛబ్దము అనుప్రయోగం చెయ్యగా ఈ రూపాలు వస్తున్నాయి. తిక్కన సోమయాజి కాలానికి ఇచ్చినవారు, చేసిన వారు వంటిరూపాల్లో 'వ'కారలోపం కలిగి ఇచ్చి నారు, చేసినారు—అనురీతిగ మారినవని చెప్పు తున్నారు. ఈ రూపాలు అట్లా స్థిరపడిపోలేదు. వ్యవహార భాషలో అవి ఇంకా పరిణామానికి గురి అవుతూనే ఉన్నాయి. ఈ దశలోనే తెలంగాణా, సాగర సీమల వ్యవహారంలో వేర్పాటు కలిగినట్లు తోస్తుంది. కోస్తావారు ఇచ్చినారులోని నకారధ్వనిని జార్చివేసి ఇచ్చారు అనే రూపాన్ని కల్పించుకోగా, తెలంగాణా వారు దానిలోని దీర్ఘఅకార ధ్వనిని త్యజించి, ఇచ్చి నరు అనియు, వర్ణసంయోగంచేత ఇచ్చిన్రు అనియు రూపం ఆదరించారు. ఈ ఇచ్చిన్రు రూపము ఇచ్చిండుగా మారినదనడానికి వీలులేదు. ఇచ్చిండు అనేది ఇచ్చినాడునుండి ఏకవచన రూపంగావచ్చి, భాషలో ఇప్పటికీ వాడుకలో ఉండనే ఉన్నది.

పై చర్చనుబట్టి 'న్రు' అంతరూపము ప్రాచీన మైన 'న్టు' కాదనిన్నీ, ఇది 12, 13 శతాబ్దుల్లో రూపొందిన ఆగంతుకప్రత్యయమనీ, ఇది క్రియా పదాలమీద ఏర్పడినదనీ చెప్పడం ఉచితమనిపిస్తుంది. భాషాశాస్త్రవిషయాల్లో సారచేపవంటి గమనాగమన పాటవంగల డాక్టరు రాధాకృష్ణగారు దీనినింకా పరి శీలింతురు గాక. మొత్తంమీద తెలంగాణావారికి, ముఖ్యంగా పామరజనులకు 'ఱు' (రు) అంతరూపాల మీద ప్రీతిమెండు. బహువచనప్రత్యయ సంయోగం చేసి, బత్తెలు, గొత్తెలు—అని ఇతర ప్రాంతాలవారు పలుకుతూండగా వీరు బఱ్ఱు, గొఱ్ఱు అని స్పష్టంగా పలుకుతారు. వర్ణవ్యత్యయం ఇక్కడ ప్రభావం చూపెట్టినా, చేసిన్రు, వచ్చిన్రు మొదలగు క్రియా రూపాల్లోని బహువచన 'రు' వర్ణము అమహద్వాచ కములమీద బహువచనప్రత్యయంతో నేస్తం చేస్తూం దేమో. అయితే బత్తె, గొత్తె శబ్దాల్లోని 'ఱ'కారమే ఈ పరిణామాన్ని ప్రోత్సహించి ఉంటుంది. ఇతర పదాల్లో కుక్క, పిల్లివంటివానిలో ఇది కనబడదు. కుక్కలు, పిల్లులు అనియే వ్యవహారము.

కావ్యభాషలోలేని ఒక విశేషం కరీంనగరం మాండలికంలోను ఆధునిక వ్యవహార భాషలోను కనబడుతూన్నట్లు రాధాకృష్ణగారు వ్రాయుచున్నారు. (పుట 28). కావ్యభాషలో చేదర్థక, అపూర్థక రూపాలు రెండింటికీ ఒకే రూపం 'అడిగినర్' అనేది ఉండేదని, ఇప్పుడు ఈ రెండింటిని స్పష్టం చెయ్య డానికై 'అడిగితే, అడిగినా' అనే రెండు రూపాలు వాడుకలోకి వచ్చాయని వివరించారు. బాగానే ఉంది. పూర్వీకులమాత్రం వీటిని వేరు చేయడం ఎరుగరా, చూడండి. వానలు కురిసిన పంటలు పండును; కురి

సిన అనగా కురిస్తే అన్నమాట. వానలు కురిసినను పంటలు లేవు. కురిసినను అనగా కురిసినప్పటికీ అన్నమాట. కావ్యభాషలో ఇన, ఇనన్ (ను) ప్రత్యయాలచేత ఈ భేదం సూచించేవారని తోస్తుంది. వానలు కురిసినను పంటలు పండును అనురీతి చేదర్థక ప్రయోగం ఉంటుందా? ఇంతమాత్రానికే 'భిన్నార్థాలు సూచించే భిన్నరూపాలులేని కావ్యభాష, ఆధునిక పరిస్థితుల్లో అంత ఉపయోగకరం కాదని గ్రహించాలి' అని వ్రాసిన వాక్యం తొందరపాటును సూచిస్తుందేమో.

ఇట్లాంటి చర్చలు సాగుతూనే ఉంటాయి. ఆంధ్రదేశం అన్నిజిల్లాలలోను ఈవిధమైన మాండలికభాషాసేకరణ చెయ్యడం, వాటిని విశేషాధ్యయనం చెయ్యడం ఇన్నాళ్లకు ప్రారంభమయింది. అది హర్షింపదగిన విషయం. ఆయా మాండలికాల్లోని ఏకత్వలక్షణాలను చక్కగా నిరూపించి, వాటి ఆధారంగా సర్వామోదకరమైన వ్యావహారికభాషా వ్యాకరణం రూపొందించడం కూడా చాలా అవసరము. సాహిత్య నిర్మాణానికి శాస్త్రగ్రంథరచనకూ ఉపయోగించే విపులమైన ఆధునికభాష ఈ మాండలిక సర్వేల ఫలితంగా రూపు దాలుస్తుంది. దీన్ని ప్రామాణికభాష అనడం కన్న సాధారణీకృతభాష అనడం ఉచితంగా ఉంటుంది. ప్రామాణికము అనేసరికి ఎవరు ప్రమాణము? ఏ ప్రాంతపు మాండలికము ప్రమాణము? ఎందుచేత మున్నగు ప్రశ్నలూ, వివాదాలు తలయెత్తుతాయి. మాండలికరూప పరిచయము ఉపాధ్యాయులకూ, శాసన సభ్యులకూ చాలా అవసరమనిపిస్తుంది. ఉపాధ్యాయుడు తరగతిలో భిన్నప్రాంతాల విద్యార్థులతో వ్యవహరించవలసివస్తుంది. శాసనసభల్లో వివిధజిల్లాల ప్రతినిధులు తమకు అలవాటైనభాషలో మాట్లాడుతూంటారు. అన్యమాండలికంలో జరుగుతూన్న చర్చాసరణిని శాసన సభ్యులు అవగతం చేసుకోవాలి.

తెలుగు మాండలికాలు — కరీంనగర్ జిల్లా; సంపాదకుడు: డా. బూదరాజు రాధాకృష్ణ; తెలుగు అకాడమీ, హైదరాబాదు–29; వెల -- రు. 5 లు.



గణిత సంజ్ఞలు - వాని పుట్టుపూర్వోత్తరాలు

డా. విశ్వనాథ అరుణాచలం

గణితశాస్త్రంఅంటే ఏమిటి?—కవిత్వాన్ని, శిల్పాన్ని, సంగీతాన్ని ఏలా సంతృప్తికరంగా నిర్వచించలేమో అట్లాగే గణితాన్నికూడా నిర్వచించలేము. అయినప్పటికీ గణితశాస్త్రంలో కృషిచేసిన మేధావులు కొందరు గణితాన్ని వారికి తోచినరీతిగా నిర్వచించినారు. కొందరు 'గణితం శాస్త్రభాష' (Language of Sciences) అన్నారు. 'అసంబద్ధములుకాని స్వీకృతాలనుండి ఉత్పన్నమైన ఫలితాల నన్నింటినీ పరిశీలించడమే గణితం' అన్నారు కొందరు. 'అప్రతిహతవాదమా! నీ పేరు గణితం' అన్నాడు W. V. Quine. గణితశాస్త్రపు పునాదుల్ని పరిశోధిస్తూ గణితం తర్కశాస్త్రంలో ఒక భాగమేనని—సంజ్ఞాత్మక తర్కమని, చాటిన Frege, Peano, Bertrand Russel, A. N. Whitehead ప్రభృతుల వాదంవల్ల అభినవగణితంలో ఎంతో పరిణామం ఏర్పడింది. ఈ దృక్పథంవల్ల, గణితంలో వాదాలు సంగతములు కావలెనంటే తార్కికంగా అవి సంగతములైతే చాలునని తేలింది. మామూలు భాషాపరమైన శబ్దరూపంలో భావప్రకటనంచేస్తే విరోధాభాసలకు, సందిగ్ధతలకు దారితీస్తుందని గణితవాదాన్నంతా సంజ్ఞాత్మకంగానే ఉంచవలెనని Pertrand Russel స్థిరీకరించి, A. N. Whitehead (క్రీ. శ. 1861—1947) మహాశయునితో కలసి Principia Mathematica అనే బృహద్గ్రంథాన్ని, మూడు భాగాలుగా క్రీ. శ. 1910, 1911, 1913 లలో రచించి, ప్రకటించినారు. ఈ గ్రంథావతరణకంటే అర్ధశతాబ్దం ముందే George Boole (క్రీ. శ. 1815—64) అనే తార్కికుడు గణితశాస్త్రజ్ఞుడు గణితతర్కాన్ని ప్రతిపాదనకలన శాస్త్రాన్ని (Propositional Calculus) ప్రవేశపెట్టినాడు. గణితశాస్త్రం పునాదుల పరిశోధనలో ఏర్పడిన Formalist లు కూడా గణితాన్ని 'సంజ్ఞలచే నిర్మితమైన ఆకృతులు'గా పరిగణించడం వల్లనూ గణిత సంజ్ఞలకు ఎక్కువ ప్రాముఖ్యంకలిగింది. [Kronecker (క్రీ. శ. 1823—91), David Hilbert (క్రీ. శ. 1862—1943) ప్రభృతులు ఫార్మలిస్టులు]

సంజ్ఞాత్మక తర్కపద్ధతిద్వారా స్వతస్సిద్ధంగా ఏర్పడే సంక్షిప్తత, సంశయశూన్యతలు గణితశాస్త్రజ్ఞుల్ని ఆకర్షించినాయి. తత్ఫలితంగా ఆధునిక గణిత విభాగాలన్నిట్లో ఈ సంజ్ఞాత్మక తర్కపద్ధతి ప్రవేశించింది. ఏభైఏళ్లక్రితం వెలువడిన గణిత పత్రికల్ని, ఇప్పుడు వెలువడుతూఉన్న గణిత పత్రికల్ని చూచామంటే ఈ నాడు సంజ్ఞలు ఎంత విరివిగా వాడబడుతూ ఉన్నాయో తెలుస్తుంది.

George Boole (గణిత) సంజ్ఞ అంటే ఏమిటో నిర్వచిస్తాడు. 'ఒక స్థిరమైన అర్థాన్ని సూచించేందుకు యాదృచ్ఛికంగా ఏర్పాటై అట్లాగే ఏర్పడిన మిగతావాటితో నిర్ణీతన్యాయానుసారంగా సంయోగంపొందే గుర్తులు గణితసంజ్ఞలు. Boole, Russel ప్రభృతులకంటే శతాబ్దాల క్రితమే, గణిత సంజ్ఞల్ని నిర్వచించకపోయినప్పటికీ, గణిత శాస్త్రానికి, సంజ్ఞలకూగల సాన్నిహిత్యాన్ని శాస్త్రవేత్తలు గుర్తించినారు. రాసులను వాటిమధ్య నిర్వచిత ప్రక్రియలను, పరస్పర సంబంధాలను అరూప పద్ధతిలో ప్రస్ఫుటంగా, సంక్షిప్తంగా వివరించేందుకు సంజ్ఞల్ని వాడవలెనని, ఈలాంటి సంజ్ఞలతో వికసించే గణితాన్ని ఒకవిధమైన భాషగా ఎంచవచ్చునని

ప్రాచీన శాస్త్రజ్ఞులు బాగా 'గుర్తించినారు. గణిత శాస్త్రాభివృద్ధికి దోహదమిస్తూ శాస్త్రంతోపాటు కొండంతలుగా పెరిగిపోతూఉన్న ఈ సంజ్ఞాసంచయం పుట్టుపూర్వోత్తరాల్ని స్థూలంగా పరిశీలిద్దాము—

మనం మామూలుగావాడే ప్రతి సంజ్ఞవెనుక కొంత చరిత్ర ఉంది. గణితచరిత్ర పుటల్ని ఒక్కసారి త్రిప్పామంటే విస్తృతము, సంపత్సమేతము, నవనవోన్మేషమూ అయిన గణితజీవితంలో ఎన్ని సంజ్ఞలు అవతరించాయో, అందులో ఎన్ని పురిట్లోనే సంధిదోషం తగిలి కన్ను మూసినాయో అన్న విషయాలు తెలుస్తవి. ప్రవేశపెట్టబడిన సంజ్ఞలు భావప్రకటనకు సాయపడే వైఖరిమీదను, ముద్రణా సౌలభ్యం దృష్ట్యాను, సృష్టించినవారి శాస్త్రాధికార యోగ్యతలమీదను ఆధారపడి ప్రచారంలోకి వస్తాయి.

సంజ్ఞల్ని గురించి ప్రస్తావిస్తూ A. De Morgan (క్రీ. శ. 1806—72) అంటాడు: 'అభివృద్ధిచెందే ప్రతిశాస్త్రం తాను సృష్టించుకొన్న సంజ్ఞలను వాడుకొంటూనే వృద్ధిచెందుతుంది' అని. క్రీ. శ. 16, 17 శతాబ్దాలలో గణితసంజ్ఞల విషయమై శాస్త్రపండితులు ఎక్కువ శ్రద్ధ చూపించివారు. Francois Vie'te (క్రీ. శ. 1540—1603), William Oughtred, Rene'Des Cartes (క్రీ. శ. 1596 — 1650), Gottfried Wilhelm Leibniz (క్రీ. శ. 1646—1716) ప్రభృతులు గణితసంజ్ఞల విషయమై ఏకాభిప్రాయాన్ని, సమైక్యతని సాధింపతలచి వ్యాసాలమూలంగా ఉపన్యాసాలమూలంగా ఒక ఉద్యమాన్ని ప్రారంభించినారు. ఈ ఉద్యమం వేగాన్ని పుంజుకొని, 20 వ శతాబ్దంలో పరిణతిని అందుకొన్నది. నిస్తంత్రీతరంగప్రసారాన్ని ఆవిష్కరించిన Heinrich Hertz (క్రీ. శ. 1857—94) అంటాడు: 'ఈ గణితసూత్రాలు (సంజ్ఞలుకూడా) స్వేచ్ఛగా జీవిస్తాయి. స్వతహాగా వాటికి బుద్ధికుశలతలు ఉన్నాయి; మనకంటే అవి తెలివైనవి. వాటిని సృష్టించినవారికంటేకూడా అవి తెలివైనవి—అందువల్లే వాటినుండి మనం ఆశించిన దానికంటే ఎక్కువగానే లాభపడతాము.'

ఇంగ్లండులో క్రీ. శ. 1557 లో Robert Recorde అనే గణితశాస్త్రజ్ఞుడు బీజగణితంమీద Whetstone of Wette అన్న పేరుతో ఒక పుస్తకం వ్రాస్తూ '==' సంజ్ఞను ప్రవేశపెట్టినాడు. 'ప్రతిసారి 'is equal to' అని వ్రాసేందుకు నాకు ఓపిక లేక ఆ పదబంధాన్ని సూచించేందుకు '==' గుర్తును వాడతాను' అన్నాడు. ఒకే పొడవుగల రెండు (సమాంతర) రేఖలు, ఆ రేఖల కిరువైపునగల రెండు రాశులు, సమానాలని అది సూచిస్తుంది. ఈ సంజ్ఞ సార్థకంగా ఉన్నందువల్ల కొన్నాళ్లకు దీన్ని గణితప్రపంచం ఆమోదించింది. దీని రూపం '=='నుండి '=' గా పరిణామం చెందింది. 1557 లో ప్రవేశపెట్టబడిన ఈ సంజ్ఞ 1618 నాటికి అందరి ఆదరణకు పాత్రమయింది. ఒక గణితంలోనే కాకుండా ఇతర శాస్త్రాల్లోకూడా సమానతను సూచించేందుకు దీన్ని విరివిగా వాడుతారు.

Francois Vie'te ఫ్రాన్సుదేశంలో నాల్గవ హెన్రీ రాజ్యం చేసేటప్పుడు ఉండిన న్యాయవాది. తాను న్యాయవాదిగా గొప్పపదవుల్ని అందుకొని రాచకార్యాల్లో నిమగ్నమై ఉండికూడా గణితశాస్త్ర అధ్యయనాన్ని అలవరచుకొని శాస్త్రాభివృద్ధికి పాటుబడినాడు. ఈయన అవ్యక్తరాశులను ఇంగ్లీషు వర్ణమాలలోని అచ్చులద్వారా, స్థిరరాశుల్ని హల్లులద్వారా సూచించడాన్ని ప్రారంభించినాడు. తద్వారా ఏదైనా సమీకరణాన్ని సార్వత్రికరూపంలో వ్రాయడమనే పద్ధతి రూపొందింది. ఉదా॥ $ax+e=o$ లో a, e లు స్థిరరాశులు, x అవ్యక్తరాశి. Rene Des Cartes ఈ పద్ధతినే కొంత మార్చి అనుసరించినాడు. వర్ణమాలలోని మొదటి అక్షరాలద్వారా స్థిరరాశుల్ని, చివరిఅక్షరాలద్వారా అవ్యక్తరాసుల్ని సూచించినాడు. Willam Oughtred దాదాపు వందా ఏభై సంజ్ఞల్ని ఎంతో ఉత్సాహంతో ప్రవేశపెట్టినాడట.

క్రీ. శ. 17 వ శతాబ్ది చివరలో G. W. Leibniz సంజ్ఞల్ని గురించి కొంత చర్చించి, అవి

సుబోధకంగాను, వ్రాయడానికి సులభంగాను ఉండవలె నని శాసించినాడు. Leibniz యువకుడుగా ఉన్నప్పుడు గణితశాస్త్ర భావాల నన్నిటినీ సంజ్ఞలలో, ఒక కొత్త భాషద్వారా వివరించి వికసింపచేయాలని కలలు కన్నాడు. కాని అప్పటికి అవి కలలుగానే నిలిచి పోయాయి. ఈ కల George Boole తన Analysis of Logic (1847) ప్రచురించిన నాడు ఫలించింది. సంజ్ఞల ప్రాముఖ్యాన్ని చాలమంది గుర్తించినప్పటికీ వాటిని విపరీతంగా వాడటం నచ్చనివారూ ఉండినారు. Thoms Hobbes అంటాడు, 'సంజ్ఞలు వికారమైనవి; అయినా భావప్రకటనకు వాటిని విధిగా మనం అంగీకరించవలె' అని.

సమానతను సూచించే '=' కంటే 70 సంవత్సరాలకు ముందే '+,—' (ప్లస్, మైనస్)సంజ్ఞలు ప్రచారంలోకి వచ్చినవి. బ్రిటిష్ గణితశాస్త్రజ్ఞుడు Johann Widman క్రీ. శ. 1489 లోనే అంకగణితంమీద ఒక గ్రంథాన్ని వెలువరిస్తూ, ఆ గ్రంథంలో మొట్టమొదటిసారి సాధారణ సంకలన వ్యవకలన ప్రక్రియల్ని సూచించేందుకు ఈ సంజ్ఞలను వాడినాడు. బీజగణితపరంగా ఈ +, — లను వాడినవాడు (క్రీ. శ. 1514) Vander Hoccke అనే డచ్ శాస్త్రజ్ఞుడు. ఇంగ్లండులో ఉండిన William Oughtred మొట్టమొదట, గుణకారాన్ని సూచించేందుకు "X" ను క్రీ. శ. 1631 లో తాను రచించిన Clavis Mathematicae అనే గ్రంథంలో వాడినాడు. కాని ఈ గుర్తును ఐరోపాఖండంలో శాస్త్రజ్ఞులు అంగీకరించలేదు. వారికి జర్మన్ గణితశాస్త్రజ్ఞుడు, తత్త్వవేత్త Leibniz ప్రవేశపెట్టిన తిలక చిహ్నమే (a.b) నచ్చింది. ఈ చిహ్నం చక్కగా ఉన్నందువల్ల 'X' తోబాటు '.' చిహ్నాన్నికూడా గుణకార ప్రక్రియను సూచించేందుకు ఇంగ్లండులో ఉపయోగిస్తూవచ్చారు. '+;—; X,.' అనే సంజ్ఞలు మామూలు సంకలన వ్యవకలన గుణకార ప్రక్రియలను సూచించేందుకు ఉత్పన్నమైనా, నేడు సార్వత్రికతను సంపాదనచేసుకొని, సమితివాదంలో, వెక్టరుకలనంలో ఇంకా అనేకగణితవిభాగాల్లో, విస్తృతమైన అర్థాన్ని, ప్రక్రియల్ని సూచించేందుకు ప్రపంచం మొత్తంమీద వాడబడుతూ ఉన్నాయి.

భాగహారాన్ని సూచించే ÷ గుర్తుకూడా ఇంగ్లండులో పుట్టి, ప్రచారానికివచ్చి మెల్లగా ఐరోపాఖండానికి, అమెరికాకు పయనించింది. మొట్టమొదట Johann H. Rahn అనే గణితజ్ఞుడు రచించిన బీజగణిత గ్రంథంలో ఇది వాడబడింది. ఈ గ్రంథాన్ని క్రీ. శ. 1659 లో స్విట్జర్లాండులో ప్రచురించినారు; 1668 లో దీని ఆంగ్లానువాదము వెలువడింది. కొందరు (:) గుర్తునుకూడా భాగహార ప్రక్రియను సూచించేందుకు వాడినట్లు మనకు గణిత చరిత్రలో దృష్టాంతాలు కనబడతాయి.

వర్గమూలపు గుర్తు

మొట్టమొదట క్రీ. శ. 1525 లో Rudolff అనే గణితవేత్త రచనల్లో కనబడుతుంది. Rudolff రచనలకు సంపాదకుడుగా వ్యవహరించిన Michael Stifel మహాశయుడు '$\sqrt{}$' వర్గమూలాన్ని సూచిస్తే, '$\surd\!\surd\overline{}$' ఘనమూలాన్ని, '$\surd\!\surd\!\surd\overline{}$' నాల్గవమూలాన్ని సూచించేందుకు వాడవచ్చునని వ్రాశాడు. కాని, ముద్రణదృష్ట్యా సౌలభ్యం చేకూరనందువల్ల ఈ ఘనమూలాన్ని, నాల్గవ మూలాన్ని సూచించే సంజ్ఞలు చిరకాలం మనలేకపోయినవి. Rudolff, Root అనే పదంలోని మొదటి వర్ణమును పోలిఉండేటట్లుగా వర్గమూల చిహ్నాన్ని రూపొందించినాడని ప్రతీతి. మూలప్రక్రియా సూచక చిహ్నమైన '$\sqrt{}$' ను ఫలానామూలం ['$\sqrt[2]{}$' వర్గమూలానికి, '$\sqrt[3]{}$' ఘనమూలానికి] అని సూచించే పద్ధతిని మొట్టమొదట క్రీ. శ. 1484 లో ఫ్రెంచి భౌతికశాస్త్ర

జ్ఞుడు Chuquet తన వ్రాతప్రతుల్లో వాడినట్లు కొందరు వాదిస్తారు.

నిష్పత్తి, అనుపాతభావాన్ని సూచించే : : సంజ్ఞను క్రీ. శ. 1628 లో Oughtred ఉపయోగించినట్లు తెలుస్తోంది. హెచ్చుతగ్గులను, క్రమ సంబంధాన్ని (Order relation) సూచించే '$>$ $<$' సంజ్ఞలను క్రీ. శ. 1631 లో Harriot ప్రవేశపెట్టినాడు. అనంతరాశిని సూచించేందుకు మనం '∞' ని వాడుతున్నాము. ఈ సంజ్ఞను మొట మొదట క్రీ. శ. 1655 లో John Wallis, తాను రచించిన Arithmetica Infinitorium అనే గ్రంథంలో ఉపయోగించినాడు. ఒకరాశి 'x' యొక్క వర్గాన్ని, ఘనాన్ని x^2, x^3 అని వ్రాస్తాము మనం. ఈ విధంగా వ్రాయడం క్రీ. శ. 1634 లో ఫ్రెంచి గణితాచార్యుడు, తాత్త్వికుడు అయిన Rene Des Cartes ప్రారంభించినాడు. అదే సంవత్సరంలో మరో గణిత శాస్త్రజ్ఞుడు Herigone కూడా వర్గాల్ని, ఘనాల్ని ఈ మోస్తరుగా వ్రాయడాన్ని ఊహించినాడు. అయినా ఈ పద్ధతిని మొట్ట మొదట ప్రారంభించింది వీరుకాదు; క్రీ. శ. 1360 నాడే Nicole Oresme అనే గణితజ్ఞుడు ఈ పద్ధతిని వర్గాలు, ఘనాలకే కాదు, ఏదైనా n—వ ఘాతానికి కూడా వాడినట్టు తెలుస్తోన్నది. ఈ సందర్భంలో $x^2, x^3, \ldots x^n$ సంజ్ఞల్ని బాగా ప్రచారానికి తెచ్చినవాడు Michael Stifel అన్న సంగతి మరచిపోకూడదు. ఘాతాలు ధనపూర్ణాంకాలే కాక, భిన్నాంకాలు, ఋణాంకాలుగాకూడా ఉండవచ్చునని, తద్వారా x వర్గమూలాన్ని $x^{\frac{1}{2}}$ అని, ఘనమూలాన్ని $x^{\frac{1}{3}}$ అని వ్రాయటం ప్రారంభించినవాడు John Wallis. ఈ పద్ధతి వల్లనే క్రీ. శ. 1655 లో John Wallis మొట్ట మొదట $x^0 = 1$ అన్న నిర్వచనాన్ని ఒక విధంగా సమర్థించ కలిగినాడు. తరువాత సర్ ఐజాక్ న్యూటన్ ఈ పద్ధతిని బాగా ప్రచారంలోకి తెచ్చినాడు. న్యూటన్ చేతిమీదుగా ఈలాంటి గణితసంజ్ఞలెన్నో విశ్వవ్యాప్తము లైనాయి. ప్రసిద్ధములైన కుండలీకరణాల్ని '[ ]' మొదట క్రీ.శ. 1629 లో Albert Girard ప్రవేశ పెట్టినాడు.

క్రీస్తుకు పూర్వంనుండి క్రీ. శ. 19 వ శతాబ్దంవరకు పెంపొందిన గణితం ఒక ఎత్తు; 20 వ శతాబ్దిలో సర్వతోముఖంగా వెల్లివిరిసిన గణితం ఒక ఎత్తు. ఈ శతాబ్ది ప్రారంభంలో గణిత శాఖకు, తార్కికవాదానికి చక్కని సమన్వయం కుదిరింది. సమితి సిద్ధాంతం ప్రవేశించడం వల్లను, 19 వ శతాబ్దిలో ప్రారంభమైన George Boole కృషి ఫలితంవల్లను, Georg Cantor పరిశోధన వల్లను, బెర్ట్రండ్ రస్సెల్, వైట్‌హెడ్ ప్రభృతుల రచనలవల్లను గణితశాస్త్రానికి గట్టిపునాదులు ఏర్పడ్డాయి. తత్ఫలితంగా గణితశాస్త్రాధ్యయనానికి సమితిభావం (Set Concept) అతిప్రాథమికమైనదిగా పరిణమించింది. తద్వారా గణితశాస్త్రపు శాఖలన్నీ సంస్కరించబడ్డాయి; లాక్షణికతను, లాఘవాన్ని పుంజుకొన్నాయి. తర్కశాస్త్రంనుండి పుట్టిన ప్రతిపాదనకలనము (Propositional Calculus) గణితంలో చోటు చేసుకొన్నది.

ఒక సమితి S లో అనేక మూలకా లుంటాయి. అందులో 'A' ఒక మూలకం. ఈ విషయాన్ని సంక్షిప్తంగా '$a \in S$' అని వ్రాస్తున్నాము. B అనే మూలకం S లో లేదు అనడాన్ని '$b \notin S$' అని వ్రాస్తాము. వ్యవస్థిత మౌతున్నది (There exists) అనే భావాన్ని

సూచించేందుకు $\exists$ గుర్తును వ్రాస్తున్నాము. 'There Exists an x'ను $\exists x$ సూచిస్తుంది. రెండు సమితుల సమ్మేళనము (Union), ఖండనము (Intersection) లను A U B అని, $A \cap B$ అని వ్రాస్తున్నాము. ఈ $\in, \exists, \cup, \cap$ మొదలైన సంజ్ఞల్ని ప్రవేశపెట్టినవారు Whitehead, Russel లు. ఆధునిక బీజగణితంలో అతిముఖ్యమైన విగా పరిగణింపబడే స్థిత్యంతర (Commutative), విభాగ (Distributive) న్యాయాలకు ఈలా నామ కరణం చేసినవాడు క్రీ. శ. 1814 లో Servois అనే ఫ్రెంచి గణిత శాస్త్రజ్ఞుడు. సహచర్యన్యాయము (Associative Law) అనే భావప్రస్తావన, పద ప్రయోగం ఐర్లండు మేధావి Sir William Rowan Hamilton రచనల్లో ప్రప్రథమంగా కనబడుతోంది.

$\odot, \triangle, \square$ మొదలైన జ్యామితీయ సంజ్ఞలు అతిప్రాచీనములైనవి. అయితే వీటి నన్నిటినీ క్రోడీకరించి బాగా ప్రచారంలోకి తెచ్చినవారు Herigone, Oughtred లు.

ఒక వృత్తములో వృత్తపరిధికి, వృత్తవ్యాసానికి ఉండే నిష్పత్తిని π అనే అక్షరంతో సూచించవచ్చునని ప్రారంభించినవాడు William Jones. క్రీ. శ. 1706 లో π గణిత రచనల్లో ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఈ π ని వితతగుణకార ప్రక్రియను సూచించేందుకు కూడా నేడు మనం వాడుతూఉన్నాము. ఇట్లాగే $\sum$ ను సంకలనానికి సంక్షిప్త సూచికగా వాడుతూ ఉన్నాము. మొట్టమొదట $\sum$ ను ఈ విధంగా వాడినవాడు L. Euler (క్రీ. శ. 1707–83).

"కుప్పలు తెప్పలు లెక్కల
చప్పున బడిలోన చేర్చి జాగ్రత తోడన్
ఒప్పించి మెప్పుకొను నీ
గొప్పను కీర్తింతుమెపుడు కూరిమి సిగ్మా
(Σ)"

Euler, exponentialసంఖ్య e ని, $\sqrt{-1}$ ని తెలిపేందుకు i ని, ప్రమేయాన్ని, ప్రమేయబింబాన్ని సూచించేందుకు $f(x)$ ను సర్వామోదకరంగా ప్రవేశపెట్టినాడు.

ఈ నాడు గణిత శాస్త్రాధ్యయనంలో, విద్యాబోధనలో, రచనల్లో ఒక ప్రశాంత విప్లవం జరుగుతోన్న సంగతి అందరికీ తెలుసూ—ఇది విశ్వవ్యాప్తంగా జరుగుతూ ఉన్నది. 'ఒఠి గణన కౌశలాన్ని పెంపొందించేది గణితంకాదు, అరూపభావనలనుండి అరూప నిర్మాణములను సృజించి అధ్యయనం చేయడమే గణితం పరమావధి' అని గణితాచార్యులందరూ ఏక కంఠంతో పలుకుతూ ఉన్నారు. ఇదే కొత్త గణితమని చెలామణి అవుతూ ఉన్నది. ఈ కొత్త గణితానికి ఊపిరి పోసినవారు ఎందరో మహానుభావులు. వీరందరి కృషి ఫలితంగా గణిత విశ్లేషణము, అరూప బీజగణితము, టాపాలజి, బీజగణితీయజ్యామితి, అభినవ ప్రక్షేపజ్యామితి, యూక్లిడీయేతర జ్యామితి మొదలైన ఎన్నో గణిత విభాగాలు అవతరించినాయి; అవతరిస్తున్నాయి. ఈ నూతన దృష్టిలో సంజ్ఞలు కోకొల్లలుగా ప్రవేశిస్తున్నాయి. కాబట్టి ఎవరు ఏ సంజ్ఞలు మొదట వాడినారో అన్నవిషయం ఎవరికీ పట్టింపులేదు. ఎక్కువగా కృషిచేస్తే కాని వీని పుట్టు పూర్వోత్తరాలు బయల్పడవు.

మకుటోత్పల దశరూపిక

శ్రీ గజ్జల జగత్పతి

మాటలు కట్టిపెట్టి,

మాటల కంతులేదు; పదిమాటలలో ఒకమాటకైన నే
ఁటి గురుత్వముండదు; శిలల్ తమ నిర్బలతన్ గ్రహించి, ఏ
మాటయు పల్కవెప్పు డసమానశిలాప్రతిమాభిలాషు లీ
నాటక చక్రవర్తుల కనంతపయామయ! బుద్ధిఁజెప్పుమా!

అభిమానముతో,

మనుటయె చాలునంచు, నవమానము నెంచక, కట్ట బట్టయున్
తినగను గింజలేక, జగతిన్ తన వాడొకడైన లేక, ఎం
దును తలమెత్తలేదు, గతితోచక, చచ్చియు చావలేదు;–మా
మనిషికె చెల్లు నింతయును–మర్త్యగతుల్ బహుకష్టబోధముల్

నిజమైన భక్తితో,

దేవస్థానములన్ని ఆశ్రితులతో, దేదీప్యమానప్రభా
వైవిధ్యంబున తాళవాద్యములతో, వైకుంఠముంబోలు; కా
నీ, వైషమ్యమదాది నీచగుణవహ్నిజ్వాలలన్ మండి, ని
ర్జీవంబైన జగత్తు కెందులకు ధర్మం; బేల జ్ఞానప్రభల్?

ఓటమి నొప్పుకోని యువయూధపు శక్తులతో,

బడబములోని అగ్ని, జలపాతమునందలి నిర్భయత్వమున్,
కడలిబలంబు యౌవనపు కల్మి యగుంగద! కాదిదంతయున్

దుడుకుతనం బటంచు యువదూషణ జేతురు వృద్ధబుద్ధులే
అడవులో చూచుకోక, తమ ఆశ్రమధర్మము మాని ఈశ్వరా !

గుర్రాకవనౌ బాటలవిూద,

ఒకనికి స్ఫూర్తిహెచ్చు; మఱియొక్కని కెక్కువ బుద్ధిశక్తి; యిం
కొకనికి ధర్మనిష్ఠ; సుగుణోత్తములౌ ఇటువంటి సజ్జనా
ళికి కలియం దదెందులకొ లేదిసుమంతయు గౌరవంబు; పా
పికులము మాది; మంచి కనుపించదు మాకు; అఘంబె తియ్యనౌ.

సృష్టిప్రతిభన్ మసిచేయుక,

వదనము కాంతిహీనముయి, వంగి, కృశించి, నశించుచుండు నీ
కదలెడు శల్యసంపుటము కాదుగదా భవదీయమంగళ
ప్రద పరిపూర్ణసృష్టి మహిమా మహనీయ ఫలస్వరూప? మా
తృద ! ఇది చిన్నసందియము; మౌనము బోవుగదా, మహాప్రభూ !

దేశప్రేమములై,

దేశంబన్నది వట్టి ఊతపదమై, దేశంబు రక్షింపగన్
మా శక్తుల్ తమవే యటంచు సతమున్ మా ప్రాణముల్ దీయుచున్
దేశోద్ధారకు లిచ్చు భాషణమునందే యుండిపోనీక, స్వా
మీ ! శంభో ! కృపజూచి, భాగ్యపథగామిన్ జేయుమయ్యా ప్రభూ !

పాటుపడండి!

నిలువదు కాలవాహిని; అనిత్యమయప్రకృతిన్ గ్రహించి, ని
హ్యలత ముగించుదాక, పరివర్తన మొక్కటె శాశ్వతంబు మ
ర్త్యుల కయిగూడ, జ్ఞానముపయోగముజేసి, భయంబువీడి, ని
శ్చలమతి వొళ్ళువంచిన, అసాధ్యమె పొందగ ఐహికార్థముల్ ?

ప్రౌఢులయి;

ఇంధనమబ్బదేని అడుగెత్తదు ముందుకు యంత్రరాజు; గ
ర్వాంధతవల్లగాదు; తన ప్రాణవిశిష్టత నొప్పుకోని సం

బంధము, ఆత్మగౌరవము బాసి సహింపగలేడు తాను; ని
ర్బంధము తప్పదన్న, తలవంచడు ప్రాణములిచ్చు ప్రౌఢుడై.

భవ్యశుభంబు సతంబు మీ కగున్!

కలలు నిజంబు గావలెను; కష్టములన్ని నశించిపోవలెన్;
కలకలమంచు జీవన మనంతసుఖప్రదమై మహీస్థలిన్
వెలయవలెన్ మనోజ్ఞమగు నిత్యవసంతము; స్వర్గభూమిగా
యిలవెలుగన్వలెన్; నరమహీజము ధర్మఫలంబు లీవలెన్.



ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణము

శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రి

(గతసంచిక తరువాయి)

పాఠనిర్ణయము - పూర్వముద్రణములు

సంపాదకులు లెక్కలేని తాళపత్ర ప్రతులను సంపాదించుటయే గాక ముద్రితములను కూడ గాలించి ఒక యక్షరముకూడ తప్పిపోని పద్ధతిలో జాగ్రత్త వహించినారు. ముద్రిత ప్రతులలో లండను ప్రతి (1850–53), హయగ్రీవశాస్త్రిగారిది (పూర్తిగా దొరకలేదు), ఆనంద, వావిళ్ల, ఆమ్నాయ కళానిధి, చదలువాడ దండిగుంట పండితులది మున్నగునవి ప్రధానములు. నాటి సారస్వత పత్రికలలో పండితులు మహాభారత పాఠములమీద చేసిన చర్చల నుగ్గడించినారు. నాటి వ్యాసములకొక యను క్రమణిక తయారుచేయ నుద్దేశించి కొంతపనిచేసి విరమించిరటకూడ. ముఖ్యముగా గత శతాబ్దపు సారస్వత పత్రికయైన అముద్రిత గ్రంథ చింతామణిని తత్సంపాదకులను పూండ్ల రామకృష్ణయ్యగారిని వెలుపు లేని విమర్శకులని ప్రశంసించిరి. కాని ఆ యముద్రిత గ్రంథ చింతామణియందే 1894–95 ప్రాంతము నుండి మా తాతగారు శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిగారు భారతముపై ఎంతో చర్చచేసి వ్రాసిన విశేషములను ఈ సంశోధిత ముద్రణ సంపాదకులు చూచినట్లుకూడ తెలుపలేదు. ఒకటి రెండుచోట్ల అధోజ్ఞాపికలలో తాతగారి పేరున్నను అ. గ్ర. చింతామణిలోని వారి పాఠాంతరములను గుణించికాదు. అ. గ్ర. చిం. లో ఆనందవారి ముద్రణముంగూర్చి ఇట్లు కలదు (1902 సం 1, 2—పు 5):

'ఆంధ్రమహా భారతమును మహారా. వేమూరి వేంకటకృష్ణమసెట్టి అండ్ సన్స్‌గారు—బ్రహ్మశ్రీ, మహారాజరాజశ్రీ రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులవారిచేతను బ్రహ్మశ్రీ రాయదర్గము నరసయ్యగారి చేతను బరిష్కరింపించి ముద్రించి యున్నారు...

తెలుగు భారతము ప్రప్రథమమున 1867సం॥ ఏప్రిలు నెలలో ప్రకటింపఁబడినది. అపుడు దానిని చెన్నపురి రాజకీయ పాఠశాలాంధ్ర ప్రధాన పండితులగు వింజమూరు కృష్ణమాచార్యులవారు పరిష్కరించిరి. అపుడే దీనియందు గొన్ని స్ఖాలిత్యము లుండినవి. ముద్రిత గ్రంథములు చిక్కుచు వచ్చినందున తాళీదళ సంపుటములను జూచువారులేక యవి...పోగా నిప్పటికిని కొన్ని గ్రంథములు మిగిలియున్నవి. ముద్రిత గ్రంథములలో సంశయాంశములు సంభవించినపుడు వ్రాతప్రతులు జూచి తీర్మానించుచున్నారు ... మేమిపుడు వ్రాయదలంచిన విషయమంతయు దదనుసారమై యుండును...స్థాలీపులాకన్యాయముల గైకొందుము.

ఇపుడు...బ్రహ్మశ్రీ శతఘంటము వేంకటరంగ శాస్త్రులవారు 88 పుటల పీఠిక వ్రాసి ప్రకటించి యున్నారు. దానియం దనేక విషయములు విమర్శింప దగియున్నవి...

ధృతరాష్ట్రుండును బుత్రులు న్వనము గుం
  తీనందనుల్ సింహముల్
మతినూహింప నసింహమైన వనమున్
  మర్దింతు రెందు న్వనా
వృతవృత్తంబులు గాని సింహములకు
  న్వేగంబు చేటొందుగా
న తగం బొందుట కార్యమీ యుభయమున్
  సంతుష్టిమై నున్కికిన్.

అని యుద్యోగపర్వ ప్రథమాశ్వాసమున 359 వ పద్య. ముద్రింపబడియున్నది. ఇందు నాలవ పాదము నందలి ప్రాసముంగూర్చి 'కానన్' శబ్దము ద్రుతాంతమైనను దీని నిచట దిక్కనగారు కళగానే వ్రాసినారని

వేంకటరంగశాస్త్రిగారు 'కానన్ [అన్న ద్రుతాంతము
కంటె 'తగన్' అను పదము పరమగునపుడు ద్రుత
మున కర్ధానుస్వారమును 'త' కారమునకు 'ద' కార
మును రావలసియుండగా నట్లులేక తకార ప్రాసమున
'త' కారము గానే ప్రయోగించి యుండుటంజేసి
యెక్కడనేని గొన్నిచోట్ల 'కానన్' అనుదాని ద్రుత
మునకు లోపమును దానిమీది పరుషవర్ణములకు సరళ
వర్ణము లాదేశములుగా రావనియు నీ ద్రుతము లోపించి
పరుషవర్ణమే నిలుచుననియు నందుల కీ నిపాతనము
జ్ఞాపకమని కల్పింపవలసి యుండెడు. ఇట్టి ప్రయో
గము లింకెక్కడనైన నుండెనేని వాని కీ ప్రయోగ
మాధారమగును' అని వ్రాసినారు.

ఈ పద్యముపై 1895 సం॥ ఏప్రెలునెల
మా మయూఖములో బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయ
శాస్త్రులవారు విమర్శవ్రాసి యిట్లు ప్రకటించి
యున్నారు. 'కానతెగన్; కాన=అడవి; తెగన్ = నఱుక
బడిపోగా నని యర్థము... ఆ సవరణనుగూర్చి పీఠికా
కారులగు నీ వేంకటరంగశాస్త్రులవారు 85 పుటలో
వ్రాసిన వ్రాతం గనుడు — 'కానతెగన్ అని పాఠము
గల్పించి, కాన=అడవి, తెగన్=తెగగా; నావృత వృత్తం
బులుగాని సింహములకున్ వేగంబచేటొందునని మూడవ
పాదముతోనైన నన్వయింప వచ్చును' అని వ్రాసి
యున్నారు. 'కల్పించి' అని వీరు వ్రాయుటచేతనే వీరికీ
యర్థమంత బుజువుగా నుండలేదని స్పష్టపడెగదా. వీరికే
గాదు, గ్రంథముం బరిష్కరించిన పండితద్వయమున
కును 'కానతెగన్' అను పాఠము రుచింపలేదు. రుచించి
యున్నచో 'గానతెగన్' అని ముద్రింపరా. సంస్కృత
మూలముం గనుడు.

శ్లో. వనంరాజా ధృతరాష్ట్ర స్సపుత్రో
వ్యాఘ్రాస్తేవై సంజయ పాణ్డుపుత్త్రాః
మా వనం ఛిన్ధి సవ్యాఘ్రమ్
మా వ్యాఘ్రా నీనశు ర్వనాత్ ॥53॥

శ్లో. నిర్వనోవధ్యతే వ్యాఘ్రో
నిర్వ్యాఘ్రం ఛిద్యతేవనమ్
తస్మాద్వ్యాఘ్రో వనంరక్షేత్
వనం వ్యాఘ్రం చ పాలయేత్ ॥54॥

ఇందు రెండవ శ్లోకమునందలి 'నిర్వనో
వధ్యతే వ్యాఘ్రో' అను వాక్యమునకు 'వనావృత
వృత్తంబులుగాని సింహములకు వేగంబ చేటొందు'
అనునది తిక్కనగారి భాషాంతరీకరణమట. నిర్వనః
అనగ బోయిన వనముగల, ఛేదింపబడిన వనముగల యని
యర్థము. కావున నిర్వనములై యుండుటచేత నావృత్త
వృత్తంబులుగాని సింహములకు వేగంబ చేటొందు
నని యర్థము. ఏతత్పీఠికాకారుల మతముబడి తిక్కన
'కాన' అను పదము గారణవాచకముగా నుపయోగించి
యుండినచో సింహములు వనావృతవృత్తంబులు గాక
యుండుటకు గారణమూహ్యము. ఇట్లగుటకు గార
ణము వనచ్ఛేదమో, లేక వనము స్వస్థముగానుండియు
సింహస్వచ్ఛందవృత్తియో యీ రెంటిలో నొకటి
కారణముగా నుండవలయును. 'వనావృతవృత్తంబులు
గాని' అను వాక్యములో 'నిర్వనమ్'అను పదార్థము
రాదు. 'కాన తెగన్' అను శ్రీ శాస్త్రులవారి పాఠ
మీ సందిగ్ధమును దొలగించి మూలము ననుసరించి
యుండును. మఱియు 'దగన్' అనగా నొప్పునట్లుగా
నని యర్థమని పీఠికలో వ్రాయబడియున్నది. ఒప్పు
నట్లుగానని వ్రాసిరిగదా ఒప్పనదియేది? ఈ యొప్పుట
లేకయే 'పొందుట కార్య మీ యుభయమున్ సంతు
ష్టిమై నుక్కికిన్' అను వాక్య మర్థమగుచున్నది.
కావున దిక్కయజ్వ యిట్టి యపుష్టార్థక పదమును
ప్రయోగించియుండడని నొక్కి చెప్పనగు. మూలాను
గుణపారియగు వేంకటరాయశాస్త్రులవారి పాఠము—
లక్ష్యలక్షణ విరుద్ధ మిథ్యాకల్పనయగు పీఠికాకారుల
సిద్ధాంతమున కవకాశము లేకయే తద్ప్రాసదోషము
దొలగించును. ఒకవేళ పీఠికాకారులు మూలశ్లోకములో
'తస్మాత్'అను పదమున్నదిగనుక 'కాన'యను పదము
నవ్యయముగా దిక్కన ప్రయోగించియుండునని యిక
వాదింతురు గాబోలు. అది సమంజసముగాదు. అట్లైన
మూలములోనున్న వ్యాఘ్రశబ్దమునకు దెలుగు పద్యము
లోని సింహశబ్దము పర్యాయపదమనియు జెప్పుదు
రేమో. శ్లోకద్వయభావమే తిక్కనకు ముఖ్యము. రెండు
శ్లోకములకుంగదా యొకపద్యము వ్రాయబడినది. 'కాన
తెగన్'అను పాఠములో గాన నను నవ్యయము నాలవ
పాదములోని 'పొందుట'అను పదమునకుముందు నధ్యా
హార్యముగ నున్నది. కావున నీ పాఠమే సర్వవిధ సమంజ

సము. ఇట్టి పాఠమును కల్పనయనిచెప్పి యొక యవ లక్షణపు బాఠము నూహించుట పాడిగాదు. ఉభయభాషా పాండిత్యముగలిగిన వేంకటరంగశాస్త్రిగా రిట్టి పట్టును దిట్టముగా విచారించి యిదమిత్థమని న్యాయముగా నిర్ణయింపకుండుట మిగుల లోపమని తలంచెదము. పండితులకు న్యాయము కంటగించుచున్నది. అక్షరాస్య లసూయాగ్రస్తులైరి.........'

తర్వాత తాతగారి పాఠమును శ్రీ కొక్కొండము వేంకటరత్నము పంతులుగారు అంగీకరించినారని శ్రీ పూండ్లవారు 38 వ పుటలో తెలిపినారు. 'దేవుడు వరమిచ్చినను బూజారి వరమీయడు' అన్న సామెత నందతెఱింగియేయుందురు. దీనికి ప్రస్తావన మన గత సంచికలో 'ధృతరాష్ట్రుండును'అను పద్యముపై వ్రాసిన విమర్శయే. 'కానతెగ' నీ విషయము తెగినదని యంద తెఱింగినదియ. శ్రీ వేంకటరాయశాస్త్రిగారు దీనిని మా మయూఖములో దెగించి త్రెంపినతర్వాత సంజీవన్యధిపతులు మన్మథ మధుమాస సంజీవనిలో 8 వ పుటయందు.........గా/న తెగంబొందుట......అనియే ముద్రింపించినారు. శ్రీ వేంకటరాయశాస్త్రులవారి సవరణను శ్రీ వేంకటరత్నము పంతులవారొప్పి మన్మథను సమ్మతించి ప్రకటించికొనినను శ్రీ వేంకటరంగ శాస్త్రులవారు 'తెగ'నీయక 'తగం' బొందింప యత్నించుట కడు సంతాపకరముగా నున్నది. ఉభయవాదు లొప్పినను వేంకటరంగశాస్త్రిగారు తెగనను పాఠము 'కల్పిత' మనుటయే పై సామెతకు భావము...పత్రికాధిపతి.'

ఈ సవరణగాని దీనింగూర్చి యెట్టి విమర్శగాని ఈ సంశోధిత ముద్రణమందులేదు.

'ఏనుబిదప — ఏనవిదప' అను దానింగూర్చి సంశో. ముద్ర. సంపాదకులు ప్రస్తావించిరిగాని అ. గ్ర. చిం. తేల్చినట్లు వ్రాయలేదు. ఎందుచేతనో తెలుపరు. ఇట్లు వ్రాసినారు: 'ఈ క్రిందిపద్యమొక మనోజ్ఞమైన వివాదమునకు దారి చూపినది—

'కవదొనలును గాండీవము
నవల నిడంబనుపు ముంద అరదము డిగు మే
న(ను) విదప డిగియెద శుభకర
మపు నివ్విధమట్లు సేయుమనుడు నతండున్.'

అని యీ పద్యము నుదాహరించి ఏను+పిదప, ఏను+బిదప అని మారవలసిన విషయములను ప్రాస దోషాదులను చర్చించి, ఏను కళగాదనియుచెప్పి, మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి సమర్థనమును నిరసించి 'తిక్కన సోమయాజి కావించిన యీ ప్రయోగము పండితులలో దీవ్రమైన వివాదమున కవకాశ మొసంగినది. అది యిప్పటికిని అపరిష్కృతముగానే యుండిపోయినది'అని వ్రాసినారు.

అముద్రితగ్రంథచింతామణి దీనింగూర్చి యిటు వ్రాసినది: 'ఈ పద్యమందు వ బ ప్రాసమని వేంకటరత్నము పంతులుగారు వాదించిరి. వారి వాదమంతయు వీరొప్పక (వీరనగా శతఘంటమువారు) 'ఏనవిదప'అని ప్రకటించి వ బ ప్రాసమును నిరసించినందులకై సంతసించు చున్నాగము.' ఈ వాక్యములకు కొంతముందు 'వేంకటరాయశాస్త్రులవారు గావించియున్న మార్పులలో వీరు గైకొన్నవానిలో మఱి కొన్నింటివి వివరింతుము' అని వ్రాసి అందు పై వాక్యములను చేర్చినారు. తాతగారివార్పు సంపు 9. సంచిక 1. 1896. పు. 4 లో నున్నది. 'ఏనుశబ్దము ద్రుత ప్రకృతికమా కాదా ? ఏనుశబ్దము ద్రుతప్రకృతికమని బ్ర. శ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులవారును, కళయని బ్ర. శ్రీ. మండపాక పార్వతీశ్వర శాస్త్రులవారును పత్రికలో నభిప్రాయములను దెలిపియున్నారు. ఈ చర్చకు భారతమునందలి' (అని 'కవదొన' పద్యము నుదాహరించి) 'అను పద్యములోని 'ఏనువిదప' అను ప్రయోగము కారణమై యున్నది. ఇచట బార్వతీశ్వర శాస్త్రులవారు 'ఏను' శబ్దము కళయనియు దానిపై 'బిదప' అను పదమునందలి యాద్యపకారమునకు బ్రథమమీద విహితమైన వాదేశము రాగా 'ఏనువిదప' అనియాయెననియు వివరించి 'ఏనుశబ్దము కళయనుటకు నాంధ్రశబ్ద చింతామణి యందలి—'గసడదవాః స్యుః ప్రథమా మాత్రాదాత్మాస్మదోర్వినైవైతే'అను సూత్రమున 'అస్మత్' శబ్దము నేను శబ్దమును చెప్పనేగాని 'ఏను' శబ్దమును చెప్పదనియు, 'తిజ్మధ్యశేష షష్ఠీ ' ఇత్యాది సూత్రమందు 'శేష' శబ్దముచే 'ఏను' శబ్దము గ్రహింపబడు చున్నదనియు నందుచేత 'ఏను' శబ్దము

కళయని యేర్పడినదనియు, ఇట్లు 'ఏను' శబ్దము కళయు ప్రథమయు గావున '(ప్రథమా మాత్రాత్' అనుటచేత దానిపై పకారమునకు, వకారము వచ్చిన దనియు, నట్లే ఏనుశబ్దము కళయైనందులకు,

'నీ చెప్పిన పెద్దలు ద్రో
ణాచార్యులు మొదలుగాగ ననికొల్లని వా
రై చన్న వారలంగొని
యే చక్కం బెట్టువాడనే పాండవులన్'

అని భారతోద్యోగ పర్వములో ప్రయోగము కలదనియు నుపపత్తి వ్రాసియున్నారు. ఇచ్చోట వేంకటరత్న పండితులు 'ఏను బిదప' అనియే పాఠ మనియు 'ఏను' శబ్దము ద్రుతప్రకృతికమే గాని కళ గాదనియు ద్రుతప్రకృతిక మైనందున దానిపై పకారమునకు బకారము (సరళాదేశము) రాఁగా 'ఏను బిదప' అని అయినదనియు, ఈ ప్రయోగముచేత వ బ లకు ప్రాసమైత్రి లభించుచున్నదనియు అభిప్రాయ పడి తదనుసారముగా బిల్వేశ్వరీయమందు వ బ లకుఁ బ్రాసము ప్రయోగించినారనియు మీ ప్రతికలవలన గనపడుచున్నది. ఇందులో శాస్త్రులవారు 'ఏను'శబ్దము కళయనుటకు జెప్పిన యుపపత్తులు దుర్బలముగా నున్నవి. ఆ యుపపత్తుల నంగీకరించిన ననిష్టము లనేకములు కలుగుచున్నవి.

'ఆత్మా స్మదోర్వైవ' అనుచోట అస్మ చ్ఛబ్దము 'ఏను' శబ్దమును చెప్పదనియు 'నేను' శబ్దమును మాత్రము చెప్పుననియు వచించుటకు బ్రమాణమేమియు లేదు. 'నేను' 'ఏను' అను నీ రెండు రూపములును నన్నయభట్టీయమందలి 'ప్రథ మాయ మేదస్మదః' అను సూత్రముచే నిష్పన్నమగు చున్నవి ... రెండు రూపములలో నొకటి గృహీతము ఒకటి కాదనుటకు నేమియు న్యాయములేదు.........

మఱియు బ్రయోగాంతర బలముచేనైనను 'ఏను'శబ్దము కళయని యొప్పికొందమనిన శాస్త్రుల వారందులకై యిచ్చిన ప్రయోగాంతరము పూర్వోక్తో ద్యోగపర్వ పద్యములో నాలవ పాదములో (వారలంగొని) 'యేచక్కంబెట్టువాడ' ననునది శాస్త్రులవారి యభి ప్రాయము ప్రకారము 'ఏనుచక్కంబెట్టువాడను' అని యిచట బదవిభాగము. ఈ పద్యమున నీచోట ఏను శబ్దముయొక్క 'ను' వర్ణము లోపించి 'ఏచక్కం బెట్టువాడన్'అను రూప మేర్పడుటకు శాస్త్రమేమి? ఇది కళ యట గదా. కళయొక్క యంతిమ 'ను' వర్ణ మునకు లోపము వచ్చుట గలదా? 'మీనుచావు' అను నది 'మీ చావు'అని అగునా? ప్రయోగప్రభావముచే 'ఏను' శబ్దమునకు మాత్రమే 'ను' వర్ణలోపము గ్రహింతమన్న 'ఏయడిగితిన్'అని చెప్పవచ్చునా? ఏను శబ్దము కళయగుటకయి అస్మచ్ఛబ్దమున కది అర్థము కాదని వ్యవస్థ కావలసినట్లే; అందుకు నుదాహరణాం తరమని 'ఏచక్కంబెట్టువాడన్' అనుదానిని తెచ్చుటచే 'ఏను' శబ్దముయొక్క 'ను' వర్ణలోపమును సాధించుట కయి మఱి యేసూత్రములకయినను క్రొత్తవ్యాఖ్యలు చేయవలసివచ్చినది. తన ను వర్ణలోపమునే సాధించుకో లేని యీ 'ఏచక్కంబెట్టువాడన్'అను ప్రయోగము 'ఏను' శబ్దముయొక్క కళాత్వము నెట్లు సాధించును?

మఱియు నశాస్త్రీయమైన 'ను' వర్ణలోపము నంగీకరించి కళయని వాదించి యనిష్టములు కలి గించుటవలెనే 'చక్కంబెట్టువాడన్' అను దానియందలి 'చ' వర్ణమునకు నశాస్త్రీయమైన సరళసంజ్ఞ నంగీ కరించి యిది ద్రుతప్రకృతికమేయని యీ ప్రయోగ మందు నేల వాదింపగూడదు? సరళ వర్ణమునకు ముందుండు ద్రుతమునకు లోపము రావచ్చును గదా? రెండు వ్యవస్థలు నశాస్త్రీయములైయుండగా నందులో నొకటి గ్రాహ్యమును నొకటి యగ్రాహ్యమును యెట్లగును?

ఏను శబ్దము ద్రుతప్రకృతికమని వాదించువారి మతమునను తిక్కన సోమయాజులవారి యీ ప్రయో గము దుష్టమేగదా యగును. అనిన, అట్లుగాదు, 'ఏ చక్కం బెట్టువాడన్' అను నీచోట 'ఏను' శబ్దమే లేదు. 'ఏను' శబ్దము 'చక్కం బెట్టువాడనే బాండ వులన్' అని 'పెట్టువాడన్' అను పదమునకు బిమ్మట నున్నది. మఱి పాదాదియందున్న యీ 'ఏ' శబ్దము యొక్క తత్వమేమనగా నిది వ్యతిరేకార్థక మయిన 'ఏ' కారము. 'అనికొల్లనివా। రై చన్న వారలంగొని। యే చక్కం బెట్టువాడనే బాండవులన్' [నేను యుద్ధ

మున కంగీకరింపక చన్న ద్రోణాచార్యులు మొదలగు వారిని కొనియే (కొనియా) పాండవులను చక్కం బెట్టుదును. వారిని గొనికాదు, కర్ణుడు దుశ్శాసనుదు సౌబలుడు వీరినిగొని పాండవులను చక్క బెట్టుదును ; అని యన్వయము.]... ఈ హేతువుల 'ఏ చక్కం బెట్టువాడన్' అను ప్రయోగము ఏమ శబ్దముయొక్క కళాత్వమును సాధింపనేరదు......' (అని దీనింగూర్చి చాల పుటలు వ్రాసియున్నారు.)

ఈ విధముగా కొన్ని సంవత్సరములు మహా పండితులు చర్చలు జరిపియుండిన అముద్రిత గ్రంథ చింతామణిని ఎఱిగికూడ మా తాతగారి మార్పులో సవరణలో దిద్దుబాట్లో— వానిని గుఱించి అవును కాదని ఈ ముద్రణమున ఎందులకు చెప్పకూడదో తెలియరాకున్నది. ఇది పొరపాటనుకొనుటకు లేదు. అ. గ్ర. చింతామణిని పూండ్లవారిని వీరు ప్రశంసించియే యున్నారు. వేమూరు వేంకటకృష్ణమసెట్టి అండ్ సన్స్‌వారి ముద్రణమును, శ్రీ కందుకూరు రాయ దుర్గమువారి సంపాదకత్వమున, శతఘంటమువారి యుపోద్ఘాతముతో వెలువడిన దానిని పేర్కొన్నవారు ఈ విమర్శలను చూడలేదనుట విశ్వసనీయముగా కనబడదు. తాతగారిని స్మరింపకపోవుటకు ఏదో బలమైన కారణమే ఉండవలెను.

తాతగారి సవరణ ఒకటిమాత్రము చూపినారు. ఆరంభమందే మొదటి వచనమున 'అని హరి హర హిరణ్య గర్భ పద్మోమా వాణీపతుల' అని దాని క్రింది అధోజ్ఞాపికలో 'అని......వాణీసతుల—అని వేదం వేంకటరాయ శాస్త్రిగారును (మదరాసు విశ్వవిద్యాలయమువారి సెలక్షన్సు) సూచించిన పాఠములు గమనింపదగినవి' అని వ్రాసినారు. అంతే. ఇకవారు సూచించిన పాఠములు సవరణలు కొల్లలుగా నున్నను స్మరింపలేదు ఒకటి రెండు ఉదాహరణములు—

డ ఢ ప్రాసము. రూఢిగ- రూడిగ. ఆది. ప్రథమాశ్వా. 69 వ పద్యము — 'ఏడకొ్కహిణులెన్న... రూఢిం గౌరవసైన్య...। యీాడం బోవక...స॥ల్లాడెన్...' ఆది. అష్టమాశ్వా. 156 పద్య. 'వేడుక నమ్ముని ముందట। బాడితి మాడితిమి పెక్కు పరిహాసంబుల్। రూఢిగఁ బలికితి మెట్లుం। జూడదు మావలను నీరసుండన నుండెన్.' వీనిలో మొదటి పద్యములోని 'రూఢి'కి 28 వ పుటలో 'రూడిన్' అని పాఠాంతరము చూపినారు. రెండవదానికి అధోజ్ఞాపికలో ఈ పద్యమున డ—ఢ ప్రాసము అనియు రూడిగ—ద. వీ. భాసం. సూ. దీనినిగుఱించి తాతగారు అ. గ్ర. చిం. లో నిట్లు వ్రాసియుండిరి: 'ఈ పద్యములలో 'రూడి' యని కవి వికృతిపదముం బ్రయోగించినాడు గాని రూఢియని ప్రయోగించి యుండలేదు. గాన నిది డ ఢ ప్రాసము గాదు. ఈ ప్రయోగములనుబట్టి యదృష్టచరమైన డ ఢ ప్రాసము నితరులు వ్రాయుదురనియే శబ్దరత్నాకరములో 'రూడి' యను వికృతి పదమునకు నీ ప్రయోగములం జూపక, 'సీ॥ రూడి నెన్నికగన్న నాడెంపు దెఱగంటి చిగురాకు బోడుల జెఱలు దెచ్చి' అని యచ్చతెన్గు రామాయణముననుండి యుదాహరణము వ్రాయబడియున్నది ... ఎట్టి తుచ్ఛకవిత్వము నందును డఢ—బభ—గఘ—వబ—తద—గక లోనగు ప్రాసము లగపడనందున నింతదూరము విచారించి నా యభిప్రాయమును వ్రాసినాను.'

ఇంబుగ సర్వలోక—ఇమ్ముగ. ఆది. 1—76 వీరు పద్యమును పూర్తిగ 'ఇంబుగ ... బంబున ... ధ్రంబను ... ద్యుంబరము' అనియే ముద్రించినారు. సర్వలక్షణసార సంగ్రహములో (పు.116) ఇమ్ముగ ... బమ్మున ... ధ్రమ్మను ... వం। ద్యుంబర' అని 'ంబ' 'మ' లకు ప్రాస కలదు. నాలవపాదము 'వంద్యుమ్మని' అని ఆనందప్రతి. అందే అధోజ్ఞాపిక, పాఠాంతరము వంద్యుమ్మని. దీనింగూర్చి అముద్రి. గ్ర. చిం. 'తాళపత్ర ప్రతులయందును ముద్రిత ప్రతులయందును 'ఇమ్ముగ' నని యున్న పాఠమును నీ సంస్కరణకర్తలు కారణము చెప్పక 'ఇంబుగ' నని వ్రాయుట మిగుల శోచనీయముగా నున్నది ...

అప్పకవి—

'రంబుజంబు రంబుజంబు
రంబుఁజెన్ను మీఱఁగాఁ
దొమ్మిదింట వి్రశమంబు
తోరమై సుగంధికిన్
గ్రమ్మగా నుతింప నొప్పు

గానలోలుఁ డచ్యుతుం
డంబుజాక్షుఁ డాదిదేవుఁ
డక్షరాఖ్యు డెప్పుడున్
'ఇమ్మహిలోఁ । గ్రమ్మ భగల్
బింబమునం । గంబుధరా'

... కావున వీరి భారతములో నున్నట్టి 'ఇంబుగ' నను పద్యము 'ఇమ్ముగ' వనియే యుండ వలయునని మా సిద్ధాంతము...మేము 1900 సం॥ మే నెల మయూఖములో వివరించి యున్నాము. ఈ ప్రాసము పనికిరాదని వీరుమాత్ర మభిప్రాయ పడిరే గాని తక్కినవారెవ్వరిట్లు అభిప్రాయ పడలేదు. ప్రక్రియా ఛందస్సున యతిప్రాసమున కుదాహరణము లని (ఇది వేదము వేంకటరాయశాస్త్రులవారిది) యిట్లు వ్రాయబడియున్నది :—

'అంబకు మ్రొక్కి నా కలవడినట్లు
ఇమ్ముగా యతి కుదాహృతులు సెప్పెదను'

అని వ్రాసియున్నారు. ఈ ప్రాసమే చెల్లకున్నచో 'ంబ—మ్మ' లకు బ్రాసముగా నేల ముద్రింపఁబడెనో యోచింపుడు.' ఇది డెబ్బదియేండ్ల క్రిందిమాట. నన్నయ్యకీ ప్రయోగము లిష్టమేమో ఇట్టి పద్యము లింకను కలవు.

వావిళ్లవారి సం. 1917, ముద్రణమున పుట 15. అధోజ్ఞాపిక. 'ఇంబుగ..., బింబంబున..., రంధ్రంబను..., వంద్యుంబరముం బరాశర...' అను పాఠాంతరము పండిత కల్పితముగానోపు. ఇది ప్రథమ ముద్రిత ప్రతులయందును, పెక్కు వ్రాతప్రతుల యందును లేదు. 'వంద్యుమ్మని' యనుచో 'కమ్మని లతాంతముల కుమ్మెనసి' యనురీతి యొప్పును.' పైన పద్యమును 'ఇమ్ముగ—బమ్మన— ధమ్మను — ద్యుమ్మని'యని ముద్రించినారు.

కపిలగడ్డము — కవిలగడ్డము

దీనింగూర్చి ఈ సంశోధకముద్రణ సంపాదకులు — కవిలగడ్డమనియే గ్రహించి, అ. గ. చిం. ఉదాహరించి ఎట్లును తెల్పని విధమున తమ యభిప్రాయ మిచ్చినారు. పూండ్లవారు మా తాతగారి యభిప్రాయము నుదాహరించి తెల్పినారు. '1895 సం. అక్టోబరు నెలదియగు మా చింతామణీ మయూఖము యొక్క 95 వ పుటలో వేంకటరాయ శాస్త్రుల వా రీ కపిల కవిల శబ్దములంగూర్చి యిట్లు నిర్ణయించిరి: 'వకార ప్రాసముచేతఁ 'గవిల' అని 'కపిల' శబ్దమునకొక వైకృతము గ్రహింపఁబడి యుండలేదా. సీతారామాచార్యులవారు వ బ ప్రాసమునే యొఱింగి యుండిన 'వేవణములు' అని వాదేశమో, 'వేఁబణములు' అని బాదేశమో యెట్లు నిర్ణయించు కొందురు? రెండు నశాస్త్రీయములే కదా' అని నిర్ణయించియే యుండిరి ... కావున భారతమున గల పై పద్యములో నున్నట్టిది ప వ ప్రాసముగాదు గాన ధానిని వ ప్రాసముగా నెఱుంగునది.' (పత్త్రికాధిపతి.) అప్ప కవి దీనిని విశేషవళుల క్రింద గణించినాడుగదా. ఈ పరిశోధక ముద్రణమున నిదమిత్థమని గట్టిగా తేల్పవలదా ?

ఇదంతయు చూడగా క్రోడీకరించి పాఠములు సేకరించి ఎంతో సేవ భాషకు చేసినను పాఠనిర్ణయ విషయమున తగినంత స్వాతంత్ర్యమో ధైర్యమో వీరు చూపలేదు. విమర్శకు లేమందురోయన్న భీతి కనబడుచున్నది. వ్యావహారిక గ్రాంథికముల మధ్య నేర్పడిన యొక సందిగ్ధావస్థ.

'తటస్థ భావము'

తాము తటస్థభావము వహించితిమని వీరు ప్రకటించుకొన్నారు. మంచిదే కాని పండిత నిర్ణయ మొనరించి, ఉపపత్తులనుకూడ ప్రకటించియుండి, తమ నిర్ణయములు ఎంతవఱకు సకారణములో తెల్పినచో వీరి పరిశ్రమయొక్క ఫలము పఠితలకు అంది సార్థకమై హృదయాహ్లాదకరముగా నుండియుండెడిది. 'నిజమైన సంశోధిత ముద్రణము లభ్యములైన సాక్ష్యములన్నియు విద్వత్సంఘముల ముందుంచి ప్రత్యేకములైన పాఠముల నంగీకరించుటో, తిరస్కరించుటో వారు స్వయముగా నిర్ణయించుకొనుట కవకాశమొసంగ వలయును.' ఉత్తమ పద్ధతియేగాని ఇంతటి పండితులు, దేశమునకు తలమానికము వంటివారే నిర్ణయింపలేక తాటస్థ్యము వహించిన ఇతరుల గతియేమి?

మార్గ మ్మైనను చూపవలెను గదా. సంశోధిత ముద్రణ భావోదయమును శ్రీ గిడుగువారు, జయంతివారు, కట్టమంచి చిలుకూరి ప్రభృతుల యాశయములను తెల్పినవారు మూలమును ముద్రించునప్పుడు తమ నిర్ణయములను తెల్పుటలో దోషములేదు. మంచిదే.

అట్లే అధోజ్ఞాపికలో అప్రసక్తము లైనను కొన్నిటిని ధైర్యముగా వ్రాసియున్నారు. ఉపో. 109 పుట తెలుగు (అదే ఇంగ్లీషు 29 పుట)లో రాయ దుర్గం నరసయ్యశాస్త్రులవారిని గుఱించి అధో జ్ఞాపికలో వ్రాయుచు 'నాటకమున నీచపాత్రములకు వ్యావహారిక భాషను వాడినవారిలో నరసయ్యగారే ప్రథ ములని చెప్పవచ్చును. తరువాత వేదం వేంకటరాయ శాస్త్రులవారు తమ ప్రతాపరుద్రీయ నాటకమున నీ ప్రయోగమును జయప్రదముగ నిర్వహించియుండిరి.' ఇట్టి వ్రాతకన్న ఆశ్చర్యము వేఱుండదు. 1891 లోనే మా తాతగారు పాత్రోచిత భాషను తమ నాగా నందమున వాడియుండ, దానినిగుఱించి దేశమున దుమారములేచి పండితులలో యుద్ధములు జరిగి అ. గ్ర. చిం. లో ఎన్నో వ్యాసములు ప్రకటితము లైయుండగా వీరిట్లేల వ్రాయుచున్నారో అర్థమగుట లేదు. పాత్రోచితభాషను గ్రామ్యమని నిందించి, తాత గారిని గ్రామ్యశాస్త్రియని ఆక్షేపించి, వారి యుద్య మమును అడుగంట త్రొక్కివేయించుటకు ప్రయ త్నించిన పండితులతో చేరినవారిలో నరసయ్యశాస్త్రిగా రొకరు గదా. వీరిది ఈ బెస్తవాని పద్యము వ్యావహా రిక భాషావాది రచించునా ?

'ఏదిసొజపుఁ బనియనియెద
రదియేవం బయ్యు విడుననగునె బశువులం
జదుపు పనిఁ గ్రూరుఁడయ్యును
సదయతచే శ్రోత్రియుండు సౌమ్యుండె
యగున్'.

దీనింగూర్చి పూండ్లవారి విమర్శను అ. గ్ర. చిం.లో 1898, సం॥, సంచి. 1-పుట 8 లో చూడనగును.

ఇవిగాక అభిప్రాయభేదముల కెడమిచ్చు పాఠ ముల నొకటి రెంటిని ప్రస్తావించి ఈ సమీక్షను ముగింతును. సభా. 2.49 లో 'పరగఁ బొగడికోలుఁ బ్రబ్బికోలు' అని ముద్రితము. ఇట ప్రబ్బికోలనగా పొగడికోలే గదా.

'అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్నుఁ
బరగఁ బొగడికోలుఁ బ్రబ్బికోలు
ఆపగాతనూజ యార్యవృత్తములు గా
వనిరి వీని నాద్యులయిన మునులు'

ఇట ప్రబ్బికోలు అనగానేమి? దానికిని పొగడికోలు అనియేగదా యర్థము (చూ. శర) అధోజ్ఞాపికలో 'ప్రచ్చికోలు' కలదు. వావిళ్లవారి పాఠము ప్రచ్చి కోలు. అనగా నిందపడుట. ప్రయ్యు ధాతువు. తమి ళము పఱి(ళి). పరస్తుతి పరనింద, ఆత్మస్తుతి, ఆత్మనింద సద్వృత్తములు కావని యభిప్రాయము. ప్రచ్చికోలు పాఠమే మేలేమో.

ఆది 1—136.

'తనయెఱిగిన యర్థంబొరుఁ
డనఘా యిది యెట్లు సెప్పుమని యడిగినఁ జె
ప్పని వాడును సత్యము సె
ప్పనివాడును ఘోరనరక పంకమునఁ బడున్.'

ఇందు చెప్పనినాడును ... నాడును అని వీరి యధోజ్ఞాపిక. అదే వావిళ్లవారి ప్రధానపాఠము.నాడును అనగా ఎడల—చేదర్థమున చెప్పనియెడల అని విశిష ప్రయోగము. నాడు అని కాలవాచిగ గ్రహించుట పొర పాటు. ఈ నాడు పాఠము 8 ప్రతులలో నున్నట్లు సూచింపబడి యున్నదికూడ. నన్నయ్య ఇతరత్ర— ఆర. 264. శత్రుసంహారంబు సేయనినాఁ డత్యంత హానియగు; నీవు దీని కొడంబడనినాడు; రండు, రానినాడు—రండెఱింగి. ప్రయోగించి యున్నాడు గదా.

ఆది 4—4. తనుఁడు—తంసుదు.

'నయ్యరువురకుఁ ద్రసుఁడు ధీరుఁడు పుట్టెన్' ఇది ఆనందపాఠము. వావిళ్లవారిదికూడ ఇదేగాని వారి అధోజ్ఞాపిక— 'తంసు' అని వ్రాతప్రతులయం దున్నది ... సంస్కృతమున 'ఈలినంతు సుతం తం సుర్జనయామాస, ఈలి నోజనద్యామాస దుష్య న్తమ్'. కాని వావిళ్లవారు పైన 'తంసు' అని ఏల ముద్రింపలేదో ! మూలము ఆది. 94-14. 15.

'మతినార ఇతిఖ్యాతో రాజా పరమధార్మికః
మతినార సుతారాజన్ చత్వారోఽమిత విక్రమాః
తంసుర్మహా నతిరథో ద్రుహ్యశ్చాప్రతిమద్యుతిః
తేషాం తంసుర్మహావీర్య పౌరవం వంశముద్వహన్'

వావిళ్లవారి ఫుట్‌నోటు సాధువని శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, నవంబరు 1962 భారతిలో తేల్చి యున్నారు. వారుకూడ ఈ సంపాదక వర్గమున నుండియు ఈ పాఠము ఎట్లు తప్పిపోయినదో!

ఆరణ్య 2—153

దమయంతి నలునెడబాసి విదర్భపురంబున నుండుట. 'భామ విదర్భకేగి ... జీవిత। స్వామి నిజేశుఁజూచు దివసంబుల కోరుచు ...' జీవితస్వామి నిజేశుఁడే గదా· ఇందు అర్థ పునరుక్తి లేదా? 'నవేశు' డని పాఠాంతరమున్నది. ఆనందలో అది ప్రధానము, వావిళ్లలో 'నిజేశు'డు. నవేశుడు మెఱుగు గాదా.

చిల్లర విషయములు

'కులబ్రాహ్మణుని' గూర్చి చాల చర్చ జరిగినది. 'కులవిప్రః పురోహితః' శాసన కావ్యకర్తలు అనాదిగా నియోగి పరంపరలో కనబడుచుండుట చేతను, అట్లే ఇతనికిముందు భట్టబిరుదధారులు పలువురు శాసన కావ్యకర్తలుండుటచేతను ఇదొక 'రాయసం' (వ్రాయసము) వ్రాతల వక్కణల యుద్యోగము, పురోహితుని వంటివారు చేయదగినదిగా నుండదగును. పురోహితుఁడును రాజసేవక వర్గములోనివాడే. అర్థశాస్త్రములోను, అశోకాదుల శాసనములలోను 'మంత్రి పురోహిత సేనాపతి యువరాజ దౌవారికాంతర్వంశిక...' నియోగులు. అట్లే రాజకార్య నిర్వాహకులలోని పదునెనిమిది తీర్థములలో పురోహితుఁడు రెండవవాడు. పైతెనుగుకవులలో తిక్కన మొదలుకొని మొన్నటి వఱకు రాజమంత్రులును, వారి బంధువర్గమువారే కవులుగా నుండిరి. వైదికులు వేదాధ్యయనాదులయందే నిలిచియుండిరి. నియోగి వైదికి భేదము అశోకుని కాలమునుండియు కలదేమో! ఇతని సహాధ్యాయి వాణస నారాయణభట్టు నియోగి యనుటకు సందియములేదు. కర్ణాటక బ్రాహ్మణుఁడు త్రైలోక్యమల్ల ఆహవమల్ల సోమేశ్వరుని అమాత్యుడు. సోమేశ్వరుని ప్రధానామాత్యుడు మధుసూదనయ్యయు వాణస యింటివాడే. అతడు 'బాణస వెగ్గడె' అనగా రాజుయొక్క బానసము (=మహానసము=) వంటయింటిమీది అధికారి. విషప్రయోగమునుండి రాజును రాజకుటుంబమును కాపాడు నధికారి. అసలా రోజులలో నియోగి వైదిక భేదము లేదని కొందఱు చెప్పినను కర్ణాటక శాసనములలో చాల ప్రాచీనకాలమునుండియు కలదు. బ్రాహ్మణనియోగులు యుద్ధవీరు లెందరో!

నన్నియశబ్దము కన్నడమువలె కానవచ్చు చున్నదని ప్రథమసంపుట పీఠికాకారు లభిప్రాయపడినారు. అది సమంజసము కాదని ద్వితీయ సంపుటమున దివాకర్లవారి యభిప్రాయము. తమిళసంఘం వాఙ్మయములో నొక నన్నన్ అనురాజు కనబడుచున్నాడు. ఇది ఆంధ్ర ద్రావిళ కర్ణాటక మలయాళములకు ఉమ్మడి శబ్దముగా నుండియుండును.

నన్నయ ఆరణ్యపర్వమును పూర్తిచేసెనో లేదో కాని రాజరాజనరేంద్రునికన్న ముందే గతించినాడు. క్రీ. శ. 1059 వఱకు శాసనములలో కనబడుచున్నాడు. రాజరాజు చివరితారీఖు 1061.

'సత్సభాంతర సరసీవనంబుల' నుండి సంశోధిత ముద్రణ పీఠికాకారులు చాల చరిత్రను లాగుటకు యత్నించినారు. 'ఆ రోజులలో గవుల గుణాగుణములను నిర్ణయించుటకును భాషా సారస్వతాభ్యుదయ మార్గమును సూచించుటకును గొన్ని విద్వత్పరిషత్తులు నెలకొల్పబడి యుండును. తమిళవాఙ్మయ మందలి సంఘములు.' ఇత్యాది. ఇది వట్టి ఊహ. అట్లుండిన తమిళదేశమున తర్వాత ఏమైపోయినవి? రాజుల యాస్థానములలో విద్వాంసు లుండెడివారు, పండిత సమావేశములు జరుగుచుండెడివి. కాని ఒక విధానము ననుసరించి, కాశ్మీర శారదా పీఠమువంటి పరీక్షక సంఘము లుండెడివనుటకు ఆధారము కానరాదు. ఇవి 'నెలకొల్పబడినవి'గా నుండవు.

నన్నయ వైదిక మతోద్ధరణము గావించెననుటయు అంతగా పాటింప దగదు. కుమారిలభట్టు శంకరులాదిగా జైనమతమును ఓడించి ప్రచారమొనర్చి

నను తమిళాంధ్ర కర్ణాటక రాజ్యములు క్రమముగా జైనమును వదలినవేగాని తటాలున మారలేదు. తమిళ దేశమున శైవ మతము విజృంభించి అప్పర్ సుందరర్ సంబంధర్ వీరికాలము జైనమును పెకలిందొలినది. విమలాదిత్యుడు జైనుడు. రాజరాజనరేంద్రుడు తల్లి ప్రభావముననను మాతామహుని ప్రభావము వలనను శైవుడాయెను. అట్లే కర్ణాటకమున జగదేకమల్ల జయసింహుడు క్రీ. శ. 1032 ప్రాంతమున శైవుడైనాడు. ఇతని కుమారుడే సోమేశ్వరుడు. వీరందఱు వీరశైవులుకారు. వీరికి బ్రాహ్మణ వైదిక మతద్వేషము లేదు. పైగా 'నన్నయ భట్టారకుడు వినుతులచే పరమశివుని మాటాడించె'నని ప్రబంధరత్నాకరమున పెదపాటి యెఱ్ఱాప్రెగడ వ్రాసియున్నాడు.

'ం శుచేగాంచి సాహిత్య విద్య ధగ్రిత్రి
 నిల్పినయట్టి పాణిని భజించి,
శ్లోకార్థమున జంద్రదజూటు మెప్పించి యి
 ష్టార్థము ల్గొన్న మల్హణు నుతించి,
గద్యంబుచెప్పి శంకరునిచే గరములు
 బ్రతిభతో బడసిన బాణుదలచి,
శతకంబు చెప్పి భాస్కరుని మెచ్చగజేసి
 యురుదేహుడైన మయూరు గొలిచి,
భవుని మెప్పించి కన్నులు బండిదెచ్చి
వనితకిచ్చిన కాళిదాసునకు మ్రొక్కి
హరుని వినుతులచే మాటలాడజేసి
నట్టి భట్టుని నన్నయభట్టు పొగడి'

నన్నయ యజ్ఞ మొనరించెనని యొక కథయు నున్నది.

'సారమతింగవీంద్రులు' పద్యమునుబట్టి మన పండితులును విమర్శకులును చాలపని చేసినారు. సంశోధిత ముద్రణములో 'ప్రసన్నకథాకవితార్థయుక్తిలో నారసి'అను పాఠము స్వీకరింపబడి పాఠాంతరముగా 'కలితా'అని 8 ప్రతులలోను, 'కవితార్థయుక్తితో' 29 ప్రతులలోను, వివిధార్థయుక్తి కొన్నిట, 'కథా కథితార్థ' కొన్నిట ఇట్లు ఏవేవో చూపినారుగాని ఈ పాఠమేల గ్రాహ్యమాయెనో ప్రథమ సంపుటముననే వివరించియుండిన బాగుండెడిది. ద్వితీయ సంపుటమున దివాకర్లవారు వివరించినారు. చదలువాడ దండిగుంట పండితులు ఈ పాఠమునే గ్రహించి 'నిర్మలములయిన కథలతోను కవిత్వముతోను అర్థముతోను కూడికను, లోన్=మనస్సునందు, ఆరసి=తెలిసి' అని అర్థము వ్రాసి, 'యుక్తితోన్—అను తృతీయాంతపాఠము ఆరసి యనుటకు గర్మము లేమింజేసి యసమంజసము. అట్లు అక్షర రమ్యతన్ అనునది ఆదరింపన్ అనుదానికిం గర్మముగా నున్నది. ఇటమాత్రము కర్మము నధ్యాహరింపవలయుననుట యుచితముకాదు' అని విశదీకరించినారు. మఱి ఇందలి ఇతరులెవ్వరు? కవీంద్రులు కానివారని అర్థమగుచున్నది. మా తాతగారు తమ తిక్కన సోమయాజి విజయమను నుపన్యాసమున ఇతరులనగా శాబ్దికాదులని వ్రాసినారు. వారు అక్షర రమ్యతను మెచ్చుకొనుటయనగా శబ్దౌచితి, వ్యాకరణాంశములుగా నుండవలెనుగదా. ఈ ముద్రణ సంపాదకులు తాము గ్రహించిన పాఠముల యౌచితినిగూర్చి అక్కడికక్కడనే వ్రాసియుండిన వీరి పరిశ్రమ సార్థకమై యుండెడిది.

తమ తిక్కనసోమయాజి విజయములో నన్నయ తిక్కన తారతమ్యమునుగూర్చి మా తాతగారిట్లు వ్రాసినారు: 'వీరిలో తారతమ్య మేర్పఱచుట సుకరము గాదు. నన్నయ పాణినీయముచే సాధ్యముగాక వ్యాకరణాంతరముచే సాధ్యమగు 'ముష్టాముష్టి' ప్రయోగముం గావించినాడు.

'భీమాసురవీరుల ము
ష్టాముష్టిరణచ్ఛటచ్ఛటాశబ్దం బు
ద్దామంబై తద్విపిన మ
హామృగపతులకు నతిభయావహమయ్యెన్'

పాణినీయము ప్రకారము 'ముష్టీముష్టి' అనియే యుండవలయును. 'ముష్టాముష్టి' బోపదేవకృత ముగ్ధబోధసాధ్యము..... ఇట్టి చిక్కులు తిక్కన భాగమునలేవు. ఇట్టివి నన్నయభాగమున ఇంకనుం గలవు. ఇందువలన నన్నయకు 'వాగనుశాసన' 'సకలభాషా వాగనుశాసన' బిరుదములు రూఢి కెక్కుచున్నవి... సీసపద్యములోని 'విపుల'శబ్దము 'సకల'శబ్దమునకు పర్యాయముగా నుండనోపు.' దీనింబట్టి చూడ నన్నయ ఆంధ్రవ్యాకరణమందేగాక సంస్కృతవ్యాకరణమందును

ప్రామాణికుడుగాన 'ఇతరులు' అక్షర రమ్యత నాదరించిరి.

మార్గ దేశి కవితలనుగుఱించి మన పండితుల వ్రాత బోధపడకయున్నది. 'మార్గ కవితా సంప్రదాయమునే యవలంబించినను ఆతని కవిత్వమున దేశి సంప్రదాయమునకు సంబంధించిన లక్షణములును కన్పించును'అని ఉపోద్ఘాతము. తెలుగు కవితలోనే రెండు పద్ధతులు కలవా? నన్నిచోడుడు మార్గ కవులనుగా కాళిదాసాదులను పేర్కొని తదితరులు దేశికవులని స్పష్టీకరించియున్నాడు. ఇది 'సురవరులకా'అను పద్యమున విశదము. బాణునితో మార్గ కవిస్తుతి నిలిపి 'మును మార్గ కవిత' పద్యమున దేశికవిత బుట్టించి తెనుంగనిలిపిరి...చాళుక్యరాజు...' అనుటచేత దేశికవిత యనగా తెలుగేయని నిర్వివాదము. సంస్కృతభూయిష్ఠత మార్గము, తెనుగెక్కువయైన దేశి యనుట ఎట్లో! నన్నయ దేశికవియే.

ఉపోద్ఘాతములో వీరెంతో విషయములను సమకూర్చి తమ పరిశ్రమను తెలిపినారు. వానికి ఇక కొంత శ్రమపడియుండిన ఈ క్రింది విషయములు కూడ దొరకి ఇంకను విషయము సమగ్రముగా నుండియుండును. భారతముద్రణమున గత శతాబ్దిలో విశేష శ్రద్ధవహించిన పండితులు శ్రీ పురాణము హయగ్రీవ శాస్త్రులవారు, వావిళ్ల రామస్వామి శాస్త్రులవారు, ఈ శతాబ్దమున టీక రచించిన చదలువాడ సుందర రామ శాస్త్రిగారు, దండిగుంట సూర్యనారాయణ శాస్త్రిగారు మున్నగువారు మాకు బంధువులు—పుదూరు ద్రావిడులు. చదలువాడ దండిగుంటవారి ప్రచురణలను ప్రశంసించిన ముట్నూరి ఆదినారాయణయ్యగారు మధురలో పనిచేసియుండినను మదరాసువారు, వెలనాటి వైదికులు, దండిగుంటవారి యింటి ప్రక్కన తండియార్పేటలోని మూడిండ్లును వారివే. వీరి మనుమడుగారే సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడు, తెలుగు చోళులమీద పరిశోధన సల్పిన కీ. శే. ముట్నూరి వెంకటరామయ్యగారు. శ్రీమాన్ నేలటూరి పార్థసారథి అయ్యంగారు నెల్లూరు రంగనాయకుల పేటలో నుండినవారు, వెంకటగిరి రాజాగారి కళాశాలకుచేరిన ఉన్నత పాఠశాలలో ఆంధ్ర పండితులుగా నుండిరి. వీరిది వెంకటగిరికాదు. వీరు గంగవరము వైష్ణవులు. వీరి బంధువు లనేకులు ఆ దినములలో వావిళ్లవారితో కలసి ఆంధ్రగ్రంథములను ముద్రించుచుండిరి. ఒకచోట వీరిది నెల్లూరనియు ఒకచోట వెంకటగిరియనియు దొర్లినది. నెల్లూరివారు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు సలహా సంఘమందున్నారే, ఇది ఎట్లు ?

ఇట్టి శ్లాఘ్య బృహత్ప్రయత్నములలో చిన్న చిన్న నెరసులు పాటింపదగినవికావుగాని ఇంతింత ధనము వెచ్చించి, ఎందరో పండితులు కలసి చర్చించి ముద్రించునప్పుడు ముద్రణము నిర్దుష్టముగా నుండుటయేగాక సకారణముగ, మరల శంకల కెడమీయని విధమున నుండగలదని పండితలోక మెదురుచూచుట సహజము. విషయము చక్కగ సమకూర్చు కొన్నారు గాని దానిని సమన్వయపరచు కొనుటలో గలిగిన లోపములను మరల పరిశీలించుట మంచిది. అముద్రిత గ్రంథ చింతామణిని పూర్తిగా ఉపయోగ పరచుకొన్నట్లు కానరాదు. అది చేయదగ్గది. చారిత్రక విషయములనుకూడ మరల పరిశోధింపవలెను. ఆంధ్ర ఛందోవ్యాకరణాది విషయములను తమిళ ఛందాదులతో పోల్చిచూచిన నూతనాంశములు వెలువడగలవు. నన్నయ ప్రామాణికత ఎంతవఱకో తేలగలదు. గ్రాంథిక ప్రయోగముల వాస్తవ స్వరూపము విశదము కాగలదు.

కాలనిర్ణయాదులనుగూర్చి వ్రాసినయెడల ఇది ఇంకను ఎంతో దీర్ఘసమీక్ష యగునుగాన ఆ చర్చ మఱియొకచోట చేయదగినది.

పండితరాయల వెటకారాలు

డా. మహీధర నళినీమోహన్

సాయంకాలం పెరటిదొడ్లో బొగడచెట్టుకి వేలాడ గట్టిన ఉయ్యాలమంచంమీద కూర్చుని జగన్నాథభట్టు రసగంగాధరాన్ని మరోసారి తిరగ వేస్తున్నాడు.

'విన్నారా?' అంది లవంగి దగ్గరసా వచ్చి.

తలఎత్తకుండానే 'ఏమిటి?' అన్నాడు జగన్నాథుడు.

'పండితరాజ బిరుదాన్ని చాలామందే తగిలించు కుంటున్నారట ఈ మధ్యని'

పండితరాయలు దస్త్రంమూసి 'నువ్వూ విన్నా వన్నమాట' అన్నాడు.

'ఆ బిరుదు పెట్టుకునే హక్కు వాళ్లకేముందో; ఎవరిచ్చారో?' అంది లవంగి ఆవేశంగా.

'కవిసార్వభౌములు, కవిసమ్రాట్టులు, పండిత రాజులూ ఊరికొకరు బయలుదేరుతున్నారు ఈ మధ్యని. బిరుదు ఒకరు ఇచ్చేదేమిటీ? తానే పెట్టు కుంటాడు. ఏం తప్పా?...అదిగో అల్లా చూడు'.

లవంగి గ్రీవాభంగాభిరామంగా చూసింది.

'ఏమిటీ?'

'ఆ పిచికని చూడు. మెడకింద నల్లగా ఉంది గమనించావా?'

'అయితే ఏమిటీ?' అన్నట్లు చూసింది లవంగి. జగన్నాథుని కళ్లు మిలమిలా మెరిశాయి.

'క్షీరసాగర మథనవేళ సముద్భవించిన హాలా హలం మూడులోకాలనూ దహించివేస్తూ ఉంటే, దాని దగ్గరకు వెళ్లగల మొనగాడే లేకపోతే, నేనున్నానని చెయ్యిజాపి, ఆ గరళాన్ని గడగడా తాగేసినవాడు మహే శ్వరుడు. అతణ్ణి నీలకంఠుడు అన్నారు.

భయంకరమైన తాచుపాములను అవలీలగా పడగమీద తన్ని ముక్కలు ముక్కలుగా చీల్చి, ఆప్యా యంగా భోజనం చేయగల పిట్ట నెమలి. దానినికూడా నీలకంఠమనే అన్నారు.

పెరటిదొడ్లో మొలిచిన గడ్డిపరకల మధ్య తిరుగులాడే చిల్లరపురుగుల గర్వాన్ని క్షణంలో హరించి వేయగల ఈ పిచిక కూడా నీలకంఠమే.'

'సెభాష్!' అంది లవంగి.

మాలినీ

గళిత గరళ కంఠః శంకరో నీలకంఠః
ప్రబలతర విషాశీ బర్హిణో నీలకంఠః
అజిర తృణ విసర్పత్కీట దర్పాపహారిన్
కలయసి కలవింక! త్వం చ భో నీలకంఠః.

చంపకమాల

గరళము మింగినట్టి తిగకన్నుల
దేవర నీలకంఠుడే
ఉరగకులమ్ము దున్మెడు మయూరము
సైతము నీలకంఠమే
చెరచెర గడ్డిలో తిరుగు చిల్లర
పుర్వుల గర్వమంతయున్
విరిచి, హతమ్మొనర్పగల పిచ్చుక!
నీవును నీలకంఠవే.

* * *

భట్టోజీ దీక్షితుని 'మనోరమ'ను ఖండిస్తూ 'మనోరమా కుచమర్దనం' వ్రాయడంలో పండిత రాయలు నిమగ్నమై ఉన్నాడు. ఆ నిరంతర పరిశ్రమలో అతడికి ఆకలిదప్పులు తెలియడం లేదు. పండిత సదస్సులకు పోవడం లేదు. సామాన్య పండితుల జోలికి అసలే పోవడం లేదు.

ఏమ్రోయ్! చిల్లరమల్లర పండితులూ! మీరు హాయిగా, స్వేచ్ఛగా, నిరాఘాటంగా వాగడానికీ విహరించడానికీ ఇదే సమయం. ఇప్పట్లో మీకు శృంగభంగం అవుతుందనే విచారం అక్కరలేదు. ఆ పని చేయగల ఏకైక సమర్థుడు అవతల మనోరమా కుచమర్దనంలో లీనమై ఉన్నాడు. అది పూర్తిఅయే వరకూ మీకు నిశ్చింతే.

ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకొని సామాన్యవన్యజంతువులకి పండితరాయలు వెటకారంగా సలహాలు ఇస్తున్నాడు.

ఓ దుప్పీ! కంగారుపడకు.

ఓ గవయమృగమా! భయపడకు

ఓ దున్నపోతా! స్వేచ్ఛగా విహరించు

ఓ పెద్దపులీ! క్షోభ పడకు.

ఓ ఎలుగుబంటీ! కొండకోనలవెంట హాయిగా తిరుగు.

సమస్తవనభూమినీ తన చెప్పుచేతలలో పెట్టుకున్న మృగసార్వభౌముడు అదిగో ఆ అడవిమూల తన పంజాదెబ్బకి పగిలిన మత్తేభకుంభస్థలంలోనుంచి చెల్లాచెదురుగా రాలిపడిన ముత్యాలరాసులను చూచుకుని మురుసుకుంటున్నాడు. ఇప్పట్లో మీకు వచ్చే ప్రమాదం ఏమీలేదు.

స్రగ్ధరా

ఏణాలంసంభ్రమేణ త్యజ గవయ! భయం,
స్మైరిభ! స్వైర మా స్వ
క్షోభం మాగాస్తరక్షో! విహరగిరి భువి
స్వేచ్ఛయైవాచ్ఛభల్ల!
పారీంద్రః పారదృశ్వా నిఖిల వనభువః
కేవలం మోదతేఽసౌ
మాద్యత్కుంభీంద్రకుంభస్థలవిపుల తటీ
ముక్త ముక్తాకలాపైః.

సగ్ధర

కంగారున్ మాను దుప్పీ! కలగకు గవయ
గ్రామణీ! దున్నపోతా!
శృంగంబుల్ దువ్వు స్వేచ్ఛన్, చెలగవె యెలుగా!
చింత నీకేల వ్యాఘ్రీ!
పొంగారన్ గర్వరేఖల్ మురియ దొడగె నా
పొంత సింగంబు తన్మా
తంగ ప్రోత్తుంగ కుంభస్థల విపుల తటీ
త్యక్త ముక్తాఫలాళిన్.

* * *

ఏనుగు గున్న ఒకటి భయం భక్తీ లేకుండా సింహాలు కాపురంఉండే గిరిగుహాప్రాంతభూములలో తిరుగుతోంది. దానిని పండితరాయలు వెటకారంగా మందలిస్తున్నాడు.

ఒరేయ్! ఏనుగుగున్నా! పొగరుగా ఈ కొండ గుహ ప్రాంతాల ఎప్పుడూ తిరగకురా. పాలు కుడుచుకుని సింహప్పిల్ల బబ్బుంది. నీ అలికిడికి అది నిద్ర లేచిందో ఈ భూమిమీద మగ ఏనుగులు మిగలవు సుమా జాగ్రత్త!

పాలుతాగే వయసులోఉన్న చిన్నారి సింహప్పిల్లకి కూడా అంతటి శౌర్యోద్రేకం ఉన్నదనీ, దానికికూడా ఆడ ఏనుగుల జోలికి పోకూడదనే ఉదారభావం ఉన్నదనీ చెప్పడం కవి ఉద్దేశం.

అప్పయ్య దీక్షితుల శిష్యుడొకడు పండితరాయల 'చిత్రమీమాంసా ఖండనా'న్ని ఖండిద్దామని వచ్చాడు ఒకనాడు. ఈ పాటి పనికి తానే స్వయంగా పూనుకుని వాదించవలసిన పనిలేదనీ, ప్రతికక్షుల నోళ్లు మూయించడానికి తన మనుమడైన మహాదేవభట్టు అయినా చాలుననీ చెప్పడానికి జగన్నాథుడు ఈ కల్పన చేశాడు.

మంజుభాషిణీ

గిరిగహ్వరేషు గురుగర్వ గుంఫితో
గజరాజపోత! న కదాపి సంచరేః
యది బుధ్యతే హరిశిశు స్తనంధయో
భవితా కరేణుపరిశేషితా మహీ

మంజుభాషిణి

గిరి గహ్వరస్థలుల గిరగా ఒరే!
కరిరాజపోత! తిరుగాడ బోకురా!

హరిశాబ ముల్కిపడి ఆవులించెనా
ధర ఆడయేన్నులకె తావగుంజువిూ

* * *

జగన్నాథుడు నూనూగు మీసాల ప్రాయంలో ఉన్నాడు. తండ్రి పేరమభట్టుదగ్గర ఇంకా మహాభాష్యం చదువుతున్నాడు. అప్పటికే ధారాళమైన ఆశువు వశ్యమైంది. అపూర్వమైన వాదనా పటిమ అలవడింది. అప్పటికే ఆ చుట్టుపక్కల ఊళ్లల్లోని ఓపాటి సాహిత్యగాళ్లు అతడిముందర ఏనాడో బలాదూరు అయిపోయారు. అంతవరకూ ఫరవాలేదు అని సరిపెట్టుకోవచ్చుగానీ, ఇటీవల బొత్తిగా పెద్దతలకాయలమీదికికూడా ధూకుడుగా కత్తిదూయడం మొదలు పెట్టేడు. దీనిని ఎల్లా సహించడం? ఎవరితో చెప్పుకోడం?

ఈ విషయాన్ని బొత్తిగా భయం భక్తీలేని కేసరి యువకుని ఔద్ధత్యంతో పోలుస్తున్నాడు. ఆడలేళ్ల గుంపులమీద దూకి సింహకిశోరం ఇష్టం వచ్చినట్లు వీరవిహారం చేసుకోనీ. అందులో తప్పేమీ లేదు. అది అందరూ అవునని అంగీకరించినదే. కాని, ఇటీవల హఠాత్తుగా మత్తేభ వధువుల జోలికి కూడా పోయి, నఖదంతక్షతాదులు చేయడం మొదలుపెట్టేడు కదా, వీడి ఈ అవినయాన్ని గురించి ఎవరికి విజ్ఞప్తి చేసుకోగలరు పాపం!

శిఖరిణి

కురంగీణాం యూథం
నిభృత మిద మంగీకృత మయం
నిరాతంకో యన్నిర్దయ
హృదయ భావోఽర్దయతు తత్
నివేద్యో వా కస్మి న్నయ మవినయః
కేసరియువా
హఠాన్మత్తేభానాం యువతిషు
విధత్తే నఖపదమ్.

మత్తేభవిక్రీడితం

కెరలన్ వచ్చు నిరంకుశమ్ముగ,
కురంగీయూథమున్ హింసకున్
గురిచేయందగు నడ్డువెట్టరెవరున్—
కుంభీంద్రకుంభద్వయా
గురుగండస్థలులన్ నఖక్షతములన్
క్షోభింపగాజేయు కే
సరి ధూర్తాగ్రణి గూర్చి యెవ్వరికి
విజ్ఞప్తుల్ సమర్పించుటో ?

ఇందులో కురంగీణాం యూథం అని ఆడవి లేళ్లనీ, మత్తేభానాం యువతిషు అని ఆడఏనుగులనీ పనిగట్టుకుని సూచించాడు పండితరాయలు. సింహప్పిల్ల పొగరువయస్సులో ఉంది. దానికి దృష్టి ఎంతసేపూ ఆడవాళ్లమీద. కు + రంగీ=చెడునడత గల స్త్రీ. ఆ సింహం తన పరువపు గర్వాన్ని ప్రదర్శించడానికి కురంగశ్రేణులు కావలసినన్ని ఉన్నాయి. వాళ్లని ఏం చేసుకున్నా కాదనే వాళ్లు ఉండరు. కాని పెద్దఇంటి పడుచుల జోలికి పోవడం అక్రమం. 'యువతిషు' అని వ్రాయడంలో ప్రత్యేకత ఉంది. 'యువతీ' అంటే యౌవనంకల స్త్రీ అనీ, 'యువతిః' అంటే యువకుడుకల స్త్రీ (మగనాలి) అనీ అర్థాలు. కేవలం యౌవనవతిని పట్టుకుంటే మరీ అంతగా తప్పుపట్టవలసిన పని లేకపోవును. అతడు నఖప్రయోగం చేసిన ఆడఏనుగులకు మొగుళ్లు ఉన్నారు. అది మరింత ధూర్తలక్షణం. దీనిని 'యువతులు' అని అనువదిస్తే మూలంలోని సొగసు తెలుగులోకి రాదు. ఇక్కడ 'నఖపదం' అనడంలో ఔచిత్యం ఉంది. సింహం గోళ్లని ఆయుధంగా ఉపయోగించడం మామూలే. కాని, నఖక్షతములు శృంగార సూచకాలు.

* * *

జగన్నాథభట్టు తంజాపుర సంస్థానంలో తన పాండిత్య ప్రకర్షనీ, ఆశుకవితా ప్రగల్భతనీ ప్రదర్శించి, రాజునూ సదస్యులనూ మెప్పించాలని వచ్చాడు. అక్కడ తనకి నిలవనీడ దొరుకుతుందనీ, తన సాహిత్య వ్యవసాయానికి అనువైన క్షేత్రం లభించగలదనీ ఆశపడ్డాడు. కానీ, ఆ సంస్థానంలో ఇటువంటి శషబిషలు ఏవీ పనికిరావని త్వరలోనే తెలిసిపోయింది.

గురిగింజలు, గాజు పూసలు, పక్షి ఈకలు

తలలో అలంకరించుకొని మురుసుకునే కొండజాతుల వాళ్లు నివసించే గూడెం ఇది. ఇక్కడ మంచి ముత్యాలు అమ్మేవాడూ ఉండడు, ముత్యాల విలువ తెలిసినవాడూ ఉండడు.

ఆర్యా

గుంజా రంజిత కబరీ
శబరీ తతిభి ర్గరీయసీ నగరీ
ఇహ నహి ముక్తావణిజః
కోఽపి న ముక్తాగుణజ్ఞోఽపి.

తేటగీతి

సిగలగురిగింజపేరులు చేర్చిమురియు
కోయవాండ్రు వసించెడు గూడెమిద్ది
మంచిముత్యాల వర్తకుల్ మసల రిచట
లేరు ముక్తాగుణజ్ఞులు లెక్కకైన

* * *

ఏమయ్యోయ్! కంసాలీ! కుండలాలు చేయ డంలో నువ్వు మొనగాడివే కావచ్చు—కాని, నీ నేర్పు ఈ ఊళ్లో వ్యర్థం. ఏమంటే ఇక్కడ చెవులు కుట్టించుకున్నవాడేలేడుకదా! ఊరంతా దిగంబరులే అయినప్పుడు చాకలి ఎంతనేర్పరి అయితేమాత్రం ఏం లాభం?

ఆర్యా

సాధో! కుండలఘటనా
పరిశ్రమా దల మవిద్ధకర్ణాపూః
వసతి దిగంబరనగరే
రజక శ్చతురోఽపి కిం కురుతే?

తేటగీతి

వలదు కంసాలి కుండలమ్ముల తయారి
చెవులుకుట్టిన వార లీ సీమలేరు
పట్టణంబెల్ల దిసిమొలవారెయున్న
ఎంతఘనుడైన చాకివాడేమిచేయు?

* * *

ఓ కోకిలా! నీ కోమల కుహూకారం కట్టి పెట్టు. ఇక్కడి పామరులు నీ పంచమస్వరం విన్నా రంటే 'అబ్బబ్బ! చెవులు పగిలిపోతున్నాయి, ఈపాడు కూతలు కూస్తున్నదెవరూ? పట్టుకోండి, కొట్టండి, చంపండి'అని దుడ్డుకర్రలు పట్టుకువస్తారు. అనవ సరంగా ఎందుకు చస్తావుగానీ నా మాటవిని నోరు మూసుక్కూర్చో.

వసంత తిలక

కిం కోమలైః కలరవైః పిక! తిష్ఠ తూష్ణీ
మే తేతు పామరనరాః స్వరవాకలయ్య
కో వారయే త్యయ మయే నికటే కటూని
రే వధ్యతా మితి వదంతి గృహీతదండాః.

మత్తకోకిల

కోమలాద్భుత మంజులమ్మగు కూత చాలిక మానవే
పామరుల్ విని నీ కుహూకృతి వల్లమాలిన బాధతో
ఏమిరా యిట గోలసేయున దెవ్వ డీతడు చంపివే
తాము రమ్మని దుడ్డుకర్రల దాల్చివత్తురు కోకిలా!

* *

ఏ దేశంలో చందనవృక్షాలనూ, మామిళ్లనూ, సంపెంగలనూ తెగ నరికించి కరివేరపుమొక్కలనీ, నేపాళపు బడితెలనీ రక్షిస్తూ ఉంటారో; హంసలను, నెమళ్లను, కోకిలలను హింసించి, కాకులను బహు ప్రీతిగా పెంచుతూ ఉంటారో; ఏనుగులని గాడిదలని సమంగా క్రయ విక్రయాలు చేస్తారో; పత్తినీ పచ్చ కర్పూరాన్నీ ఒకే తక్కెడలో పెట్టి సరితూచుతూ ఉంటారో ఆ దేశానికి ఒక్క నమస్కారంఅంటూ ఒక దేశాన్ని పండితరాయలు వెటకారం చేస్తాడు.

శార్దూల విక్రీడితం

ఛేదశ్చందన చూత చంపకవనే రక్షా కరీరద్రుమే
హింసా హంస మయూర కోకిల గణే కాకేచ బహ్వాదరః
మాతంగాత్ఖర విక్రయః సమతులా కర్పూర కార్పాసయో
రేషాయత్ర విచారణా గుణగణే దేశాయ తస్మైనమః.

మత్తేభవిక్రీడితం

కరివేరంబుల బెంప చందన
వనిన్ గాల్పించి, కాకంబు పం

జరమందుంచి మయూరకీరపిక
హంస శ్రేణి హింసించుచున్
కరులన్ గాడిదకమ్మి,
ఒక్క తులలో కర్పూరమున్ దూదియున్
సరితూపించెదు రాజ్యలక్ష్మికి
నమస్కారంబు గావించెదన్.

* * *

కాశ్మీరదేశంనుంచి కాశీవెడుతూ ఒక విద్వత్కవి ఒకనాడు షాజహాన్ చక్రవర్తి దర్బారుకి వచ్చాడు. ఆ సమయంలో దర్బారులోని పండితమ్మన్యుడొకడు తానూ గొప్పవిద్వాంసుడనే అని తెలియబరచే ఉబలాటంతో అవాకులూ చవాకులూ వాగడం మొదలు పెట్టేడు. అతగాడి ప్రేలాపన విని ఆస్థానంలోని మిగిలిన జనాభాకూడా ఇంతింతమాత్రపు పండితులే కాబోలునని కొత్తగావచ్చిన కాశ్మీర పండితుడు అపోహపడి, వారణాసిలో టమటమా వేసేస్తాడేమోనని పండితరాయలు కంగారుపడ్డాడు. అతడిని వారించే ఉద్దేశంతో అన్యాపదేశంగా ఒక కల్పన చేశాడు.

ఓ కాకీ! ఈ రాజహంస మరికాస్త సేపటిలో దేవవాహినీపయస్సులలో క్రీడించడానికి స్వర్గలోకానికి వెళ్ళిపోతుంది. అది దూరంగా వెళ్ళిపోయేదాకా నువ్వు కాస్త నోరుమూసుకుని కూర్చుందూ, నీకు వెయ్యి న్నొక్కదండాలు. లేకపోతే, నీ కూతవిని భూలోకంలోని పక్షులన్నీ ఇదే మాదిరిగా కర్ణకఠోరంగా కూస్తాయని హంసవెళ్ళి దేవలోకం అంతటా చాటేస్తుంది.

వసంత తిలక

త్రోటీపుటం కరట! కుడ్మలయాథ తాత!
యావ త్ప్రతివ్రజతి నాక మయం మరాళః
నోచే దమంగళ కఠోర రవా విహంగాః
సర్వే భువీతి నిజసంసది శంసితానః

వసంత తిలక

ఆ రాజహంస త్రిదశాలయమేగు దాకన్
నోరెత్తకో కరట! నూరు సలాములయ్యా!
స్వారాజ్యవీధి నదిచాటును పక్షులెల్లన్
ఘోరాతిఘోరముగ కూయును ధ్వానిసంచున్.

* * *

ఓ కాకులారా! కొంగలారా! కప్పలారా! తోడేళ్ళ్లారా! మీకందరికీ వంగి నమస్కరిస్తున్నాను. చేతులు జోడించి ఒక ప్రార్థన చేస్తున్నాను. అది ఏమిటంటారా? అదిగో ఆ తియ్యమామిడిచెట్టు తాలూకు ఎర్రనిచిగుళ్ళు తిని వగరెక్కిన గొంతుకతో గండుకోయిల పంచమ రాగాలాపన ప్రారంభించింది. జను లందరూ దాని కూతకోసం చెవులు దోరపెట్టుకుని ఎదురుచూస్తున్నారు. తమరు దయచేసి గోలచేయకుండా ఊరుకోండి, అదే పదివేలు.

అల్పులముందర అతివినయం చూపించడంలోనూ, వాళ్ళ చేయగల సాయం నోరుమూసుకోవడం మాత్రమే అనడంలోనూ వెటకారంతో కూడిన హాస్యం ఉంది.

ఏమ్రోయ్! ఊరకవులూ! పిల్లకాకులూ! మీకో దండం, కాస్త వాగుడు కట్టిపెడతారా? పశువూ, పశుపతీ తప్ప తక్కినవారందరూ పారవశ్యంతో శిరఃకంపంచేసేటట్లు కవిత్వం చెప్తున్నాడు పండితరాయలు. మమ్మల్ని కాస్త విననిస్తారా? అని ధ్వని.

ఉపజాతి

కాకావృకాః కోకబకాశ్చభేకాః!
ప్రణమ్య యుష్మానిదమేవయాచే
కోలాహలం మా కురుత క్షమధ్వం
పుంస్కోకిలః కూజతి మంజురావమ్.

ఆటవెలది

వందనమ్ముచేసి ప్రార్థించెదను మిమ్ము
కాక భేక వృక బకంబు లార!
కంఠమెత్తి పికము కర్ణపేయమ్ముగా
కూయసాగె—గోలసేయవలదు.

* * *

'నరసింహంగారి ఇంట్లో గూటిలోఉన్న పుస్తకాలు ఎత్తుకుపోయారట విన్నారా?' అంది కామేశ్వరి తాంబూలం అందిస్తూ.

'ఎవరూ?' అన్నాడు జగన్నాధుడు భార్యకేసి చూసి.

'తిమ్మన అని చెప్పుగుంటున్నారు'

'తిమ్మన్నా? ఆశ్చర్యంగా ఉందే. నమ్మ లేకుండా ఉన్నాను.'

'ఏవిూ! వాడివి చిన్నప్పటినుంచీ అటువంటి బుద్ధు లేకదా?'

'వాడి హస్తలాఘవాన్ని నేను శంకించడం లేదు. తిమ్మనకీ పుస్తకాలకీ అమడదూరంకదా. వాడు ఈ పని ఎందుకు చేసిఉంటాడు అని. ఏ బిందో తప్పేలాయో ఎత్తుకు పోయాడంటే ఆశ్చర్యం కించిత్తూ ఉండకపోను.'

అంతలో గుడిపక్కపుంతలో గాడిద ఒకటి శ్రవణపేయంగా ఓండ్రపెట్టింది.

'ఇతరుల ద్రాక్షపళ్లు గాడిద కలియబడి తినే సిందని వింటే—అందువల్ల మనకివచ్చే నష్టం ఏవిూ లేకపోయినా—గాడిదేమిటీ, ద్రాక్షపళ్లజోలికి పోవడ మేమిటీ—బొత్తిగా అసమంజసంగా ఉందే అని నా మనస్సు కలతబడుతోంది.'

ఆర్యా

యద్యపి కానో హానిః
పరకీయాం చరతి రాసభే ద్రాక్షామ్
అసమంజస మితి మత్వా
తథాపి ఖలు ఖిద్యతే చేతః

ఆటవెలది

పరుల ద్రాక్షపండ్లు ఖరము మేసినదన్న
హానిలేదు మనకు దానివల్ల
అయినగాని యిద్ది అసమంజసంబంచు
తలచి నా మనంబు కలతబారె.

*　　*　　*

'భోగయ్య చిత్తుగా తాగి, కనిపించినవాళ్లనల్లా తిడుతున్నాడు. చెరువునుంచి నీళ్లు తెస్తూంటే తల్లినే తిడుతూ కనిపించాడు. నాకు భయంవేసి మరోదారి వెంట వచ్చేశాను గబగబా' అన్నది కొడుకుతో మహాలక్ష్మి బిందె దింపుకుంటూ.

'ఆ బ్రహ్మముండాకొడుకు వాడి నొసట అటు వంటి వంకర టింకర రాత రాశాడు. జోగయ్య కారుకూతలు కూశాడంటే అది వాడి తప్పా ? పాపం!' అన్నాడు జగన్నాథుడు.

తియ్యమామిడి చెట్లమీద కోకిలలతో సహ వాసం చేస్తూ ఉండమని బ్రహ్మ నీ నొసట వ్రాయలేదు. కాకీ! నీ చిత్తంవచ్చినట్లు కారుకూతలు కూసుకో. ఆ దోషం బ్రహ్మది అవుతుందేకాని నీదికాదు.

కాలభారిణి

విధిరేవ విశేష గర్హణీయః
కరట! త్వం రట కస్తవాపరాధః
సహకారతరౌ చకార కిం తే
సహవాసం సరణేన కోకిలేన.

తేటగీతి

గున్నమామిడి చెట్లపై కోకిలముల
గలసి నివసించు సౌభాగ్య గరిమనీని
ధాతదేకాని యీ తప్పు తమదికాదు
వాయసమ! కారుకూతల గూయవమ్మ!

*　　*　　*

పెరటిదొడ్లో మొన్నటి గాలివానకి కూలిపోయిన వెలగ చెట్టుని మహాదేవభట్టు గొడ్డలితో నరుకు తున్నాడు. కట్టెలు మోపుగాకట్టి ఇంట్లోకి మోసుకు రావడానికి బుజానికి ఎత్తుకున్నాడు జగన్నాథుడు.

'తాతయ్యా! అంతబరువు ఎత్తకండి. నే నున్నానుగా, మీ కెందుకాశ్రమ?' అని వారించ బోయాడు మహాదేవుడు.

పండితరాయల మనస్సులో ఏవేవో పాత జ్ఞాప కాలు కదలాడేయి.

'నేను చేసిన పాపాలకి నాకీ శిక్ష పడాల్సిందే లేరా అబ్బీ!' అన్నాడు నవ్వుతూ.

మహాదేవుడు అయోమయంగా చూశాడు,

'నేను చిన్నప్పుడు ఎటువంటి దారుణ పాతకాలు చేశానో తెలుసా? నానా దేశాలూ తిరిగి, అడ్డమైన రాజుల్నీ పట్టుకుని, నువ్వు ఇంద్రుడివి, చంద్రుడివి, సాక్షాత్తూ హరివి, హరుడివి, బ్రహ్మవి, సింగినాదానివి, జీలకర్రవి అంటూ తోచినట్లల్లా పొగిడేశాను. అటువంటి అబద్ధాలు చెప్పిన పాపానికి ఈ కట్టెమోపులు మోసేశిక్ష ఏమంత ఎక్కువకాదు లేరా!' అని గొంతు సవరించుకున్నాడు జగన్నాథుడు.

'ఆగు తాతయ్యా! గంటం ఆకులూ తీసుకురానీ' అని గొడ్డలి వదిలి, లోపలకి పరుగెత్తేడు మహాదేవుడు.

వసంత తిలక

ఇంద్రోయమో౽సి వరుణో౽సి హుతాశనో౽సి
బ్రహ్మా హరో హరి రసీ త్యసకృద్యదుక్తిః
భూపాల మౌళిమణి రంజిత పాదపీఠ!
తస్యానృతస్యఫల మింధన ముద్వహామి

మత్తేభ విక్రీడితం

స్మరుడంచున్ హరియంచు నింద్రుడనుచున్ చంద్రుండు సాక్షాత్తు త
ద్గిరిశుండంచును బ్రహ్మదేవుడనుచున్ కీర్తించితిన్ మున్ను నిన్
పరరాణ్మస్తక రత్నరంజిత పదాబ్జా! ఆ అబద్ధాల క
బ్బురపున్ సత్ఫలమబ్బె—కట్టియల మోపుల్ మోయుచున్నా నిదే.

* * *

మహాదేవభట్టు ధూకుడుగా ఇంట్లో అడుగు పెట్టేడు. శిఖ విడిపోయిఉంది. కళ్లు జేవురించి ఉన్నాయి. పెదవులు ఇంకా అదురుతున్నాయి.

మనవడి అవతారంచూసి జగన్నాథుడు కంగారు పడ్డాడు.

'ఏమైందిరా? ఏమిటా హడావిడి?'

'వాడు మళ్లీ నోరెత్తకుండా చేశానులెండి' అన్నాడు మహాదేవుడు వగరుస్తూ.

'వా డెవడూ?'

'అదే ఆ పరబ్రహ్మ శాస్త్రిగాడు. ఊచిపుచ్చుకుని లెంపకాయ కొట్టేను. అనుష్టుప్పు తప్పుల్లేకుండా రాయలేడు తానో గొప్ప కవినన్నట్లు మాట్లాడుతున్నాడు వెధవ ఏకదేశాన్వయాలూ వీడూనూ.'

'అనుకోనీ నీదేం పోయిందీ?'

'కేవలం అంతే అంటే నేను చెయ్యిచేసుకోవలసిన పనేలేదు. తానట అపరపండితరాయలట.'

జగన్నాథుడికి నవ్వొచ్చింది.

'మూడున్నర గ్రామాలకి ప్రభువు అయిన ఓ అనామకుడి దగ్గర కొలువుచేసి, ఓ చిన్నమాన్యం సంపాదించుకున్న సేవకుడు తాను కూడా భూపతినే అనుకుంటున్నాడు. వాడి కొడుకుకి అహర్నిశలూ రాజపదం మీదనే మక్కువ. ఓసిగ్గా! నీవు నిలవ నీడ లేకుండా పోయావు కాదుటే!'

వసంత తిలక

యః కుంతపాణిరిహభూప ఇతిప్రసిద్ధో
భూఖండమాత్ర విభవః పరసేవకశ్చ
తస్యాత్మజః సతతమిచ్ఛతి రాజశబ్దం
వ్రీడే! జగజ్జనని! హంత! నిరాశ్రయాసి.

వసంత తిలక

కుంతమ్ము కేలగొని కొల్చెడు తొత్తు మాన్యం
బింతంతయున్న ధరణీంద్రుడనంచు నిక్కున్
స్వాంతాన రాజపదమాతని పుత్రకుం డ
శ్రాంతమ్ము గోరును—నిరాశ్రయవైతి సిగ్గా!

* * *

పక్కఇంటిలోనుంచి ధమ్మూధిమ్మూమని పిడిగుద్దుల చప్పుడు, వాటివెంట అణిచిపెట్టుగుంటున్న ఏడుపూ వినవచ్చాయి. మరి కాస్తసేపటిలో ఆ ఇంట్లోనుంచి ఆడమనిషిని బయటికిఈడ్చి, తలుపు భళ్లున వేసుకున్నాడు ఇంటియజమాని.

ఆ కొంపలో ఇటువంటి సంఘటన జరగడం ఇదే మొదటిసారికాదు. వారంపదిరోజులకోసారి దేహశుద్ధీ, ఏడుపులూ, తిరిగి కలుసుకోవడాలూ మామూలే,

జగన్నాథుడు లోగడ రెండుమూడుసార్లు ఆ పశువుకి చెప్పిచూశాడుకానీ లాభంలేకపోయింది. పాపం! తన్నినా, తిట్టినా, చంపినా ఆ ఇల్లాలికి ఆ మొగుడే దిక్కు. వాడిని ఆశ్రయించవలసిందే.

ఓ మేఘుడా! గొంతుఎండిపోయిన ఈ చాతకిని భయంకరమైన ఉరుములతో కసురుకో నీ ఇష్టం. మహాప్రభంజనం వీయించి గెంటిపారవెయ్యి నీ చిత్తం. వడగళ్ళు విసిరి ఒళ్లు హూనంచేసెయ్యి నీ దయ. నువ్వుతప్ప వేరే ఆధారంలేని దిక్కులేనిపక్షి ఇది. నువ్వు దయదలిచి విదల్చే చినుకులతో గొంతు తడుపుకుని ఏదోవిధంగా బతుకువెళ్లబుచ్చుతున్న ఈ నిర్భాగ్యురాలు ఎక్కడికిపోతుంది? నీ ఇష్టంవచ్చినట్లు కానియ్యి.

వసంత తిలక

వాతైర్విధూనయ విభీషయ భీమనాదైః
సంచూర్ణ యత్వమథవా కరకాభిఘాతైః
త్వద్వారిబిందుపరిపోషిత జీవితస్య
నాన్యాగతి ర్భవతి వారిద! చాతకస్య.

మత్తేభ విక్రీడితం

పెనుగాలిన్ పడగెంటువమా!
ఉరుములన్ భీతిల్లగా జేయువమా!
వెనువెంటన్ వడగళ్లమోది తనువున్
విచ్ఛిన్నముం జేయువమా!
ఘనుడా! నీవు విదల్చు నీరములనే
కాంక్షించి యేదో విధిన్
దినముల్ పుచ్చెడు వానకోయిలలకున్
దిక్కేది వేరే యికన్?

* * *

సహస్రబ్రాహ్మణ్యానికి భూరి సంతర్పణ జరుగుతోంది. వద్దు వద్దు అంటూ విస్తరికి రెండు చేతులూ అడ్డుపెడుతున్నా వినకుండా విస్తట్లో పిండివంటలు గుమ్మరించుకుంటూ పోతున్నారు వడ్డనగాళ్లు. పందిళ్లకి అవతల నడ్డికి అంటుకున్న డొక్కలతో ఎండలో పడిగాపులు పడుతున్న ముష్టివాళ్ల మీద గావుకేకలు వేస్తున్నారు.

భోజనం చేస్తున్న పండితరాయల మనస్సు కలగిపోయింది.

ఏమయ్యా! మేఘుడా! పులగంలోకి మళ్ళీ పప్పుదేనికయ్యా! ఆ సరస్సులు అన్నీ పుష్కలంగా నీటితో నిండి ఉన్నాయికదా, వాటిలోనే మళ్లీ మళ్లీ వర్షిస్తావుకానీ, గొంతుక ఎండిపోయి కళ్లు తిరిగి పడిపోబోతున్న ఆ చాంతకపృకుల నోళ్లల్లో నాలుగు చినుకులు రాల్చవుకదా! నీ దాతృత్వం మెచ్చదగ్గది సుమా!

ఆర్యా

జలధర! భవతశ్చరితం
కిమిదం పూర్ణేఒపి పూరయసి
చిరయాచక సారంగేఒ
పరిమిత తృష్ణే న శీకరం కిరసి.

కందం

నిండినవానినె మరిమరి
నిండించెద వొక్కచుక్కనీయవుకాదా
ఎండినగొంతుల చాతక
తండమ్ముల కెంత గొప్పదాతవు జలదా!

* * *

ఓ మేఘుడా! నీ శబ్దమాధుర్యం అందరికీ తెలిసినదే. (ఉరుములు కఠోరంగా ఉంటాయి.)

నీ మిత్రానుకూల్యత్వం కూడా విదితమే. (మిత్రుడుఅంటే సూర్యుడు, స్నేహితుడు అని రెండు అర్థాలు. మబ్బులుపడితే సూర్యుడు మూసుకుపోతాడు.)

నీ ప్రాబల్యకాలంలో కోయగూడెములకు మంచి రక్షణ ఏర్పడుతుంది. (వర్షాకాలంలో బీదలైన కొండవాళ్ళ చుట్టుగుడిసెలు నీళ్లునిలిచి పాడవుతాయి.)

నీవు ఐశ్వర్యంతో విరాజిల్లే రోజులే మాకు సుదినాలు. (మబ్బులుపట్టిన రోజును దుర్దినం అంటారు.)

తామరతూడులుతినే హంసలు నీ సౌజన్యాన్ని చాటడంలేదా? (హంసలికి మేఘదర్శనం కిట్టదు,

వర్షాకాలం రాగానే హంసలు దూరదేశాలకు తరలి వెళ్లిపోతాయి. హంస అంటే యోగీశ్వరుడని మరో అర్థం. కందమూలములు తినే యోగులు సహితం నీ దయవల్ల దేశాంతరగతులైపోతున్నారని వెటకారం.)

దుర్మార్గుడైన ప్రభువును ఉద్దేశించి చేసిన స్తుతి నింద ఇది.

శార్దూల విక్రీడితం

జ్ఞాతా త్వన్మృదుశబ్దతా సువిదితం
మిత్రానుకూల్యంచ తే
సంత్రాతాః శబరాశ్రయాశ్చ
బహవః ప్రాబల్యకాలే తవ
త్వత్సంపత్తిఘనం దినంహి సుదినం
పాథోద! కిం బ్రూమహే
సౌజన్యం ప్రకటీకృతం హి
భవతో హంసైర్మృణాళాశనైః

మత్తేభ విక్రీడితం

తెలిసెన్ నీ మృదుశబ్దతల్,
తెలిసె త్వన్మిత్రానుకూల్యత్వమున్
బలిసెన్ రక్షణ బీదకొంపలకు
నీ ప్రాబల్యకాలమ్మునన్
జలదా! పండుగ నింగి నీ మహిమచే
సంఛన్నమైనప్పుడే
జలజంబుల్ తిను రాజహంసములు
నీ సౌజన్యముం జాటవో?

*　　*　　*

నాలుగుదారులమొగలో ఒక మహావృక్షం పెరిగింది. దాని చల్లని నీడలో విశ్రమించి, అమృతోపమానములైన దానిపళ్లు కడుపునిండా మెక్కి, బుద్ధిహీనులైన బాటసారులు కొందరు ఆ చెట్టు కొమ్మలువంచి, విరిచిపోవడాన్ని చూసిన పండితరాయల గుండె భగ్గుమంది. ఆ దుర్మార్గులమీద కలిగిన తనకోపాన్ని ఆ చెట్టుమీదనే ప్రకటిస్తున్నాడు.

ఓ సద్వృక్షమా! నలుగురూ నడిచివెళ్లే దారిలో ఎందుకు పుట్టేవు? పుడితే పుట్టేవు; ఇంత చల్లని దట్టమైన నీడ ఎందుకు ఇస్తున్నావు? ఇంత మధురమైన పళ్లు ఎందుకు కాస్తున్నావు? ఇటువంటి బుద్ధితక్కువ పనులు చేసినందుకు దుర్మార్గులైన బాటసారులు నీ శిఖలువంచి, నీ శాఖలు విరిచి, నీ పళ్లు రాలగొటేరంటే కొట్టరుమరీ, ఫలితం అనుభవించు; తప్పదుమరి.

సజ్జనుడివల్ల ఉపకారాలుపొంది, అతడి వెన్నునే పొడిచే దురాత్ములమీద తనకోపం ప్రకటించే అవకాశం లేక ఆ మంచివాడినే తిడుతున్నట్లు కనిపించే నిందాస్తుతి ఇది.

శార్దూల విక్రీడితం

కింజాతోఽసి చతుష్పథేషు
నతరం ఘన్నోఽసి కిం ఛాయయా
ఛన్నశ్చే త్ఫలితోఽసి కిం ఫలభరైః
పూర్ణోఽసి కిం సర్వదా
హే సద్వృక్ష! సహస్వ సంప్రతిశిఖా
శాఖాశతాకర్షణ
క్షోభోత్పాటనభంజనాది జనితం
స్వైర్వేదుశ్చేష్టితైః

ఉత్పలమాల

పుట్టగనేల నల్వురును పోయెడి
త్రోవల? ఏల చల్లగా
దట్టపు నీడనీవలె?
సదా ఫలగుచ్ఛము లీయనేటికో
చెట్టు! సహించు తప్పదిక
చేసిన కర్మకు పండ్లురాలగా
గొట్టి, భవచ్ఛిఖం దునిమి,
కొమ్మలుకూల్చిన మానవాధముల్.

*　　*　　*

దేవవాహినిలోనూ, మానస సరస్సులోనూ విహరించవలసిన రాజహంసా! వీధులలోని మురుగు నీటితో నిండిన ఈ పాడు చెరువులో నివసించాలని వచ్చావా? నీకేమైనా మతిపోయిందా? దురదృష్టం తన్నుకు వచ్చిందా? సరేలే, నీకు అంతగా కోరికగా ఉంటే

కాదనడం దేనికీ? అయితే, ఇక్కడికి మకాం మార్చే ముందు నువ్వు నేర్చుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. జాగ్రత్తగా విను. ఇక్కడి కొక్కిరాయిలమీద నమ్మకం పెంచుకోవాలి నువ్వు. గోదురుకప్పలయందు వినయం ప్రకటించడం నేర్చుకోవాలి. జలగలతో సంబంధబాంధవ్యాలు పెట్టుకోవాలి. తీతువులతో సమానత్వం నెరపాలి.

మహారాజుబిడ్డ. యౌవరాజ్యపట్టాభిషిక్తుడు. రేపోమాపో రాజు కావలసినవాడు. తెలివితక్కువచేతనైతేనేం, నెత్తిమీద శని తాండవిస్తూ ఉండడం చేతనైతేనేం, తన అంతస్థు మరిచి, జూదరులతో సహవాసంచేసి, కల్లుపాకలదగ్గర తారట్లాడుతూ ఉంటే, అతగాడిని మందలించే ఉద్దేశంతో పండితరాయలు చేసిన కల్పన ఇది.

శార్దూల విక్రీడితం

ఏషా పుష్కరిణీమరాళ!
మలినైశ్ఛన్నా కుపీథీజలై
ర్యస్యామజ్ఞతయా విధే రకృపయా చే
ద్వస్తు మాకాంక్షసే
విస్రంభో బకమండలేషు
వినయో భేకేషు సంబంధితా
రక్తాంధస్సువిధీయతాం
సుజనతా కోయష్టికశ్రేణిషు.

చంపకమాల

మలినజలమ్ముతోడ కొరవాలిన
యిక్కడి పాడుగుంటలో
తెలివియుతేటలేక వసతిం
గొననెంచితివేని హంసమా!
అలవడుగాక నీకు వినయమ్ము
బకమ్ములయందు, నెయ్యమున్
జలగలతోడ, తీతువుల సంగతి,
కప్పలతోడ వియ్యమున్.

* * *

షాజహాను చక్రవర్తికి, యువరాజు దారాషకోకి అత్యంతగౌరవపాత్రుడైన కారణంచేత జగన్నాథ పండితునిమీద ఢిల్లీ దర్బారులోని చాలామందికి కన్నెర్రగా ఉండేది. అతడికి విషప్రయోగం చేయడానికికూడా ప్రయత్నాలు జరిగేయి. సుడి బాగుండి బతికి బయటపడగలిగేడు. ఆ సమయంలో చెప్పినశ్లోకం ఇది.

ఓ ఖలుడా! మహానుభావా! నీవు సుగుణజనపక్షపాతివి (మంచివాళ్ల పక్కలో పొడిచేవాడివని మరో అర్థం.) నిన్ను ఎల్లా ప్రస్తుతించనూ? సాధుజనులను ఒక్కక్షణంకూడా మరిచిపోవుకదా! నీ మనస్సులో ఎప్పుడూ వాళ్లనిగురించిన ఆలోచనలేకదా!

ప్రమితాక్షరా

కిమిహం వదామి ఖల! దివ్యమతే!
గుణపక్షపాత మభితో భవతః
గుణశాలినో నిఖిలసాధుజనాన్
య దహర్నిశం ఖలు విస్మరసి.

ఆటవెలది

ఎంతదివ్యమతివి! ఎట్లు నిన్ను నుతింతు?
పరమసుగుణ పక్షపాతి! ఖలుడ!
రేబవళ్లు నీదుహృదయమ్ములో నిల్పి
సాధుజనుల మరువజాలవైతి.

* * *

ఇంతశ్రమపడి సద్గుణాల నన్నింటినీ ఆర్జించడానికి ప్రయత్నిస్తున్నావెందుకయ్యా? మహానుభావా! ఈ సుగుణాలు ఎందుకూ? నెత్తినవేసికొట్టుకోడానికా? నేను ఒకమంచిమాట చెప్తా విను—నీకు బాగా నచ్చిన సరుకు—అదీ ఇదీ అనిలేదు ఏదైనాసరే—నీ ఇష్టం వచ్చినట్లు అనుభవించు. ఆంబోతులా శరీరం పెంచు. ఇంతకన్న ఈ కలికాలంలో శ్రేయస్కరమైనది మరొకటిలేదు

శార్దూల విక్రీడితం

కస్మై హంత! ఫలాయ సజ్జన!
గుణగ్రామార్జనే సజ్జసి
స్వాత్మోపస్కరణాయ చే న్మమవచః
పథ్యం సమాకర్ణయ

యే భావా హృదయం హరంతి
నితరాం శోభాభరైః సంభృతా
స్తైరేవాస్య కలే కలేబరపుషో
దైనందినం వర్తనమ్.

మత్తేభ విక్రీడితం

పలుకష్టంబులకోర్చి యిట్టి
సుగుణవ్రాతంబు నార్జింతువే
ఫలముంగోరి మహానుభావ!
వినుమా పథ్యంబులైనట్టి మా
పలుకుల్—నీ మది మెచ్చునట్టి
సరుకుల్ పల్మారు సేవించి యీ
కలిలో దేహము పెంచుటొక్కటె
సుమీ కార్యం బవశ్యం బికన్.

*　　　　*　　　　*

అది క్రీ. శ. 1674 వ సంవత్సరం మధురలో ఒక తాటాకుపాకలో కుక్కిమంచంలో ఉపద్రష్ట జగన్నాథ పండితరాయలు పండుకునిఉన్నాడు. అప్పుడే వారంరోజులుగా మంచం దిగడంలేదు. గంటం పట్టుకునే ఓపికకూడాలేదు. అప్పుడూ అప్పుడూ ఆయన నోటివెంటవచ్చే శ్లోకాలను మనుమడు మహాదేవభట్టు వ్రాసుకుంటున్నాడు. తన జీవితం ఎంతలో ఎల్లా మారిపోయిందో తలుచుకుంటే కళ్ళనీళ్లు వస్తున్నాయి ఆయనకు.

'ఏమైంది? తాతగారూ!' అన్నాడు మహాదేవుడు. ఆ కన్నీళ్లలోనే తెరలుతెరలుగా నవ్వున్నూ వచ్చింది ఆయనకు. తాతగారికి మతి చలించలేదు కదా అనుకున్నాడు మనవడు. 'హకీమ్'ని పిలుచుకు రావడానికి చెప్పుల్లో కాళ్లు పెట్టుకుంటున్న మనవణ్ణి దగ్గరకు పిలిచాడు.

'నాకు కన్నీళ్లు ఎందుకువచ్చాయో తెలుసా?'

మహాదేవుడు తాతగారి కళ్లల్లోకి చూశాడు. ఆయన కళ్లల్లో చిలిపితనం కొట్టవస్తోంది.

'దారిద్ర్యదేవికి కలుగబోయే కష్టాలు తలుచుకుంటే నాకు దుఃఖం ఆగడంలేదురా అబ్బీ!'

'ఏమిటో ఆవిడగారికి రాబోయే కష్టం?'

'అల్లా అడుగు చెప్తాను. ఇన్నేళ్లుగా నన్నే నమ్ముకుని, క్షణం విడిచిపెట్టకుండా మూడు పువ్వులూ ఆరు కాయలుగా దారిద్ర్యదేవత వృద్ధి పొందుతోందికదా! ఈ నా దేహం ఇంకెంతకాలం ఉంటుందీ? రేపోమాపో రాలిపోయేదేకదా! ఆ తరవాత పెద్దమ్మకి నిలవనీడ ఉంటుందో ఉండదో, ఆమె రోజులు ఎల్లా వెళ్ళబుచ్చుతుందోకదాఅని తలుచుకుంటే నాకు దుఃఖం పొంగిపొంగివస్తోందిరా. మా ఇద్దరి స్నేహానుబంధం అటువంటిది మరి—ఏదీ గంటం అందుకో.'

ఉపజాతి

దారిద్ర్య! శోచామి భవంత మేవ
మస్మచ్ఛరీరే సుహృదిత్యుషిత్వా
విపన్నదేహే మయి మందభాగ్యే
మమేతి చింతా క్వ గమిష్యసి త్వమ్.

తేటగీతి

స్నేహితునివోలె నా మేను చెట్టవట్టి
వృద్ధిపొందితి విన్నాళ్లు బీదతనమ!
ప్రాణములు బాయనున్న నన్ వదిలిపెట్టి
యెందుబోయెదవనుచు చింతించుచుంటి.

[ఇందులో ఉదాహరించిన తెలుగు పద్యాలు డాక్టర్ మహీధర నళినీమోహన్ అనువదించిన భామినీ విలాసంలోనివి.]

———

సంగీత స్వరప్రవాహం

శ్రీ దేవరాజు మహారాజు

జపానుకు బౌద్ధమతాన్ని ప్రసాదించింది భారతదేశం. అలాగే సంగీతాన్ని కూడా వెనువెంటనే వరంగా ఇచ్చిందేమోననిపిస్తోంది. మనదేశం సంగీతం జపానుకు చైనా, కొరియాలద్వారా ప్రవహించింది.

పూర్వంనుండి మనకు సంగీతశాస్త్రాలు ఎలా వున్నాయో వారికీ అలాగే వున్నాయి. అక్కడి పాపలు మాటలు నేర్చుకోకముందే పాటలు నేర్చుకోడానికి యత్నిస్తారుట !

బ్రహ్మ, సరస్వతి, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు మొదలయిన దేవతలతో, నారద, తుంబురులాది మహామునులతో మన సంగీతమెంతో ముడివడి వున్నదని, వారే రాగాలు, రాగిణులు ఏర్పరిచినారని మన పురాణాలవల్ల తెలుస్తూవుంది.

ఇదేవిధంగా జపానువారి సంగీతంకూడా దేవుళ్ల వల్లనే ఉద్భవించిందని సర్ సురేంద్రమోహన్ ఠాగూర్ గారు వ్రాసిన విశ్వసంగీత చరిత్ర (Universal History of Music) అనే గ్రంథంవలన తెలుస్తోంది.

పూర్వం సూర్యదేవుని భార్య 'ఎమాటెరాసు' ఓసారి ప్రత్యేకమైన కొండగుహలో దాక్కుని ఎవరినీ చూడడానికి ఇష్టపడలేదని, మిగిలిన దేవగణమంతా వారి పొరపాట్లను క్షమించమని, ఎంత బ్రతిమిలాడినా, ఆవిడ వినిపించుకోలేదని, అప్పుడు దేవుళ్లంతా ఆమెను సంగీతంతో కరిగించి, కరుణించేట్లు చేసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించి మధురసంగీతంతో వారామెను జయించారని—ఆ పుస్తకంద్వారా జపానువారి సంగీతపు పుట్టుక విశదమౌతుంది. అంటే ఇక్కడ కూడా సంగీతానికి దేవతలే కారణం కాబట్టి, పవిత్రంగా ఆ సంగీతం చూడబడుతోంది.

శాస్త్రనిపుణులు పరిశీలనద్వారా, పరిశోధనల ద్వారా జపానువారికి సంగీతం భారతదేశం ఇచ్చిన వరమని, అది వారికి చైనా, కొరియాలద్వారా లభించిందని తేల్చారు.

జపాను చక్రవర్తి మరణంపట్ల సంతాపహృదయుడైన శ్రిగి అను కొరియాదేశపురాజు (453 A-D లో) విచారం వ్యక్తంచేస్తూ, జ్ఞాపకార్థం, ఎనభైమంది గొప్పసంగీతవిద్వాంసులను, వెలకట్టలేని ఇతర వస్తువులను జపానుకు బహుమానంగా పంపించాడు. అందువల్లనే, కొరియా, జపానుకు మధ్య సన్నిహిత సత్సంబంధానికి, పునాది—సంగీతం ![1]

శ్రీ కర్జన్ – పాశ్చాత్య సంగీతప్రవీణుడు—ఇలా అన్నారు. 'జపాను సంగీతం ఐదవ శతాబ్దం (A. D) లో కొరియాదేశంద్వారా ప్రవేశించినప్పు డుద్భవించింది. ఆరవ శతాబ్దంలో బౌద్ధమతము, సంగీతాచారాలు కొన్ని చైనానుండి జపానులో ప్రవేశించి విస్తరించాయి. చైనాకు ఇండియానుండి సంక్రమించాయి.

భారతదేశంనుండి జపాను చేరిన సంగీత నృత్యకళలు వారి ఆచారాల ప్రకారం కొన్నిమార్పులుచెంది స్థిరంగా నిలిచాయి. ఉదాహరణకు, వారి మనోహరమైన 'బుగాకు' స్వరాల్ని పరిశీలించవచ్చు—'

'బుగాకు' —అంటే నృత్యసంగీతం. ఇది 'నరనయిన్'కాలంలో _నా సంస్కృతిద్వారా వృద్ధిచెందింది.

1. The Rise of Music in the Ancient World 1944, page 105;

2. బు=నృత్యం; గాకు=పాడటం;

ఎనిమిదవ శతాబ్దంలో 'మన్చూరియా' తరం గాలపై ఇతరదేశాల ప్రభావం పడింది. దానితో జపానులోని సాంప్రదాయ సంగీతం కొంత మరుగున పడింది. అప్పుడు శ్రీ ఓకాకుర అను సంగీత ప్రవీణులు బుగాకు అను జపాను సంగీతంలో హిందూదేశపు సంగీతాన్ని మరియు పురాతన 'హ్యాంగ్' - సంగీతాన్ని కలిపి ప్రతిభావంతంగా తయారుచేశారు.

పురాతనకాలానికిచెందిన ఆరు గీతాలు (Ballads) కొంతమంది విజ్ఞానవంతులద్వారా సేకరించబడినవి. అందు చైనీయుల సువర్ణయుగానికి చెందినవి కొన్ని, సాంప్రదాయికంగా సిద్ధించినవి కొన్ని; వాటిని 'భా'— 'ఇన్'—మరియు 'షూ'—అని అన్నారు.

ఆరవ శతాబ్దంలో చైనాద్వారా జపానుకు చేరిన భారత సంగీత పరికరాలు, వాయిద్యాలద్వారా కొన్నిరాగాలుకూడా వెళ్లి జపానువారి హృదయాల్లో ముద్రలు వేసాయని తెలుస్తుంది.

అందుకే వారి 'భరో' అనేరాగం మన భైరబ్ లేక భైరవి రాగాలనుండే వెలువడిందని నమ్మకం కలుగుతోంది.

'ప్రిన్స్‌శాటోకు' తన జపాను సైనికులను తమ సంగీతంలోని 'భరో' ద్వారా ఉత్తేజవంతులను, ఉత్సాహవంతులనుగా చేసి తనపై దండెత్తి వచ్చిన 'మొరిగా నొద్దిడిన్'ను సునాయాసంగా ఓడించినాడన్న అద్భుత సంఘటన వింతగా తోచినా, నిజం!

జపానులో సంగీత వాయిద్యాలను రెండు రకాలుగా విభజించారు.

1. సంపూర్ణమైనవి 2. అసంపూర్ణమైనవి.

సంపూర్ణమైనవానిని కేవలం మతసంబంధమైన పాటలకే ఉపయోగిస్తారు. మిగిలిన ఏరకపు పాటలకైనా అసంపూర్ణమైనవే!

వాయిద్యాలలో కోట్, సామిసెన్, కోకు, మరియు బివా అన్నవి ముఖ్యమైనవి. 'కోట్'లో మళ్లీ సుమన్‌కోట్, లూన్—కోట్, మొదలైన అనేక రకాలు—

'సామిసెన్'—అనునది 'ఫికో' గాయనీమణులకు అత్యంతప్రియమైన వాయిద్యము.

పోతే, వారి 'కోకు' మన వయోలిన్‌లా వుంటుంది. 'షోయూ'—'శేకి'—'శకుహచి' —అనేవి మన వేణువుల్లాగా వుంటాయి.

ఇక 'బివా'— వాయిద్యం చైనావారి 'పిపా'వలె వుంటుంది. బివాను సాంప్రదాయబద్ధమైన సంగీతంలోనూ, లలిత సంగీతంలోనూ ఉపయోగిస్తారు.

మనకు డోలు, మద్దెల, తబులా, డప్పు వంటి చర్మవాయిద్యాలవలె జపానువారికి 'క—గూర—టైకొ'— 'ఓ.ట్సూజుడ్‌జుమి' — 'కో.ట్సుజుడ్‌జుమి' — వాయిద్యాలు వున్నాయి.

జపాను సంగీతకారులు

జపానీయులు వారి సంగీతకారుల్ని చాలా విచిత్రంగా నాలుగుభాగాలుగా విభజించుకున్నారు. వారిలో—

1. గెక్కునైన్.
2. గియోనిన్.
3. ఫికి బ్లైండ్.
4. ఫికోస్.

గెక్కునైన్ గాయకులు కేవలం మతసంబంధమైన, భక్తికి, త్యాగానికి సంబంధించిన గీతాలే గానం చేస్తారు. వీరు జపానులో 'మికాడో ఆర్కెస్ట్రా'ను ప్రవేశపెట్టారు.

రెండవరకం 'గియోనిన్' గాయకులకు గానమే వృత్తి. అందువలన వారు అన్నిరకాల పాటలు పాడుతూ జీవిస్తారు.

ఫికి—బ్లైండ్—సంగీతకారులు కేవలం బృందగానాలు చేస్తారు. వీరు మతసంబంధమైనవి, సాంఘికమైనవి పాడుతారు.

ఫికో—లో అందరూ యువతీమణులే వుంటారు. వీరిని 'గాయనీమణులబృందం' అని అంటారు. వీరు ఆధునిక, లలితగీతాలను మాత్రం ఆలాపిస్తారు. ప్రార్థనలు, దేశభక్తిగేయాలు వీరికి వచ్చవు—పాడరు—అంతే!

జపాను సంగీతం నేర్చుకోవడమైనా, అర్థం చేసుకోవడమైనా చాలా సుళువు. అందుకే, పాశ్చాత్య సంగీతకారుడు కర్చన్ అంటాడు—'తూర్పుదేశాల పూర్వపు సంగీతాన్ని చైనాలోకంటే, జపానులో పరిశీలించడం సులభం'—అని.


అసలు సంగీతస్వరాల్ని తెలిపే సంకేతాలు వ్రాయడం జపానులో 1511 నుండి ఆరంభమయింది. వారు సంకేతాలను చైనీయుల్లాగే కుడినుండి, ఎడమకు వ్రాస్తారు.

1878 లో జపాను ప్రభుత్వం 'సంగీత పరిశోధక సంఘాన్ని' నియమించింది. ఆ సంఘం ప్రప్రథమ కర్తవ్యం ఏమిటంటే,—'పశ్చిమదేశీయుల సంగీతానికి, జపానీయుల సంగీతానికివున్న సంబంధాలు, విభేదాలు తెలుసుకోవడం.'

మళ్లీ 1880 లో జపాను ప్రభుత్వం 'జాతీయ సంగీత మండలం పరిధి' (National Music Circle) అన్నదాన్ని స్థాపించింది. సంగీతంలో పరిశోధనలు జరిపి, ఫలితాలను, ప్రజల కందివ్వడానికి, కృషి సల్పడానికి ప్రభుత్వం ఆ సంగీత మండలానికి ఎంతో సహాయపడింది.

భారతదేశంనుండి గ్రహించిన సంగీతంలో పరిశోధనలు జరిపి, పాశ్చాత్యసంగీతాన్నికూడా కలుపుకుని, ఉన్నత ప్రమాణాలను పెంచుకుని, హృద్యంగా వుండే సంగీతం వారు ఏర్పరుచుకున్నారు.

ఈ విధంగా పరిశీలిస్తే, 'పురాతన భారతదేశ సంగీతం'—ఆసియా యూరప్‌లలో దాదాపు అన్ని ప్రాంతాలకు తన రెక్కల్ని చాపుకున్నదని తెలుస్తుంది.



ద్వైధీభావము

శ్రీ సి. ఆర్. స్వామి

ఈ బాటవెంబడి ఎక్కడికో నడుస్తున్నా
ఎక్కడికి నడుస్తున్నానో తెలియదు
ఏ ఆశా వున్నట్లు స్ఫురించదు.

అస్పష్టముగా ఎవరివో అడుగుజాడలు
అయిష్టముగా ఎవరో అన్న రెండేరెండు మాటలు
ఈ అడుగుజాడలు తిరిగి చూచేసరికి చెదరిపోయాయి
అయిష్టముగా అన్న ఆ రెండేరెండు మాటలు
జీవితంలో వేధింపసాగేయి.

ఏ చెలియ చూపో గునపమై గుండెలో దిగె
ఎపుడో పాడుకున్న యుగళగీతములే ప్రేమం కోసె
ఎంత దవ్వరిగినా వెదకేది కానరావడంలేదు
కాని ఎడారిలా శూన్యం కాలేదు
ఆశ, జీవించమని ప్రోత్సహిస్తుంది
బాధ, నిస్సారమైన జీవిత మెందుకని పొమ్మంటుంది.

ఏది కోరను–ఏది వదలను ?

మరో అసమర్థుని సాకు –
బ్రతికేందుకు...

శ్రీ గోరంట్ల ఫణికుమార్

సాయంత్రం ఐదున్నరకి కాగితాలన్నీ డ్రాయర్లో తోసి లేచి నిలబడ్డాడు శ్రీధర్. ఆఫీసంతా అప్పటికే ఖాళీ అయిపోయింది. పగలంతా యుద్ధ భూమిలా నానా హాహాకారాలతో నిండివుండే హాలు నిశ్శబ్దంగా వుంది. గోడకి వేలాడుతున్న గడియారం టిక్కుటిక్కుమంటూ నిశ్శబ్దం భంగపరుస్తోంది. అంతే! మరే చప్పుడూ లేదు.

పగలంతా చూసిన కాగితాల తాలూకు విశేషాలు శ్రీధర్ మనసును యింకా విడవలేదు.

'మా యింట్లో కరెంటు వారం రోజులుగా రోజుకి రెండు గంటలపాటు రావడంలేదు. ఎందువలన?'

'మా షాపుకి ముందున్న వీధి దీపం వెలగడం లేదు కారణం?'

'మేం పార్లవీధిలో కట్టుకున్న యింటికి కరెంటు సప్లై ఇంతకాలంగా ఎందుకు చెయ్యడం లేదు?'

'ఈ నెల కరెంటు బిల్లు లేటుగా కట్టేందుకు అనుమతియిస్తారా?'—అనే అర్జీలు మొదలుకుని, 'నాకు ఫలానా విధమైన కష్టాలున్నాయ్—ఇన్ని బాధ్యతలున్నాయ్. అందుచేత వుద్యోగం యిప్పించరా' అనే అసందర్భమైన దరఖాస్తులవరకూ అనేకం చూశాడు ప్రొద్దుట్నుంచీ.

యూనిట్లూ రూపాయలూ లెక్కవేసి బిల్లులు ర్రాశాడు. బాకీలుపడ్డ వాళ్లకి నోటీసులు ర్రాశాడు. విసుగెత్తి సాయంత్రం ఐదున్నరకి మిగిలిన కాగితాలన్నీ డ్రాయర్లో తోశాడు.

డ్రాయర్లో కాగితాలెంత చిందర వందరగా వున్నాయో అంతకు రెట్టింపు చిందరవందరగా వుంది మనసు. ఎన్నడూ లేనంత అశాంతిగా వుంది. పగలంతా పనిచేశాను—విధి 'నిర్వర్తించాను అనే సంతృప్తి కలగడం లేదు. నిన్న చేసినట్టే నేడు, నేడు చేసినట్టే రేపు అనే భావం విసుగు నిరాశ కలిగిస్తున్నాయి.

ఒకసారిగా తన జీవితం అంతా బూడిదగా అనిపించింది శ్రీధర్‌కి.

'కోటయ్యా, తలుపువేసుకో'అని చిరాగ్గా అరిచి విసురుగా బయటికి నడిచాడు.

కోటయ్య ఏదో అన్నాడు. మెయిల్ రెండు గంటలు లేటనో, ప్రతాప్‌లో ఏదో హిందీబొమ్మ వేస్తున్నారనో—వినిపించుకోలేదు. 'అర్థంలేని విజ్ఞానం—అవసరంలేని పనికిరానిమాటలు' అనుకున్నాడు మనసులో కసిగా.

పుట్టి ఇరవైతొమ్మిదేళ్లు దాటాయి. కానీ తను ఎదగడం మానేసి అప్పుడే డజను సంవత్సరాలయిపోయింది. డజను సంవత్సరాల క్రితంకాదూ తను యీ ఆఫీసులో చేరింది. చీకటినిండిన మనసుతో నడుస్తున్నాడు శ్రీధర్.

జేబు తడుముకుంటే ముప్ఫైతొమ్మిదిపైసలు దొరికాయి. ఒకటవ తారీఖు రావడానికి యింకా పది రోజులుండగానే జేబులు ఖాళీ, ఆ ముప్ఫైతొమ్మిది

పైసలుకూడా రెండురోజుల్రకితం చేసిన అప్పు తాలూకు; కడుపులో మంటగా వుంది. ఆకలి కాబోలు—హోటలుకెళ్తే యీ ముప్ఫై తొమ్మిది పైసలతో ఏమీ రాదు. వచ్చినా దానితో కడుపు నిండదు.

వళ్లు మండింది శ్రీధర్‌కి.

ఒకటో తారీఖు తలుచుకోవద్దాన్నా జ్ఞాపకం వస్తోంది. జ్ఞాపకంతోపాటు భయం నిరాశ పొడుచు కొస్తున్నాయి.

వచ్చేది రెండొందల యిరవై తొమ్మిది రూపా యలు. అందులో ముప్ఫై రూపాయలు అద్దెకుపోతే, పాతిక పాలకుపోతే, తిండికి వంద చెల్లిపోగా మిగిలిన దాంట్లో చాకలికి, మంగలికి, పనిమనిషికి...ఇలా రెండవ తారీఖు వచ్చేసరికి సున్నకు సున్నా, హళ్లికి హళ్లి. ఒకటో తారీకున క్రితంనెలలో తీసుకున్న పదో పరకో అప్పు తీరుస్తాడు. పదో తారీకున మళ్లీ ఎవర్నో అప్పు అడగాలి.

రెండు పూట్లా ఫరవాలేదన్నట్లుగానే తిండి తింటున్నారు. అయితే ఏం కలిసొచ్చిందని మనసుకి సంతృప్తి? నలుగురూ కలిసి ఓ సినిమాకు వెళ్దామంటే కుదరదు. నాణ్యమైన ఓ బట్ట కొనుక్కుందామంటే నాణేలుండవ్.

అంతచిరాకులోనూ శ్రీధర్‌కు నవ్వొచ్చింది—తన ఆలోచనలో ప్రాసలు కలుస్తున్నాయేమిటా—అని.

బజార్లో జనం యీగల్లా రొదపెడ్తున్నారు. గొర్రెల మందల్లాగా తీరూ తెన్నూ లేకుండా ఏదో పడిపోతున్నారు. కొందరు షోగ్గాళ్లు యీ మూలా ఆ మూలా నిలబడి సిగరెట్లు పీలుస్తూ హస్కు దంచుతున్నారు. దారేపోయే ఆడపిల్లలవంక వెకిలిగా చూసి ఇకిలిస్తున్నారు. ఒక్కొకడ్నీ నేలమీదవేసి నల్లిని రాచినట్లు రాయాలనిపించింది శ్రీధర్‌కి.

'ఆడదాని జీవితంకంటే అధ్వాన్నం లేదుకదా ఈ దరిద్రపు ప్రపంచంలో. అసలే దానిబ్రతుకొక గడ్డు సమస్య. కష్టాల పుట్ట. దాన్ని యింకా కష్టతరం చేస్తున్నారెందుకో యీ వెధవజనం' అని విసుక్కు న్నాడు.

'వీళ్లందరూ యిలా తగలడకపోతే యిక్కడ యీ పిల్లలు యింత బెరుగ్గా, బెదురుగ్గా తిరగాల్సిన అవసరం వుంటుందా' అని జాలిపడ్డాడు ఆడపిల్లల మీద.

పదిగజాల కొక్కోచోట ఓ చిన్నగుంపు నిలబడి ఏమిటేమిటో చర్చిస్తున్నారు.

అమెరికావాళ్లు చంద్రమండలం చేరారట. అక్కడ నడిచారట. కిందపడ్డారట. మీదపడ్డారట. వాళ్లకి డబ్బుంది. అలా తగలబెడ్తున్నారు. వీళ్లెందు కింత కిందామీదా పడిచావడం?

అమెరికావాడు చంద్రుడిమీదకి వెళ్తాడు. రేపు సూర్యుడిమధ్యకే వెళ్లివస్తాడు. మనంమాత్రం యిలా యీ రోడ్డుమీద కుళ్లిపోతున్న అరటితొక్కల్లాగే వుండిపోతాం.

వాడు వెళ్లాడని ఇప్పుడిక్కడున్నాడని ఇలా చేశా డని వీళ్లెందుకింతవేడితో వుద్రేకంతో ఊగిచావడం? ఈ టైము మరెందుకైనా వాడుకు ఏడవకూడదూ!

శ్రీధర్‌కి అలా రోడ్డుమీద నిలబడి చంద్రుణ్ణి అమెరికావాణ్ణి గురించి మాట్లాడుతున్న జనాన్ని చూస్తే వళ్లు మండింది.

'ఇంక మనకు మీసాలెందుకు? రేపు క్యూలో నిలబడితీయించుకుంటేసరి' అంటున్నాడో పెద్దమనిషి.

ఆ చుట్టూవున్నవాళ్లంతా గొల్లున నవ్వడం.

'ఏం? ఎందుకని?'అని అడుగుదామనుకున్నాడు శ్రీధర్.

'ఆడదైనా ఎంతయిదో చూడండి. అన్న మాటల్లా నెగ్గించుకొస్తూంది. పెద్దపెద్ద మొగా ళ్లందరూ తలలు వంచుకునేలా చేసింది. బాంగ్లాదేశ్ యుద్ధంలో ఆమె రాజనీతి.....,'

ఏమాట విన్నా ఏదృశ్యం చూసినా చిరాకు, కోపం, చిరచిర.

శ్రీధర్ బజార్లో రెండుగంటలసేపు తిరిగాడు. తిరిగితిరిగి రైలుపట్టాలమీద కూర్చున్నాడు. 'రేణిగుంట తగలడేబండి రెండుగంటలకిగానీరాదు' అని మనసులో విసుక్కుని జేబులో మిగిలిన ఒక సిగరెట్టు తీసి అంటించుకున్నాడు.

'ఎందుకోసం నేను బతకడం?'అని ప్రశ్న వేసుకున్నాడు.

తరతరాలుగా భూమి దున్నుకు బ్రతికిన తండ్రి బిడ్డ శ్రీధర్.

చిన్నప్పుడు పల్లెటూళ్ళో వుండ బుద్ధికాలేదు. పన్నెండో ఏటనే దగ్గర్లోవున్న పట్నం కదాని తిరుపతి బయల్దేరాడు. తిరుపతిలో చదువుకుంటానన్నది వుద్దేశం.

'పీలేరులో ఎనిమిది క్లాసులు చదవావ్ కదా, చాల్లే' అని తండ్రి.

'చాలదు. పై చదువులు చదువుతున్నాను. మీకు మల్లేనే యిలా నేలకి అతుక్కు నేనుండలేను' అని కొడుకు.

కొడుకుపక్షమే తల్లి...తల్లి అన్నగారు—మేనమామ, యింకా చిల్లరజనం చేరారు.

ఇద్దర్నీ కాదనలేక పంపించాడు తండ్రి.

ఆ విధంగా తిరుపతి చేరాడు శ్రీధర్ మొదటిసారి. దేవస్థానం హైస్కూల్లో చేరాడు.

పట్నం బాగుంది.

సినిమాలు అవి చాలా జోరుగా వస్తాయ్. బోలెడన్ని హోటళ్ళు. మంచి స్నేహితులు చుట్టూరా వుండేవారు. సరదాగా కాలక్షేపం అయిపోయే రోజులు.

నెలకోసారి పల్లెనుండి లెఖ్ఖ తీసుకుని, తెచ్చి యిచ్చే వాడు తండ్రి. నూరు నూట యాభైకి తక్కువగాకుండా ఖర్చు చూపించే వాడు తాను.

కొడుకుమీద కొండంత ఆశలు పెట్టుకుంది తల్లి. అల్లుడిమీద ఆకాశంమేర ఆశ పెట్టుకున్నాడు మేనమామ.

నాటకాలు అలవాటు చేసుకున్నాడు శ్రీధర్.

సినిమా హీరో కావాలని ఆశ పెట్టుకున్నాడు. రాత్రిపూట నిద్రమాని కళాసరస్వతి కాళ్ళు కడిగాడు. రెండుమూడుసార్లు మద్రాసు వెళ్ళాడు.

'తాగలేనని అనుకోకండి. సిగరెట్టు పీల్చలేననీ అనుకోకండి. ఈ కళకోసం నేనేమన్నా చేస్తాను. కన్నవారినీ, కనిపెంచినవారినీ—అందర్నీ ఎదిరిస్తాను' అన్నాడు శ్రీధర్. వీలైనపుడల్లా చేసిచూపించాడు కూడా.

సినిమా స్వర్గంలోకి సిగరెట్టు మేఘాలమీద సారాగుర్రం ఎక్కితేగాని వెళ్ళలేవన్న స్నేహితుల దృఢమైన విశ్వాసాల కనుగుణంగా అలవాట్లు చేసుకున్నాడు. స్వర్గందారి కనుపించలేదుగానీ, గుర్రపు స్వారిమాత్రం వదల్లేదు శ్రీధర్ కి విక్రమారుడికి మల్లే.

ఇన్నీ అయ్యేసరికి పదహారేళ్ళు నిండలేదు శ్రీధర్ కి. ఎస్సెల్సీ రెండోసారి ఫెయిలయ్యేడు. చదువులంటే సామాన్యంకాదన్నది తల్లి. 'పెద్దచదువులంటే మరోటా'అని వెనకేసుకొచ్చాడు మేనమామ. 'కర్మ' అనుకున్నాడు తండ్రి.

శ్రీధర్ అందంగా ఉండేవాడు.

ఆరాధన అనే నాటకానికి ఒకసారి ఓ అమ్మాయి కావాల్సొచ్చింది. ఎవరువేస్తారా అని తెగ ఆలోచించారు. స్కూల్లోవున్న అమ్మాయిలెవరూ ధైర్యంచేసి ముందుకొచ్చే రోజులు కావవి. ఎవరైనా బైటవాళ్ళని తీసుకురాక తప్పదని నిర్ణయం చేసుకున్నారు.

'ఈవిడే రాధ! మంచినటి'అని ఓ అమ్మాయిని ఓ రోజున పరిచయం చేశాడు శివరాం—అంటే శ్రీధర్ కి కుడిభుజం.

రాధ అద్భుతంగా వుంది.

చామనచాయఐనా ఆర్చిప్పల్లాంటి అందమైన కళ్ళు. చెక్కినట్టున్న ముక్కు, నవరత్నాలు రాల్చే నవ్వులు.

'ఆరాధన' నాటకంతోపాటే శ్రీధర్ ఆ రాధను ఆరాధించడం ప్రారంభించాడు.

'క్రిష్ణా, నన్ను పెళ్లి చేసుకుంటావా, లేకపోతే ఏ రైలు కిందైనా తలపెట్టమంటావా!' అని రాధ అడిగినప్పుడల్లా—నాటకంలో—

'నీ యిష్టం వచ్చిన చోట పెట్టు' అనే నాటకం డైలాగుకు బదులు 'అంతకన్నా నాకు కావాల్సిందేమిటి రాధా!' అని కౌగిలించుకుందామనుకునే వాడు.

ఆరాధన తర్వాత శ్రీధర్ ఎక్కువ నాటకాలు వెయ్యలేదు. 'స్కూలుఫైనలు పాసయింతర్వాత డాక్టరీ చదువుదామనుకుంటున్నాను. అందుకని పియ్యూసీలో చేర్తాను' అని యింట్లో అననూ లేదు.

పట్నంలో ప్రింటింగ్ వ్యాపారం చేస్తానని రెండు మూడెకరాల పొలం అమ్మించాడు. వచ్చిన పాతికవేలతో ఓ సెకండ్ హాండ్ ప్రెస్ కొన్నాడు. పుస్తకాలు అచ్చువెయ్యడం మొదలుపెట్టాడు. మొదట్లో లాభం వచ్చినట్లే కనబడ్డా శ్రీధర్‌కు వ్యాపారదక్షత లోపించడంవల్ల ప్రెస్సు చెయ్యిజారిపోయింది.

రాధతో పరిచయం పెరిగిందికూడా ఆ సమయంలోనే. ఇంచుమించు సమయం అంతా రాధతో గడిపేవాడు ప్రెస్సు బాధ్యతలను శివరాంకు అప్పచెప్పి.

శివరాం దక్షుడు. సమర్థుడు. వ్యాపారం బాగానే జరిపించాడు. కాని బ్రతుకు తెరువు తెలిసినవాడు. దీపం వున్నప్పుడే యిల్లు చక్కబెట్టుకోవాలనే మనిషి.

అందుకనే బాగా జరిగిన వ్యాపారంలో నష్టం కనబడింది.

శ్రీధర్ మరిపెట్టుబడి తేలేక ప్రెస్సు అమ్ముకున్నాడు.

స్నేహితుడికి మంచిబేరం రావాలన్న ఉద్దేశంతో శివరామే ప్రెస్సు కొనుక్కున్నాడు.

'నువ్వు చితికి పోకూడదు శ్రీధర్! అప్పోసొప్పోచేసి ఈ కొండచిలవని నేనే కొనక తప్పదు. దీన్లోంచి లేస్తానో, మసైపోతానో—ఏమైనా ఓ స్నేహితుడిని ఆదుకున్నామన్న తృప్తివుండకపోదు—' అన్నాడు శివరాం.

శ్రీధర్ చేతికి పదివేలు వచ్చాయి. అప్పులు అయిదువేలు పోయాయని శివరాం చెప్పాడు. అంటే పదిహేనువేలకి అమ్ముకున్నాడన్నమాట ప్రెస్సు.

పాపం! శివరాం చితికిపోలేదు. నిలదొక్కుకోగలిగానని అతనే చెప్పాడు. దేవుడిమీద భారంవేశాననీ, 'నువ్ కూడా దేవుడిమీదే భారంవెయ్'అనీ సలహా యిచ్చాడు శ్రీధర్‌కు.

ఒకే బేరానికి వెళ్లిన యిద్దరు పెద్దమనుషులు ఒకే దేవుడిని ప్రార్థనచేస్తే యిద్దర్నీ ఎలా ఆదుకుంటాడు, దేవుడుమాత్రం? శ్రీధర్ వేలిమీదే తొడుక్కున్నాడు తిరపతిదేవుడిని ఆనాటికీ ఈనాటికీ కూడా.

చేతికొచ్చిన పదివేలతో రాధని తీసుకుని మద్రాసు రైలెక్కాడు శ్రీధర్.

మద్రాసులో రాధా ఎంటర్‌ప్రైజెస్సు, సినీ డిస్ట్రిబ్యూషన్ ఎక్సిబిషన్, ఫైనాన్సింగ్, ఎట్సెటరా అని బోర్డు కట్టాడు.

రాధని ఖరీదైన బజార్లలో అంతకంటె ఖరీదైన కార్లలో షికార్లు తిప్పాడు.

మోతుబరి ప్రొడ్యూసర్లకు పరిచయం చేశాడు. ఊపిరితిరగని డైరెక్టర్లకు పరిచయం చేశాడు. చిన్న చిన్న వేషాలతో ప్రారంభించింది రాధ.

కళామతల్లి సేవలో డైరెక్టర్లు ఏంఅడిగితే అది చెయ్యడానికి సిద్ధంఅయింది రాధ. గొప్పనర్తకిగా స్థిరపడింది. రాధ నృత్యంచెయ్యని సినిమా లేకుండా పోయింది.

రాధ తెరమీద కనుపించిన మూణ్ణిమిషాలా ప్రేక్షకులు కుప్పిగంతులు వేశారు. నానాబిరుదులూ యిచ్చారు. అన్నీ సంతోషంగా స్వీకరించింది రాధ.

ఒకే బంగాళాలో వుండేవారు రాధా, శ్రీధర్.

రాధ నర్తకి నటి అయింతర్వాత పెద్దయిల్లు కొంది. విమానంలాంటి కారుకొంది. శ్రీధర్‌ను పర్సనల్

సెక్రటరీ చేసింది. కొంతకాలం తర్వాత శ్రీధరే ఆ ఉద్యోగానికి నీళ్ళు వదులుతున్నాడు.

రాధకీ, డైరెక్టర్ రాజేష్‌కీ పెళ్ళని పేపర్లో చూసిన మర్నాడే ఆ పని చేశాడు.

'నిన్ను చూస్తూంటే నాకు జాలిగా వుంది శ్రీధర్! నామీద ఎన్నోఆశలు పెట్టుకున్నావ్ నువ్వు. అలాగే నామీద ఎన్నోకలలు కంటున్నాడు రాజేష్. నువ్వే చెప్పు. రాజేష్ పెద్దదర్శకుడు. ఫిలిం ఛేంబర్సుకి అధి పతిలాంటివాడు. అతణ్ణి చేసుకుంటే నాకింకా పెద్ద అవకాశాలు రావచ్చు. ఈ పరిస్థితిలో నువ్వుంటే ఏంచేసేవాడివి?'

శ్రీధర్ మూగగా చూశాడు. జీవితంలో మొదటి సారిగా బాగా హృదయం గాయపడిందప్పుడే!

'సినిమా బ్రతుకయిపోయింది నాది' అన్నాడు శ్రీధర్.

'బాధపడకు శ్రీధర్! నీకు డబ్బు కావాలంటే తీసికెళ్ళు. మీ మామయ్య కూతుర్ని చేసుకుని సుఖ పడు. నాలాగా క్షణం ఊపిరి సలపని దాంతో నీకేం సుఖం?' అంది రాధ.

'నీలో యింకా ఓ పిసరు ప్రేమ మిగిలివున్న ట్టుంది రాధా! ఈ సమయంలోనే మనం విడిపోవడం మంచిదికదూ' అన్నాడు శ్రీధర్.

'నువ్వు గొడవచెయ్యవని నాకు తెలుసు శ్రీధర్! నీ హృదయం వెన్నలాంటిది. ఈ రోజంతా నీతోనే గడపాలని నిశ్చయించుకున్నాను' అంది రాధ.

'రాధా! నువ్వు మరబొమ్మవైపోకు. ఎవరితోనో ఒకరితో స్థిరపడ్డానికే ప్రయత్నించు. ఆకాశం అందు కుందామనే ప్రయాణంలోవుంటే ఎక్కడున్నావో ఏమయ్యావో తెలీకముందే మరింక ఉండకుండా పోతావు' అనిచెప్పి రాధతో సంబంధం తెంచుకుని వచ్చేశాడు శ్రీధర్.

చేతిలో చిల్లిగవ్వకూడా లేదు. రాధ యిచ్చిన డబ్బు ఆమెకే ఇచ్చేశాడు—ఎక్కడో యింకా ఆత్మ గౌరవం మిగిలి వుండడంవల్ల.

సంవత్సరంపాటు బికారిగా తిరిగాడు.

నానారకాల ఉద్యోగాలు చేశాడు.

హోటల్లో, రైల్వేప్లాటు ఫారంమీదా, బస్టాండ్ల దగ్గరా......

ఓ రోజు రైల్వేప్లాట్‌ఫాం మీద వుండగానే మావయ్య కనబడ్డాడు.

'ఏరా, మేం చచ్చిపోయామనుకున్నావ్‌రా నువ్వు?' అని బాధపడ్డాడు.

ఆశ్చర్యపడ్డాడు శ్రీధర్.

తను జీవితంతో ఆటలాడాడు.

జీవితాన్ని బేరం పెట్టాడు.

పూర్తిగా ఓడిపోయాడు.

కుటుంబాన్ని మట్టిపాలు చేశాడు.

కన్నతల్లికీ తండ్రికీ కడుపులో మంటలు పెట్టాడు. అయినా తన గురించి బాధపడుతున్నాడు తన మేనమామ!

'శ్రీధర్! మీ అమ్మా నాన్నా సంవత్సరంక్రితమే ఒకళ్ల తర్వాత ఒకళ్ళు పోయార్రా! నీ ఆస్తి తెగ నమ్మితేకాని నీ చెల్లెలి పెళ్లికాలేదు. నువ్విలా గాలికి ధూళికి పట్టిపోయావనే బెంగతోనే కదురా మీఅమ్మా నాన్నా అర్ధాంతరపు చావుపాలైంది!' అని వాపోయా డాయన.

శ్రీధర్ మనసు కదలిపోయింది.

'ఎందుకిలా తగలడ్డావ్? వంశప్రతిష్ఠ ఎందుకు మట్టిలో కలపావ్? నీలాంటివాడు బ్రతికివుండడం కంటే చావడం మంచిది'అని మేనమామ మందలించి వుంటే హాయిగా వుండేది.

కాని ఆ ఆత్మీయత, ఆప్యాయత శ్రీధర్‌ను సిగ్గులోనూ బాధలోనూ ముంచివేశాయి.

'సరోజ బాగావుందా మావయ్యా?'అని అడి గాడు మరేం అడగాలో తెలీక.

'బాగుంది, బాలవితంతువులా' అన్నాడాయన కళ్లనీళ్లు పెట్టుకుని.

'ఏం మావయ్యా, అంతఘోరం ఎలా జరి గింది? ఏద్దైనా ప్రమాదమా?' అలాంటివేమీ కాదన్నట్టు తలవూపి శ్రీధర్ భుజంమీద చెయ్‌వేసి రహస్యం చెబుతున్నట్లు చెప్పాడు—

'నామాట విను శ్రీధర్! నీకోసం అమ్మాయి తపించిపోతూందిరా. నిన్నుతప్ప మరెవర్నీ చేసుకోనని మొండిపట్టు పట్టింది...కన్నవాళ్లకడుపు తీపి నీకు తెలీదురా. దాని జీవితమలా అయిందని మీ అత్తయ్యా నేనూ ఎంత కుళ్లిపోతున్నామో తెలుసా?...'

'సరోజను పెళ్లి చేసుకోమంటున్నావా మావయ్యా? అన్నీ తెలిసి? నేను బికారివాడ్ని. చదువు లేదు, డబ్బులేదు ..'

'అన్నీ వస్తాయ్‌రా. వాటితోనే పుట్టామా పుట్టేప్పుడు. ప్రాణంపోసినవాడు బతికే దారీ చూపి స్తాడు'అని ధైర్యంచెప్పి ఇంటికి తీసుకువెళ్లాడు.

సరోజని చేసుకుని స్థిరపడదామనుకున్నాడు శ్రీధర్. వ్యవసాయం చేసుకోమని మావయ్య పొలం అప్పచెప్పాడు. కాని శ్రీధర్ పల్లెటూళ్లో వ్యవసాయం చేస్తూ ఉండలేకపోయాడు. ఊహకైనా సరిగా అందని ఎత్తులు సాధించాలనే తపన యింకా పీకుతూనేవుంది.

మేనమావ రాజధాని వెళ్లాడు. డబ్బు ధార పోశాడు. అల్లుడికి ఎలక్ట్రిసిటీ ఆఫీసులో వుద్యోగం వేయించాడు.

పల్లెటూర్లో పేడవాసనా, గడ్డివాసనా తప్పించు కోవడానికి ఏ వుద్యోగం ఐనా వకటేలే అని సంబర పడ్డాడు శ్రీధర్.

అతనే సర్వస్వంగా చూసుకునే సరోజ, అడపా దడపా డబ్బు సాయంచేసే మావయ్య.

శ్రీధర్ జీవితం అయిదు సంవత్సరాలపాటు సాఫీగా సాగిపోయింది.

ఈ అయిదు సంవత్సరాల్లోగా పుట్టిన రాముడు (తండ్రిపేరే పెట్టాడు వాడికి) యిప్పుడెనిమిదేళ్ల వాడయాడు. వాడి తర్వాత పుట్టిన సుధ యిప్పుడు ఆరేళ్లదయింది. రాముడు మూడో క్లాసులోనూ, సుధ ఒకట్లోనూ వున్నారు.

అయిదు సంవత్సరాల తర్వాత మావయ్య హఠాత్తుగా గుండె జబ్బుతో పోయాడు.

ఆయన పోయిన తర్వాత సంవత్సరంకంటె ఎక్కువ బతకలేదు అత్తయ్య.

ఆ యిద్దరూ పోవడంతో పల్లెటూళ్లోవున్న ఆధారం తెగిపోయింది శ్రీధర్ జీవితంలో.

నిన్నటి వుదయంలాగానే నేటి వుదయం, నిన్నటి సాయంత్రంలాగానే నేటి సాయంత్రం— జీవితం చప్పగా తయారయింది.

చుట్టు ప్రక్కలంతా చీకటి ముసురుకుంది. తల ఎత్తిపైకి చూశాడు శ్రీధర్. ఆకాశంలో నక్ష త్రాలు మినుకు మినుకు మంటున్నాయి.

'ఎనిమిది గంటలయ్యుంటుందేమో!' అను కున్నాడు.

ఏడున్నరకే రావలిసిన ఎక్స్‌ప్రెస్ యింకారాలేదు.

ఎందుకోసం బతకడం తను?

ఇప్పుడు యిటొచ్చే బండిక్రింద తలపెడ్తే ఏంపోయింది? తను పోయినంతలో ఎవరికి నష్టం?

తను ఎందుకు చచ్చిపోవాలి? అనేందుకు వర సగా కారణాలు లెక్కపెట్టుకున్నాడు శ్రీధర్.

చదువులో పైకిరాలేదు తను.

నాటకాలలోనూ అడుగులో వుండిపోయాడు.

ప్రేమించి భంగపడ్డాడు.

స్నేహితు లనుకునేవాళ్లచేతనే మోసగింపబడ్డాడు.

తన మూలాన అంతులేని క్షోభకు గురై, కాని వయసులో కన్నుమూసారు తల్లి తండ్రి.

ముందు జీవితంలోనన్నా తను సుఖపడతాడనే నమ్మకంలేదు.

చిన్ననాడు తను ఊహించుకున్న బంగళా కట్టించలేదు. దాంట్లో పెద్దతోటవేసి ఆ తోటలో పూలమధ్య విశ్రాంతి తీసుకోలేదు.

కార్లమీద హాయిగా తిరగలేదు.

మనసుకు నచ్చింది తినలేదు!

మనసుపోయిన బట్ట కట్టలేదు.

తనకున్నదేమిటి?

ఓ గుమాస్తా ఉద్యోగం!

తనుపోతే ఎన్నాళ్లుగానో ప్రమోషన్ లేకుండా పడున్న గౌరీపతికన్నా వొస్తుంది ఆ ఉద్యోగం.

నాలుగు సాధారణమైన నూలు చొక్కాలు, పంట్లాములు — వీటికోసం బ్రతకాల్సినంత పనిలేదు. ఎప్పుడూ కాళీగావుండే ట్రంకుపెట్టె. దాన్ని పాత యిత్తడి సామాన్లు కొనేవాడికమ్మిపారేస్తుంది సరోజ. అలాపారేస్తే ఓ అయిదు రూపాయలన్నావస్తాయ్.

తన పాత పడిపోయిన అశోకాపెన్ను. రాముడికి చిన్నప్పట్నుంచి దానిమీద మనసే. వాడన్నా తీసుకుంటాడు దాన్ని.

తనకో పెళ్లాం వుంది. అయితే పెళ్లాం చచ్చిపోతున్న వాళ్లలో చాలామందికి వుంది. పెళ్లాం ఎవరికి పడితే వాళ్లకు వుంటుంది. బ్రతకమనేందుకు పెళ్లాం వుండడం ఓ పెద్దకారణం కాదు.

చచ్చిపోయేందుకు—చచ్చిపోకుండా వుండేందుకు గల కారణాలు తేల్చగా, చచ్చిపోయేందుకుగల కారణాలే ఎక్కువగా వున్నయ్.

తను బ్రతకడానికి—

తన ఆఫీసులో సూపర్నెంటు కావాలి. అప్పుడు తనకి పదొందలు జీతం వస్తుంది. ఉండడానికి బంగళా వస్తుంది. దానిముందు చిన్నతోట తప్పకుండా వుంటుంది. గవర్నమెంటు యిచ్చే జీపు స్వంతానిక్కూడా వాడుకోవచ్చు. కాదనరు ఎవ్వరూ!

టెర్లిన్, ట్వీడు, డెకరాన్, వులెన్ సూట్లు కుట్టించుకోవచ్చు.

దర్జాగా పైపు కాల్చవచ్చు.

కాని యివేమీ తనకు లేవు—రావు. అందువలన తను చచ్చిపోవాలి—చచ్చిపోవాలి. తప్పదు. ఈ ఆలోచనలు, యిలాంటివి మరికొన్ని అస్తవ్యస్తంగా పరిగెట్టాయ్ శ్రీధర్ మనసులో.

రైలుపట్టాలమీదే కూర్చుని వున్నాడు. ఏ క్షణంలోనైనా రైలు రావచ్చు. అది వెళ్లడంతో తనూ వెళ్లిపోతాడు.

పట్టాలు దడదడలాడుతున్నాయి. తేలుకుట్టినట్టు చురుక్‌మని లేచినిలబడ్డాడు. ఇంజన్ యాభై గజాలదూరంలో వుంది దడదడలాడుతూ, బొూయ్‌మని అరుస్తూ.

బొమ్మలా నిలబడ్డాడు శ్రీధర్. ఆక్కుండా వెళ్లిపోయింది మెయిలు.

శాశ్వత నిద్రనుండి రెండు సెకన్లదూరంలో తప్పిపోయాడు.

ఆ చక్రాల క్రిందపడి గుర్తుతెలీకుండా యాభై గజాలదూరంలో తల పడి, మొండెం వికృతంగా ఎర్రగా కారిన రక్తంతో తడిసి, మాంసం ముద్దలు భయంకరంగా వెదజల్లబడివుండే దృశ్యం తలుచుకుని శ్రీధర్ శరీరం చల్లబడిపోయింది. పరుగులాంటి నడకతో యింటిదారిపట్టాడు.

సరోజ యింటి దగ్గరముందు గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తోంది.

రాముడు, సుధ చాపమీద పడుకుని నిద్రపోతున్నారు. రాముడి కాళ్లు సుధ మెడమీద వేసి వున్నాయి. సుధ జుట్టు చెదరిపోయి అందంగా చాపంతా పరుచుకువుంది. ఇద్దరి మొహాలూ ప్రశాంతంగా చల్లగా వున్నాయి. వాళ్లిద్దరిమధ్య ఒక చిన్న తాటాకు బుట్టవుంది. అందులో సుధ తన సంసారానికి కావలిసిన లక్కపిడతలు వేసుకుని వుంది. అందులో సగం బొమ్మలు విరిగి వికారంగా వున్నాయి.

'ఇంత లేటెందుకయిందండీ' అని వంటింట్లోకి వెళ్లింది సరోజ.

పిల్లలిద్దరి పక్కనా చాపమీద కూర్చున్నాడు శ్రీధర్. సంసారపు బుట్టమీదవున్న సుధ చెయ్యి మెల్లగా తొలిగించి మూతతీసి చాపమీద వుంచాడు.

అందులో పిల్లలిద్దరి ఆస్తివుంది. వాళ్ల సంతోషానికి గర్వానికి కారణం—ఆ ఆస్తి. వాళ్లని సంతృప్తిగా బ్రతికిస్తున్న ఆస్తి.

అందులో వున్నవి ఒక్కొక్కటీ బయటికి తీశాడు శ్రీధర్.

పదిపైసలబిళ్ల ఒకటి—నయాపైస ఒకటి—ఒక ప్లాస్టిక్‌బాతు—ఏడాదిక్రితం కొన్న బినాకాటూత్ పేస్టుతోపాటు వచ్చింది. పార్క్ డేవిస్‌కంపెనీ ప్లాస్టిక్ చెంచా ఒకటి—రెండు పెన్సిళ్లు.

అసలు విలువలేని ఆ వస్తువులు, తన పిల్లలకు విలువలేనివి. వాళ నెంతో సుఖంగా బ్రతకనిస్తున్నాయి. హాయిగా నిర్మలంగా నిద్రపోనిస్తున్నాయి.

నాలుగు డజన్ల బంగారు ఉంగరాలు యిచ్చినా వీళ్లకి యింత సంతోషం కలుగుతుందా అని?

తనవో!, గొంతెమ్మకోరికలు. అవన్నీ తీరితే మాత్రం తను సుఖంగా వుంటాడా. చిన్నప్పట్నుంచీ బయట సంతృప్తికోసం వెతికాడేగాని అది మనసులోనే పుట్టాలని తెలుసుకోలేకపోయాడు.

తన ఎదుట నిద్రిస్తున్న పిల్లలిద్దరూ రెండు బంగారుబొమ్మల్లా కనిపించారు శ్రీధర్‌కు.

'సరోజా...సరోజా...'అంటూ అరిచాడు.

'వస్తున్నానండీ'అని వచ్చింది సరోజ.

'వీళ్లిద్దరూ నా ఆస్తి సరోజా, నాకు దరిద్రం లేదు, నిరాశలేదు, చావాలనిలేదు సరోజా...'

'బాగుంది వరస'అని మూతి తిప్పుకుంటూ లోపలికి వెళ్లిపోయింది ఆమె.

శ్రీధర్‌కు కళ్లు చెమర్చినసంగతి ఆమె చూడనేలేదు.

'ఆకలేస్తోందా...ఆనందంతో కడుపు నిండిపోయిందా'అని అరిచింది లోపల్నుంచి.

ఆశకీ, నిరాశకీ, సుఖానికీ, దుఃఖానికీ మధ్య వున్న పలుచనిపొరని శ్రీధర్ చీల్చిబయటపడ్డసంగతి ఆమెకెలా తెలుస్తుంది?

చచ్చిపోవాలనుకునే ప్రతిమనిషీ బ్రతికేందుకు కారణాలకోసం నీట్లోంచి బయటపడ్డ చేపలా కొట్టుకుంటాడనే సంగతి శ్రీధర్‌కి తెలీదు.

కొందరికి దొరికేవి గడ్డిపరకల్లాంటి కారణాలు. మరికొందరికి దొరికేవి నిజమైన కారణాలు.

వీటిలో ఏదో దొరికింది శ్రీధర్‌కు. అది ఏదో అతనిక్కూడా తెలీదేమో......

జానపద భాష

శ్రీమతి నాయని కృష్ణకుమారి

'వేమ' భారతిలో ప్రచురితమైన 'పందొమ్మిదవ శతాబ్దంనాటి వ్యావహారిక భాషావిశేషాలు' అన్న వ్యాసం నన్నీ రచనకు పురికొలుపుతున్నది.

అందులో వ్యాసకర్త, జానపద రచనయైన కుమార రాముని కథను, 19వ శతాబ్దపు పూర్వార్థంలో రచింపబడ్డ వ్యావహారిక కావ్యంగా పేర్కొన్నారు—ఆ అభిప్రాయం వ్యాసకర్తదేకాక, కుమార రాముని కథకు పీఠిక రచించిన శ్రీ నేలటూరి వెంకట రమణయ్యగారిదైనట్లు అథస్సూచికలో సూచించారు.

శ్రీ వెంకటరమణయ్యగారైనా ఈ కథలోని భాష 19వ శతాబ్దానికి చెందిందని నిర్ణయించడానికి బలమైన కారణాలు చెప్పలేదు—ఆయన చెప్పిన కారణాలివీ !—(1) ఇందులో పార్సీమాటలు బహుళంగా ఉండడం. అంతేకాక ఇంగ్లీషుపదాలూ ఉండడం; కాబట్టి ఆంధ్రభాషలో పార్సీప్రాబల్యం సన్నగిల్లి ఆంగ్ల సంపర్కం ఎక్కువవుతున్న కాలంలో ఇది రచింపబడి ఉండవచ్చు. (2) ఇందులో భాషా, మెకంజీ కైఫీయతుల్లో భాషా ఇంచు మించు ఒకటే పోలికలు కలిగి వున్నాయి—దీన్నిబటి ఈ కథారచనాకాలం, పై విషయాలతో సమన్వయించే 19వ శతాబానికి చెంది ఉండవచ్చు.

శ్రీ వెంకటరమణయ్యగారే ప్రసంగాంతరాన చెప్పినట్లుగా, జానపదగాథలకు ఒక రచనాకాలమంటూ నిర్ణయించడం కష్టం. ఏదో ఒక ఉద్రిక్తమైన వాతావరణంలో ఒక సంఘటన జరిగి, అది జనసామాన్యాన్ని ప్రక్కదలించినపుడు, అదే జానపదులనోట పాటగా, కథగా వెలువడుతోంది— దానిని ఎవడో ఒక కవి, కాగితాలమీదనో, ఆకులమీదనో వ్రాయడు. ఒక్కడు వ్రాసిన దాన్ని పదిమంచి చదివి కంఠస్థం చేసి వెలయించడమనేది లేనేలేదు —ఆప్తి కలవాళ్ళూ కవితాత్మకలవాళ్ళూ, జానపదగేయ గాథావిష్కారాన్ని వృత్తిగా కలవాళ్ళూ, ఎవరికి తోచినట్లు వాళ్ళు, ఆ సంఘటనకు రూపుకట్టించగా, అటువంటి రూపాలు దేశవ్యాప్తంగా ఎన్నో ఉండడానికి అవకాశం ఉంది.

నేను, జానపదగేయ గాథలమీద, పరిశోధన చేస్తూ కుమార రాముడి కథను సేకరించడం జరిగింది. నాలుగైదుపాఠాలు వేరువేరు గాయకుల ముఖతా విని వ్రాసుకున్నాను. ఈ నాలుగైదు రూపాలకూ, ఒకదానితో ఒకటికి పోలికలు లేవు, మద్రాసు ప్రభుత్వం వారు అచ్చువేయించిన ప్రతితోనూ పోలికలు లేవు. దేని దారి దానిదే. కొన్నిటిలో, అప్రధానపాత్రల పేర్లు కూడా మారడం సంభవించింది. సంఘటనల మార్పు ఎంతో ఉంది. కాకపోతే ప్రధాన కథాబీజం మాత్రం మారలేదు—వీటిల్లో భాషకూడా పాడే మనిషినిబట్టి ప్రాంతాన్నిబట్టి మార్పుచెందుతూ ఉంటుంది. అందుకని 14వ శతాబ్దప్రాంతంలో జరిగి ఉంటుందనుకున్న ఈ కథకు, మద్రాసువారు అచ్చువేయించిన కథ ఎన్నో రూపాంతరమో ఎలా చెప్పడం?— మెకంజీ కైఫీయతుల వచనాన్నిబట్టి దీనికాలాన్ని నిర్ణయించడం బాగానే ఉంది కాని, ఆ కైఫీయతుల్లో ఉన్న వచనానికి ఆ రూపం రావడానికి ప్రారంభం ఏకాలాన జరిగింది? మెకంజీకి ముందున్న వచన స్వరూప స్వభావాలేమిటి? ఇవన్నీ నిర్ణయంగా ఒక రూపాన్ని పొందగలిగినప్పుడే, అప్పటిభాషలాగే ఉందనుకున్న 'కుమార రాముని' భాషకూడా ఒక కాలానికి చెందిందిగా నిర్ణయించడానికి వీలుపడుతుంది. అయినా అవిదిత కర్తృకాలూ, అజ్ఞాతకాలికాలూ అయిన జానపదగాథల్ల కాల్ల

నిర్ణయమూ, రచయితృనిర్ణయమూ చెయ్యబూను కోవడం, ఫలరహితమైన పని—

ఇక జానపదభాషలోని మారుమూలపదాలకు అర్థ నిర్ణయం చెయ్యడం అంత సులువైన పనికాదు. దానికి కొంత ఓపికా, కుతూహలమూ, పట్టుదలా, ఎక్కువ మోతాదులో ఉండాల్సిన అవసరం ఉంది.

ఈ వ్యాసకర్త అర్థం సరిగా తెలీడంలేదని యిచ్చిన పదాలు కొన్ని నేను పరిశోధనావశాన సేకరించి పెట్టుకున్న కోశంలో ఉన్నయ్. అందువల్ల ఆ వివరణలు ఇక్కడ యిస్తున్నాను.

1. హస్తముఖ వెల్చుకుని—'వెలుచు' అన్న క్రియకు 'కడుగు' అనే అర్థంకూడా ఉంది. వెల్, వెణ్ అనే రెండు ద్రావిడ ధాతురూపాలకూ, తెల్లని, శుభ్రమైన, ప్రకాశమానమైన, మిరుమిట్లుగొలిపే అనే అర్థచ్ఛాయలున్నయ్. వాటినుండే,

తమిళంలో—వెళిక్కమ్ —దీపము
వెళిప్పు —నిర్మలమైన
వెళ్ళి —వెండి
విళక్కు —పరిశుభ్రముచేయు, కడుగు, తరిమెణ పట్టు

వంటి అనేక పదా లుద్భవించాయి.

మళయాళంలో—వెళి, వెళివు— శుభ్రత, దీపముకాంతి,
వెళుప్పిక్క—తెల్లగాచేయు, ఉతుకు, కడుగు—

కన్నడంలో — బెళుపు — ప్రకాశము, కాంతి, తెల్లదనము.
బెళ, బిళ, బెళె, బెళగు —కాంతి, తెల్లదనము—

ఈ క్రియ ఈ భాషలో మాత్రం, శుభ్రత, నైర్మల్యము, కడుగు, సానపట్టు, వంటి అర్థాల లోనికి రాలేదు.

కోలామీలో—వెళ్క — నీళ్ళతో కడుగు; శుభ్రము చేయు
వెళ్ఫ — తెల్లదనం

తెలుగులో—వెలుగు, వెల్ల, వెల్లన, వెలవెల, వెండి, బెళుకు, వంటి తెల్లదనాన్నీ కాంతినీ తెలియజేసే పదాలేకాక;

వెలుచు, వెలచు—శుభ్రంచేయు, కడుగు, అనే అర్థంకల పదాలూ ఉద్భవించాయి—

ఇక్కడ, 'వెలుచు' అన్న పదానికి, శుభ్రం చేయడమనే సామాన్యార్థంకాక, నీళ్ళతో కడిగి శుభ్రం చేయడమనే ప్రత్యేకార్థం ఉన్నది.

'వాన వెలిసింది'; 'గుడ్డ వెలిసింది'—అన్న ప్రయోగాల్లో ఉన్న రూపంకూడా ఇదే. ఇక్కడ ఆకాశానికి పట్టిన మబ్బులు విచ్చి, నిర్మలం కావడం; గుడ్డకు పట్టిన రంగు కరిగిపోయి తెల్లగా కావడం, పర్యవసానం.

2. చాలు రావులు— ఇవి చలివేంద్రలేమోనని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు; కాని, కాదు. ఈ పదానికి సాలురావులు, సోలురావులు అనే రూపాంతరాలున్నయ్. ఈ సమాసానికి వరసగా తీర్చిన రావిచెట్లు అనే అర్థం చెప్పుకోవడానికి అవకాశముంది—కాని, యిక్కడ 'చాలు' అన్నపదానికి 'వరుస' కాక మరో ప్రత్యేకార్థం ఉన్నది—ద్రావిడ భాషల్లో దీనికున్న అర్థచ్ఛాయలు గమనింపతగ్గవి.

కన్నడంలో — సాల్, సాలు — కట్టుబడి ఉండు, to be bound to, to be obliged.

కోలామిలో—చాల్వ్—సలహా, A piece of advise.

'తోడా'లో — సాల్మ — Assets and liabilities.

తెలుగులో — చాలు — తీరు, మర్యాద, Back ground పిలూ చాలూ — Assets and liabilities -

ఇటువంటి ఈ పదచరిత్రనుబట్టి, 'చాలు రావుల'లోని 'చాలు'లో ఈ అర్థచ్ఛాయ నశించిపోకుండా ఉన్నదనుకోవచ్చును. అప్పుడు, చాలు రావులు, సాలు రావులు, అనగా ఊరిపెద్దలు, గ్రామస్థులలో పోట్లాటలు జరిగినప్పుడు, సలహాల నివ్వడానికి

ఆశ్రయించే రావి చెట్లు అని అర్థం. ఇక్కడ 'చెట్టు' తొలుత తొలుత ప్రధానమైనదైనా, తదుపరి అది గౌణమై, ఆ చెట్టుక్రింది, 'రచ్చబండ'కా అర్థం సంక్రమించింది. కాబట్టి సాలురావులు అనగా, తగవు తీర్చే రచ్చబండలు అని అర్థం.

3. చెఱువులు గోపి—(క్రో) గోపి—అనగా త్రవ్వి అన్న అర్థం కనపడుతున్నదిక్కడ. ఈ క్రియా రూపం జానపదసాహిత్యంలో కనిపించి మనకు విలువైన సమాచారాన్నే అందిస్తున్నదనవచ్చు. ద్రావిడ ధాతువుల్లో దీనికి సంబంధించిన ధాతురూపం ఇలా ఉంది—

తమిళంలో—కుఴి—గొయ్యి, భూవివరము.

మళయాళంలో...కుయ్, కుప్— గొయ్యి—
కొప్పం—ఏనుగుల్నిపట్టే పెద్దగొయ్యి.

తెలుగులో—గొప్ప—పాదు; ఆలవాలము.

ఈ 'గొప్పే' 'గోపు'అన్న క్రియకు నామ రూపంగా కనిపిస్తున్నది. కాబట్టి గోపు, కోపు అనే రూపాలు ఒకప్పుడు బాగా వాడుకలో ఉండి ఉండవచ్చును. ద్రావిడ ధాతువు—

కుఴ్—'క్రో'గా మారి క్రోపు— కోపు— గోపు—అనే
రూప పరిణామాన్ని చెందడానికి వీలున్నది—

ఈ 'గోపు',

అనే క్రియకు 'త్రవ్వు'అనే అర్థం ఉండడం, అది జానపద సాహిత్యంలో కనిపించడం, చాలా విలువైన సమాచారమే.

4 కొత్తులావి పంజులు — ఈ పదబంధం విచిత్రమైనదే. ఇందులో 'పంజులు'అన్న పదానికి రూఢమైన అర్థం ఉన్నది.

పంజు—ఒక దినుసు దివిటీ—శ. ర.
—A Torch, a sort of fire work—బ్రౌన్.
కన్నడంలో—మండుతున్న కొరివి, కాగడా—

కుమార రాముని కథలోని సందర్భాన్నిబట్టి దీనికి 'కాగడా'అన్న అర్థమే సరిపోతున్నది.

శ్రీరాముల పర్వతమ్ము
భామ తాను కదిలింది
కొమ్మకొమ్మ దివిటీలు
కొత్తులావి పంజులు
రంభ నాటక స్త్రీలేమి
సకలవిధాల సంబ్రాల
భామ తాను గదిలేను॥ తం॥

పైవి కొమ్మదివిటీలు, క్రిందివి 'కొత్తుల పంజులు' 'కొత్తుల'అన్న పదానికి నిర్ణయించి అర్థం చెప్పడానికి కొంత జంకుతున్నాను. ఒక్క ఊహమాత్రం ఉంది. దాని యుక్తాయుక్తాలు విజ్ఞులకు విడిచిపెడుతున్నాను.

తెలుగులో—కొఱు—ఇనపచువ్వ, శూలం—లేదా సూదిగా
చెక్కిన కమ్మి—

'కొఱతవేయడం' ఈ మాటవల్లనే ఉద్భవించింది. ఇతర ద్రావిడభాషల్లో దీని ధాతురూపం ఇలా ఉంది—

తమిళంలో కొఱు—A Bar of Metal.
మళయాళంలో కొఱు—నాగలిమొన Metal Bar.
తుళులో కొఱు—A Bar of Metal.
తెలుగులో కొఱులు—
కొఱ్తుల—(Genative) కొత్తుల—

కొత్తుల పంజులు — ఇనుపచువ్వల కొసల కీలించిన పంజులు అనే అర్థంలో ఈ పదబంధం ఏర్పడడానికి వీలుంది. పైన పేర్కొన్న కొమ్మ దివిటీలనుండి భిన్నంగా, ఈ 'కొత్తుల పంజులు' పేర్కొనడం జరిగి ఉండవచ్చును.

5. కావు – దీని సరియైన అర్థం పాతరకాదు. కావు—A well or pit అని బ్రౌను. సాధారణంగా, పలకబారిన కాయల్ని పండ్లుగా మార్చడంకోసం గోతుల్లోఉంచి, గాలితగలకుండా ఉంచడం కద్దు. అలా వెయ్యడాన్ని 'కావు వెయ్యడం' అంటారు. అలాగే 'ధాన్యపు కావులూ' ఉన్నయ్. అవే పాతరలు—ఇక్కడ కథలో, కుమార రాముడు,

'నేలను బోను గావించి
పోలిక రాముని

కావులో వేయించి

పైన తలుపు వేయించెను' అన్న సందర్భాన్ని బట్టి చూడగా, ఇది కేవలం 'గొయ్యి'గా మాత్రమే సాక్షాత్కరిస్తున్నది.

6. కూత వేటు నేల:— అనగా కూతపెట్టే స్థలం కాదు. ఎవరైనా గట్టిగా కేకవేస్తే విన పడేంత దూరం అని అర్థం. నేల అన్నదానికి 'దూరం' అనే అర్థంలో కావ్యప్రయోగాలుకూడా ఉన్నయ్.

7. కుప్పటము: — దీనికి 'ఒడలు' అన్న అర్థం లేదు. ఇతర ద్రావిడ భాషల్లో దీనికి సంబంధించిన ధాతువుల్ని పరిశీలించగా ఇట్లా ఉంది—

తమిళంలో కుప్పుఌ—to leap or spiing across.
కన్నడంలో కుప్—to leap over.
కోలామీలో కుప్—Broad jumping.
తోడాలో కుప్—to leap.
తెలుగులో కుప్పించు—ఎగిరిదూకు; కుప్పిగంతులు—etc.

పై అర్థచ్ఛాయల్నిబట్టి చూడగా, ఎగురు గెంతు, రెట్టింపు వేగంతో దూకు, ఒక్కసారిగా దూకు, అనే అర్థం కనబడుతున్నది. అందుకని ఇక్కడ 'కుప్పటము ఎగసెను' అనగా, 'శరీరము ఎగిరెను' అని కాక 'కుప్పించి దూకెను' అనే అర్థం సరిపోవడానికి వీలుంది.

8. జోడాలవారు:—వార్తాహరులు. ఈ వార్తాహరులలో ఒక విశిష్టత ఉన్నది. ఒకడు ఒక చోట నుండి ప్రయాణం చివరివరకూ చేసి, తనకిచ్చిన వార్తాహరణోద్యోగాన్ని ముగించడం కాదు—వీళ్ళు ఒక స్థలాన్నుండి, ఉద్దిష్ట స్థలంవరకూ అంచె లంచెలుగా ఉండే వార్తాహరులు. ఒకరందించిన వార్త మరొకరందుకుని గమ్యంవరకూ, దాన్ని అదే పద్ధతిలో ప్రయాణింపచేసే విధి వారిది. అనగా వారిలో ఒకరి పని మరొకరితో జోడించడం జరుగుతున్నది. జోడించు—అనగా 'జతచేయు'అనీ, అందుండి, 'కలుపు'అనీ అర్థం తీయడానికి వీలుంది. 'చేతులు జోడించడం', 'రెండు దుప్పట్లు జోడించడం', అటువంటిదే. అలాగే ఇక్కడ జోడాలవారు అన్న పదానికీ అదే అర్థం అన్వయించడానికి వీలుందనుకుంటాను. అంతేకాని, ఈ వార్తాహరులు ఒకేచోటునుండి జంటలు జంటలుగా కదిలేవాళ్లని అర్థంకాదు. వీళ్ల జతలు జతలుగా తిరిగేవాళ్లుకారు.

9. తనగాము—అనగా పెద్దతొట్టి అనికాక, తోలుతో కుట్టి, నీళ్ల మోయడానికి ఉపయోగించే పెద్దతిత్తి అని అర్థం—

విల్లెవిరాలు, నిరుకు, మోయమతి—ఈ పదాల పదప్రత్యయ విభాగమేమిటో అంతుపట్టడంలేదు. ఇవి అన్యదేశ్యాలు కావచ్చును.

జానపదభాష అర్థం చేసుకోవడం కష్టమే. అక్కడి మాటలకు సందర్భానుసారంగా ఏదో ఒక అర్థం చెప్పుకోవాలనే తొందర తగ్గించుకుని, కొంత ఆలోచనకు తావివ్వడం, పూర్వాపరాలను ఓపిగ్గా పరిశీలించడం, అలవాటు చేసుకుంటే ఫలితాలు తృప్తికరంగా ఉంటాయి.

కలగూరగంప :

వ్యాకరణములు - వాని భేదములు

వ్యాకరించునది వ్యాకరణము. అనగా విభజించునది. వాక్యరూపముననున్న యఖండభాషను పదములుగను, పదములను ప్రకృతి ప్రత్యయములుగను, వానిని వర్ణములుగను అనేకరీతుల విభజించు నిర్దుష్టపద రూపకశాస్త్రము వ్యాకరణము. అఖండముగానున్న విషయమును ఖండఖండములుగానే గ్రహించుట మానవునకు సులభము, ఆచరణయోగ్యము. 'We live in parts and we live in division' అన్న Emerson భావ మిదియే.

భారతదేశమునకు చాల ప్రాచీన కాలము నుండియు అసంఖ్యాకకములగు వ్యాకరణములు వెలసినవి. సంహితా రూపముననున్న వేదములను సుస్వర యుక్తముగా జదువుటకు పదపాఠములు తయారు చేయవలసి వచ్చెను. ఆ సందర్భమున వ్యాకరణము లవతరించెను. పదముల సుస్పష్టోచ్చారణమునకు వర్ణనిర్ణయము కావలసి వచ్చెను. ఇట్టి ప్రాచీన వ్యాకరణములే ప్రాతిశాఖ్యలు. ఒక్కొక్కవేదమున కొక్కొక్క ప్రాతిశాఖ్య వెలసెను. ఇట్టిస్థితిలో మానవమేధకు చెరగని శాశ్వతపు నిదర్శన మా యనునట్లు అపార మేధాసంపన్నుడగు పాణిని లౌకికాలౌకికసంస్కృతములకు రెంటికి సరిపడునట్లు నిశిత పారిభాషా నైపుణ్యముతో పాణినీయము (అష్టాధ్యాయిని) వెలయించెను. ఇదియేగాక కాతంత్ర సారస్వతాది చిన్న వ్యాకరణములు లౌకిక సంస్కృతమునకు వెలసినవి. వీనిలో 'అష్టాధ్యాయి' యందుగల పారిభాషిక క్లిష్టత యుండదు. ఇట్లు భాషాస్థితిని వర్ణించు వ్యాకరణములకు వర్ణనాత్మక వ్యాకరణము లనిపేరు. (Descriptive Grammars). ఇందు సంస్కృత భాషాక్రమపరిణామముకాక నప్పటికి పరిణతమగు సిద్ధరూపములే గ్రాహ్యములు. ఇట్టి వ్యాకరణముల యొరవడినే తెలుఁగు వ్యాకరణములును వెలసినవి. వ్యాకరణ సంక్షిప్తత విషయములో తెలుఁగు వ్యాకరణములు కొంతవరకు ప్రాకృత వ్యాకరణములనుగూడ ననుసరించెను. మొత్తమువిూద భాషా, చారిత్రక రూప పరిణామప్రదర్శనముకాక నప్పటికి రూపొందిన భాషా స్వరూప వర్ణనా ప్రదర్శనమే లక్ష్యముగా తెలుఁగున వెలసిన వ్యాకరణములను వర్ణనాత్మక వ్యాకరణము లనదగును. వ్యాకరణ మెప్పుడును మూలభాషలలో వెలసిన పిమ్మటనే తచ్ఛాయలలో దేశభాషలకు వెలయుట సాంప్రదాయము. 'అష్టాధ్యాయీ జగన్మాతా, అమరకోశో జగత్పితా' యన్న ప్రశస్తినందుకొన్న సంస్కృతలాక్షణిక సృష్టి జరిగిన పిమ్మటనే తెలుఁగున వెలయుట నిప్పట్లు గమనార్హము.

ఆంధ్ర శబ్దచింతామణి, వికృతి వివేకము, అహోబల పండితీయము, బాల, ప్రౌఢ వ్యాకరణములు (త్రిలింగలక్షణశేషము) మున్నగునవి సాంప్రదాయిక పద్ధతిలో దెనుగున వెలసిన వర్ణనాత్మక వ్యాకరణములు. కేతన యాంధ్రభాషాభూషణము, కావ్యాలంకార చూడామణి, కవిలోక చింతామణి, ఇత్యాదులు స్వతంత్ర పద్ధతిలో వెలసిన లాక్షణిక గ్రంథములు. ఇవి యన్నియు వర్ణనాత్మకములే. కారణము వ్యాకరణము కూడ జంతు, వృక్షశాస్త్రములవలె నొక శాస్త్రము. (Descriptive Science). వర్ణనాత్మకమైనది.

కాలక్రమమున ఆంగ్లాది పాశ్చాత్య భాషా ప్రభావమువలన మన తెలుఁగు వైయాకరణులలోను పదములకొక మూలచరిత్ర యుండుననియు, నవి శాబ్దిక, ఆర్థికమునైన మార్పుల నొందునని, వాని పరిణామములను వర్ణించుచు, శాబ్దికపరిణామరీతుల వర్ణించునది చారిత్రక వ్యాకరణమనియు, అర్థవిపరి

ణామములను వర్ణించునది ఆర్థిక శబ్ద వివరిణామ వ్యాకరణమనియు (Semantics) భావింపజేసిరి. స్థూలముగా నీ రెంటిని చారిత్రక వ్యాకరణములే యనవచ్చును ఇందులకను గుణముగా వెలసిన గ్రంథములు గంటివారి ఆంధ్రభాషా వికాసము, కోరాడవారి సంధి, దివాకర్లవారి నన్నయ భారతము మొదలగునవి. ఆంధ్ర భాషావికాసమున 11 వ శతాబ్దపు తెనుగు అను నధ్యాయము, సంధి గ్రంథమున చారిత్రకముగా సంధి పుట్టుపూర్వోత్తరములు, నన్నయ భారతమున నన్నయనాటి భాషా విశేషములు అను ప్రకరణ మీా చారిత్రక వ్యాకరణ స్పర్శగల భాగములు. 'శాసనస్థ భాషా స్వరూపము' అను గ్రంథమును శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు వెలయింప జేయుటయు చారిత్రక వ్యాకరణమునకు మఱియొక లక్ష్యమే. (A Historical Grammar of Pre-Nannaya inscriptions, Dr. B. Ratha Krishna). నన్నయనాటి భాషకు గిడుగు సీతాపతిగారు, కోరాడవారు ఇంకను అనేక మంది పండితులు వివరణాత్మక రచనలు గావించిరి. ఇవియన్నియు నొక విధముగా చారిత్రక వ్యాకరణములే.

పదములకు చరిత్రయున్నట్లు, పదములకు మరికొన్ని భాషా పదములతో సంబంధ బాంధవ్యము లుండును. ఒక వ్యక్తి ఒక కుటుంబమునకు చెందునట్లే, భాషలును యేదోయొక కుటుంబమునకు చెందునుగాని ఒంటరిగ మనజాలవు. ఆ భాషకు తన కుటుంబములోని సోదరభాషలతో సారూప్య సాన్నిహిత్యములుండును. ఇట్టివానిని సూక్ష్మపరిశీలన మీాదనే భాషా శాస్త్రజ్ఞులు తెలిసికొనగలరు. సోదర భాషల తోడి తౌ(తు)లనాత్మక పరిశీలనమును Indo-European languages పట్ల పాశ్చాత్య భాషా శాస్త్రజ్ఞులు గావించిరి. వారే భారతీయ భాషలను కూడ వర్గీకరణము గావించిరి. 'ఉదార చరితానామ్తు వసుధైక కుటుంబవ్‌'. శాస్త్రజ్ఞులకు భాషా విషయికమగు నడ్డుగోడలుండవు గనుకనే కాల్డ్వెల్ ద్రావిడ భాషలకు తౌలనాత్మక పరిశీలనా గ్రంథమును వెలయింపజేసెను. ద్రావిడ భాషలగు తమిళము, కన్నడము, తెలుగు, మళయాళము ఇత్యాది భాషా సామ్య వైషమ్యములను నిరూపించుచు వ్రాయబడిన "A comparative grammar of Dravidian languages" అను గ్రంథము నాటికిని, నేటికిని ప్రామాణికమై సర్వపండితశిరోధార్యమై తనరారుచున్నది. ఇది మొదటితౌ(తు)లనాత్మక వ్యాకరణము. దీని యాధారముగనే ఆంధ్రభాషా వికాసము మున్నగు గ్రంథములు వెలసినవి.

భాషా స్వరూపమును వర్ణనాత్మక వ్యాకరణములు యధోచితముగా వర్ణించి చెప్పును. కాని కొన్ని వ్యాకరణములు ఇవి అసాధు శబ్దములని, పరిహరణీయములని, శిష్టజనవ్యవహారమునందున్న వానినే ఖండించుటయు గలదు. ఇట్లు దోషముల నెత్తి చూపుచు ప్రయోగములందున్న శబ్దములనే పరిహరించు వ్యాకరణములు కొన్ని కలవు. నన్నయ యంత వానినే లెక్కచేయని బాలవ్యాకరణ మిట్టిదే. 'ఇచ్చునకు సర్వంబీయగు' అని ఆదేశించుచు, 'బలిమినీయని భూమివలయపతుల' అను ప్రయోగమును కష్టముపై నంగీకరించును. 'ఎల్లన్ శిష్యుల' అను శ్రీనాథుని ప్రయోగమునే త్రోసిపుచ్చును. తిక్కనగారి చేతురు, కోతురు — ఇత్యాదు లసాధువులనును. ఇట్టి వ్యాకరణములను నిర్ణాయక వ్యాకరణము లనవచ్చును. (Prescriptive grammars). 'ప్రయోగ శరణాః వైయాకరణాః' గదా! శిష్టజన ప్రయోగములను ద్రోసి పుచ్చరాదు. వికృతి వివేకకారుడే యిట్లు సెలవిచ్చినాడు.

'శాస్త్ర ప్రయోగ వచసో శాస్త్రవ్‌ బలవదుచ్యతే
అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణవ్‌ హితవ్‌'

ఇట్టి నిర్ణాయక వ్యాకరణములవలన భాషా నిరూపణము సంకుచితమగును. వర్ణనాత్మక వ్యాకరణములు నిర్ణాయక వ్యాకరణములుగాగాక భాషా స్వభావోన్మీలకముగా నుండవలెను.

ఇక ఆధునిక వ్యాకరణములు కొన్ని వాక్య నిరూపకములుగా, కొన్ని పదనిరూపకములుగా నున్నవి. ఆంగ్ల వ్యాకరణ ప్రభావము దీనికి కారణము. సమగ్ర భాషాస్వరూప నిరూపణమునకు తరతమ భేదములతో ననేకములగు వ్యాకరణములు వెలయవలెను. దీనినే ఆధునికులు Degrees of Gramaticalness అందురు.

చారిత్రక వ్యాకరణములలో మఱియొక విభాగము 'ఏకకాలిక వ్యాకరణము' అనగా ఒక కవి కాలమున వెలసిన భాషాపరిణామమును వర్ణించునది. విజ్ఞులు కవితాపరిశోధనలో ఆ కవి కవిత్వపరిణామములే గాక, ఆ కవి కాలములోని భాషాపరిణామము ఉటంకించుచు 'ఏకకాలిక వ్యాకరణము'ల వెలయింపజేసిననే ఆ పరిశోధన సమగ్ర సుందరమగును. ఒక్కొక్క మహాకవి కొక్కొక్క వ్యాకరణము వెలసినచో సమగ్ర భాషా చారిత్రక పరిణామము తేటతెల్లమగును. ఏకకాలిక వ్యాకరణము లపుడు సంపుటీకరింపబడి 'బహుకాలిక వ్యాకరణము' (Diocronic Grammar) అగును. అప్పుడుగాని చారిత్రక వ్యాకరణరచన పరిణమింపదు. ఆంగ్లభాష కిట్టి వ్యాకరణములు వెలయుట వారి మేధాశక్తికి, దూరజ్ఞతకు నిదర్శనము. తెలుఁగు భాష కిట్టి యదృష్ట మెన్నడోగదా ! ఆంగ్లభాషలో ఛాసర్ భాషకొకటి Shakespeare కొకటి, Milton కొకటి, ఇట్లనేక వ్యాకృతులు ఆంగ్లభాషాచారిత్రక పరిణామ ప్రదర్శన గావించినవి.

తెలుఁగు మున్నగు భాషలలో రచింపబడిన వర్ణనాత్మక వ్యాకరణములలో చారిత్రక దృష్టి మృగ్యము. లోగడ చెప్పి నట్లవి నిర్ణాయక వ్యాకరణములై, ఏదోరీతిని యిష్టశబ్దార్థ సాధనమే తత్కర్తల ప్రధాన విధిగా కనిపించును. ఖండబిందువు పూర్ణబిందువగుననుట, మేనునకు బోడినాదేశముజేయుట, రామునికి మున్నగు రూపములకు ఆరేడు సూత్రముల జెప్పుట. కొన్ని వ్యాకరణ నిబంధనలకు లొంగి కృతకమగు ఆగమాదేశ విభాగముల నేర్పరచుట మున్నగు అనేకాంశములనుబట్టి వ్యాకర్తలపై ఆధునిక భాషా పరిశోధకులకు గౌరవముతగ్గి వారికి చారిత్రకదృష్టి లేదను యపప్రథ నందించుచున్నారు. ఇట్టి రచనలు కాక చారిత్రక, సహజ వ్యవస్థతోకూడిన భాషోన్మీలనము, వాక్యోన్మీలనము, ఆధునికుల కెక్కువ ప్రీతిదాయకము. అట్టిరచనలకు మనమందర మెదురు చూడవలెను. ఈ క్రింది వ్యాకరణ సూత్రమున కనువగు వ్యాకరణ గ్రంథములు చక్కని, చక్కని రీతిలో వెలువడి 'శబ్దజాలమ్ మహారణ్యమ్ చిత్తవిభ్రమ కారణమ్' అన్నట్టి వ్యాకరణ పఠనము శిరోవేదనమను భావము తొలగిపోవలెను. అప్పుడే భాషకు సర్వదా, సర్వథా సుస్థితిగలుగును.

'అల్పాక్షర మసందిగ్ధమ్ సారవద్విశ్వతోముఖ
మస్తోభ మనవద్యమ్చ సూత్రమ్ సూత్రవిదోవిదుః.

— శ్రీ 'సుచంద్రి'.

నేటి కావ్య పరిష్కరణము— శబ్దరత్నాకరము

ఆంధ్రమున మొదటిసారిగ వెలువడిన బృహన్నిఘంటువు శబ్దరత్నాకరము. అది ఆనాడు చెన్నపట్టణమున గల బోధనాభ్యసన పాఠశాలయందు ఆంధ్ర పండితులగు శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యుల గారిచే వ్రాయబడినది. వారు నూటనాలుగు తెనుగు గ్రంథములను (ప్రబంధములను) లక్ష్యములుగా స్వీకరించి వాటినుండియే పదములను ఏర్చి కూర్చిరి. దీనికి ఇరువదియైదేండ్లు పట్టినదిగా వారా గ్రంథమునగల పీఠికలో వాకొనిరి.

ఆనాడు వారు తాళప్రతులనుండి ఎత్తి వ్రాసికొని తన వ్రాతప్రతులను సిద్ధము జేసికొనిరి. ముద్రిత గ్రంథములు ఆనాడు అతి విరళములుగా లభ్యమగుచుండెడివి. ఈనాడు మన ప్రాచీన కావ్యపరిష్కరణలో వావిళ్ళవారి ముద్రిత ప్రతులపై నాధారపడుచున్నారే గాని, ఇతర ముద్రిత ప్రతులనుగాని, మూలతాళప్రతులనుగాని, చివరకు శబ్ద రత్నాకరమునుగాని చూచుట పాప మనుకొనుచున్నారు.

అకాడెమీవారి ఆంధ్ర మహాభాగవతము శబ్ద రత్నాకరముతో సంవదించబడలేదు. శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులగారు ప్రాచీన తాళపత్రముల నుండియే పఠముల నెత్తుకొనిరి గావున వారి శబ్ద రత్నాకరమున చక్కని పాఠములు గలవు.

శబ్ద రత్నాకరములోని చక్కని పాఠములు కొన్ని దిఙ్మాత్రంగా సూచిస్తాను.

అకాడెమీ 'యయాతి చరిత్ర' వావిళ్ళవారి ప్రతికి నకలు. శబ్ద రత్నాకరమున యయాతి చరిత్ర లక్ష్యముగా స్వీకరించబడినది. ముద్రిత ప్రతులకు, శ. ర. పాఠములకు చాల ప్రదేశముల భేదములు గలవు.

ఎడలవెన్నెల చక్కోరిడి జొర్కు వెన్నెలఁ
బానిక నాళీలుగాని గూర్చి 2–84.

పై సీసపాదము వెన్నెల పులుగుల బువ్వంపుబంతి వెన్నెలలోనిది. నంది తిమ్మన చకోరపు బువ్వంపు బంతిని ఒరవడిగా చేసికొని వ్రాయబడిన చొక్కపుఁ బద్యము. ఇట్టి వర్ణన ఇతరత్రా అపూర్వము. అపురూపము. కాని అర్థము క్లిష్టముగా నున్నది. శబ్ద రత్నాకరమున.

అడలవెన్నెల చక్కోరిడి బొక్కు వెన్నెలఁ
బానిక నాళీలుగాను మార్చి

ఇచట అడ అనగా 'ముద్ద' అని భావము.

మఱియొక యుదాహరణ.—

నెమ్మదిలోపల నీకునింత
మనికిత మ్మున్నఁ 4–63.

పై వాక్యము దేవయాని యయాతితోనను సందర్భములోనిది. ఇచట, యయాతి మనమున నున్నది సందేహముకాని దుఃఖముకాదు. శోకము అను అర్థమువచ్చు 'మనికితము' రసహీనమైన పాఠము. శబ్దరత్నాకరమున 'మలికితము' అను సుపాఠమే కలదు.

శశాంక విజయములోని నాల్గవ ఆశ్వాసము నందలి నూటతొంబది ఒకటవ చంపకమాల నాల్గవ పంక్తి ముద్రిత పాఠము—

ఘనముగ వీణెవాటు లయ కాఁ
డవు నీయొళవే నెఱుంగనే!

శ. ర. పాఠము 'బయకాడఁవు' సరసమును, సందర్భోచితము నైనది.

అకాడెమీ 'కళాపూర్ణోదయము' రెండవ ఆశ్వాసములోని ఎనుబది యైదవ సీసములోని రెండవ చరణములో 'తానొక నెఱజాణయై విద్య నెఱపు టెట్లు?' అని యున్నది. నెఱజాణతనము సంగీత విద్య నేర్పుటకు పనికివచ్చునా? నెఱజాణగా యుండుటలో విద్య నేర్పుటకు లాభమేమి? శబ్ద రత్నాకరమున 'నెఱగాణ' అని పాఠమున్నది. నెఱగాణ అనగా పాటగాడు అని అర్థమివ్వబడినది. ఇంకొక విచిత్రము. అకాడెమీ ప్రతిలో నాల్గవ సీసపాదము లోపించినది. ఎందుచేతనో?

పై విధంగా ప్రతి కావ్యంలోను సందిగ్ధమైనవి, అసందర్భమైన, అన్వయక్లిష్టమైన పాఠములు కనబడుచున్నవి. కాబట్టి కావ్య పరిష్కరణ సందర్భమున శబ్దరత్నాకరముతో తలస్పర్శిగా చూడనియెడల కావ్యము సంవర్ధితముగా పరిష్కరణము చేయ సాధ్యము గాదు. ఇక ముందైనను పరిష్కర్తలు శ.ర.ను చూడమని సవినయముగా విన్నపము చేయుచున్నాను.

— శ్రీ 'సత్యమిత్ర'.

గ్రంథవిమర్శలు

ధూర్జటి

[నవల; రచయిత: శ్రీ నోరి నరసింహశాస్త్రి; ప్రచురణ: త్రివేణి పబ్లిషర్సు, మచిలీపట్నం—1, మద్రాసు—1 మూల్యం: రూ. 10/-పుటలు: 503]

చారిత్రక నవలలు వ్రాయడంలో చేయితిరిగిన శ్రీ నోరి నరసింహ శాస్త్రిగారి సరిక్రొత్త నవల 'ధూర్జటి'. శ్రీ కాళహస్తీశ్వర శతకం చదువుతూ ఉండగా శాస్త్రిగారి భావనాపథంలో పొడగట్టిన కవి ధూర్జటి వ్యక్తిత్వం ఈ రచనకు ప్రేరణ అయినట్లు పీఠికలో ఆయన చెప్పుకున్నారు. కవి ధూర్జటి అన గానే అష్టదిగ్గజకవులూ, సంస్కృత కర్ణాట ద్రావిడ కవి పండితులూ, శ్రీకృష్ణదేవరాయలూ, ఆయన రాణులూ, తిమ్మరుసూ ప్రవేశిస్తారు. తప్పదు. ధూర్జటి పాత్ర పోషణకంటె శ్రీ కృష్ణదేవ రాయల పాత్రపోషణే ప్రాధాన్యం వహింపకతప్పదు. సహజమే. ఆ యిద్దరితోబాటు తిమ్మరుసు పాత్రని శాస్త్రిగారు తీర్చిదిద్దిన విధానం, ముఖ్యంగా రాయల చివరిరోజుల్లో సంభవించిన విపరీత పరిణామాల్లో రాయలూ తిమ్మరుసూ ఎదుర్కోవలసిన క్లిష్ట పరి స్థితుల దృష్ట్యా వారి ప్రవర్తనకూ వ్యక్తిత్వాలకూ చేసూ్తవచ్చిన వ్యాఖ్యానం, రచయిత ప్రతిభకు గీటు రాయి అయి, వన్నెతెచ్చేలా అమరి ఉన్నది. రాయలు, తిమ్మరుసు కన్నులు తీయించలేదనీ, కారాగారంలో తోయించగా, దుఃఖమూ వృద్ధాప్యమూ కారణంగా తిమ్మరుసు దృష్టి కోల్పోయాడనీ శాస్త్రిగారు సున్ని తంగా చరిత్రని సవరించి రాయలమీద మన అభిమా నాన్నీ గౌరవాన్నీ దక్కించాలనే గట్టిప్రయత్నమే చేశారు. ఎవరు కాదనగలరు?

కథాసంవిధానరచనలో శాస్త్రిగారి కౌశలం మెచ్చుకోదగ్గది. కథను నాలుగు పాయలుచేసి, ఆ నాలు గింటినీ కార్యకారణసంబంధంతో, చక్కగా పెన వేసూ్త అల్లుకుంటూ పోయారు. ఒకటి ధూర్జటి కథ, రెండు మోహిని మదనికల కథ, మూడు శిల్పి సిరిలూత కథ, నాలుగు శ్రీ కృష్ణదేవరాయల కథ. చారిత్రకనవల కావడంవల్ల, సంఘటనలదృష్ట్యా రాయలపాత్ర ప్రాధాన్యం వహింపక తప్పలేదు. కాని అది కావ్యశరీరం మాత్రమే. కావ్యాత్మఅయిన దైవ భక్తి, దైవమహిమ, దైవానుగ్రహము (శివభక్తి, శివమహిమ, శివానుగ్రహము) ధూర్జటి ద్వారానే ప్రకాశమౌతున్నవి. అతని ప్రక్కన, అతనికి శిష్య మాత్రులుగా మోహినీ సిరిలూతల వ్యక్తిత్వాలూ వారి ఉదంతాలూ ఆ భక్తికే ఉద్దీపనం కలిగిసూ్త ఉన్నాయి. శ్రీ కృష్ణదేవరాయల మనోవైకల్యంలో దైవసంకల్పాన్ని గూర్చిన విచికిత్స ప్రాముఖ్యం వహించడం, రాయల వ్యక్తిత్వంలో అహంకారానికీ ప్రపత్తికీ జరిగే చిత్ర మైన సంఘర్షణలద్వారా ఆయనచేసే నిర్ణయాలకీ కార్యాలకీ అర్థం ఏర్పడడం, నవలయొక్క కావ్యా త్మతో చక్కగా సమన్వయిస్తున్నది. అలా కావ్యాత్మ అయిన 'శివభక్తి' పరంగా చూస్తే నవలలో నాయ కుడు ధూర్జటియేగాని, శ్రీకృష్ణదేవరాయలు కాడు! రాయలద్వారా జరిగినది శివాపచారము. అందుకు ఆయన ఫలితము అనుభవించినాడు అన్న రసధ్వని రాయలకథలోనేగాక కావ్యం మొత్తంమీదా ఉన్నది. 'రాజ్య సంస్థాపన సమయములో శ్రీ విద్యారణ్య భారతీ స్వామిపాదులవారు ఈ రాజ్యమంతా పంపా విరూపాక్ష స్వామివారికి ధారాదత్తము చేయించినారట గదా!... అందువలననే శ్రీ విద్యానగరచక్రవర్తులందరు నియత ముగా శ్రీ విరూపాక్షస్వామి పాదపద్మారాధకులు!' అని 68 వ పుటలో ఒక సంభాషణ. రాయలు, తన పుత్రుడు తిరుమల దేవరాయలు సాక్షాత్తూ త్ర్యంబకుల

నాథుడే అను భ్రమలోపడి అతనికి పట్టాభిషేకంచేసి తను శిరఃప్రధాని అవుతాడు. ఇది శివాపచారమని ధ్వని. ఇక్కడ రాయల మనస్తత్వ చిత్రణం ఎంతో మనోజ్ఞంగా ఉన్నది. రాయల అహంకారమూ, (రాజ్యము తను విస్తరించి సంపాదించినదని), రాయల మమకారమూ (వృద్ధాప్యంలో పుత్రోదయము) తిరుమల నాథునిమీద భక్తి ప్రపత్తుల వేషంలో రాయలకు భ్రమకల్పించి ఆట ఆడించినవి. కాని పుత్రుని అకాలమరణంతో రాయలలో చిత్తమథనం ప్రారంభమౌతుంది. ఇది శిక్ష. ఆ భావపరంపరలో రాయలకు యిలా తోస్తుంది: 'ఈ రాజ్యము పూర్వము స్థాపించు సమయమునసే శ్రీ విద్యారణ్య స్వాములవారి ఆదేశముచే శ్రీ హరిరాయ బుక్కరాయ సోదరులు దీనిని శ్రీ విరూపాక్షస్వామికి సమర్పించిరి...ఈ సామ్రాజ్య మా స్వామి సొత్తు. దాని నింకొకస్వామికి ధారపోయుటకు మాకేమి అధికారమున్నది? ఒకవేళ ధారపోసినను పరద్రవ్యాపహరణమునకు తిరుమలనాథు డంగీకరించునా?' (317 వ పుట). ఇది రాయల జ్ఞానోదయానికి నాంది. రాజ్యానికి ఆపద వస్తుంది. రాయల చిట్టచివరి యుద్ధయాత్రతో అది నివారింపబడుతుంది. తర్వాత ఆయన మనస్సు శ్రీ కాళహస్తీశ్వరుని మీదికి మరలినదట. 'స్వామీ, తిరుమలనాథా!... మోహినీ రూపముధరించి జ్ఞానమూర్తియైన సదా శివునే కామమోహితుని జేసిన నీకు మాబోంట్లు ఒక లెక్కటయ్యా స్వామీ! ... మాయామోహితులకు నీవు సద్గతులే కల్పిస్తావు. నాకిప్పుడు శ్రీ కాళహస్తీశ్వరస్వామిని చూపించు.' రాయలకు చివర మన శ్శాంతీ, భగవదనుగ్రహమూ లభించినట్లే శాస్త్రి గారు చిత్రించి ముగించినారు. చాల హృద్యముగా నున్నది. శివుడే సూత్రధారి అయినాడు!

శివాపచారము, శిక్ష, జ్ఞానోదయము, భగవదనుగ్రహము—ఈ వరుస నవలలోని ప్రధాన వ్యక్తులందరి చిత్రణములో రచయిత పాటించడము నవలకు విశిష్టమైన కావ్య సౌష్ఠవాన్ని తెచ్చిపెట్టింది. ధూర్జటి తన జన్మవాసరమునాడు శివపూజ చేయవలసిన వేళలో వేశ్యఅయిన మోహినితో ఏకశయ్యాగతుడైనాడు. శివుణ్ణి మోహిని దక్షిణస్తనంలో ఆవాహనచేసి ఆరాధించాడు. ఇది అపచారమని గట్టిగా చెప్పలేని ఒక అపచారము. కాని ఆ కొరత ఏదో మనస్సులో బాధించడం వల్లనే ధూర్జటి మరుసటిరోజు మహారుద్ర జపానికి కూర్చుని రాజసభకు వెళ్లలేకపోయాడు. అందువల్ల రాజుకు కోపం వస్తుంది. ధూర్జటిని ముమ్మారు ద్వారపాలకులచేత అవమానింప చేస్తాడు. ఇదీ శిక్ష. తర్వాత ధూర్జటికి రాజసన్మానము లభిస్తుంది. కాని ధూర్జటిలో క్రమంగా పరిపక్వమైన శివభక్తి అతణ్ణి శ్రీ కాళహస్తి వైపుకే లాగుతుంది. అక్కడ అతనికి భగవంతుడే సన్మానం జరుపుతాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్య కావ్యరచన చేస్తాడు.

మోహినికి అయాచితంగా, పూర్వజన్మసుకృతి కారణంగా శివానుగ్రహం లభిస్తుంది. ధూర్జటి ద్వారా ఆమెజీవితం మారిపోతుంది. బాలరాజు సమక్షంలో ఆమె కొరడాదెబ్బలు తినడం ఆమెలో పాపశేషానికి ఒక శిక్ష, ఒక క్షాళనక్రియ. అంతటితో ఆమె సర్వాంగాలూ పునీతమై. ఆమె శివానుగ్రహం పొందుతుంది; శ్రీకాళహస్తి చేరుకుంటుంది. తిమ్మరుసు రాజసభలో విద్వద్గోష్ఠి ప్రారంభిస్తూ నత్కీరుని కథను చర్చకు తీసుకువస్తాడు. మేధావియైన తిమ్మరుసు భగవంతుని లీలలనుగూర్చి తర్కము లేవదీసి ఆయన లీలల్లో ఔచిత్య విచారణకు పూనుకోవడం, ఒకవిధమైన శివాపచారము. 'ధూర్జటి ఆవేశ పూరిత శివవాక్కులు ఆలకింపగా...తిమ్మరుసు.. తల వంచుకొనెను. శివలీలారహస్యములు గ్రహింపక, హేలగా తాను శివకృత్యములను పరోక్షముగా తూలనాడి శివాపరాధము కావించితినా యను భావ మాతనికి భయాందోళనములు కలిగించెను' (164 వ పుట). తిమ్మరుసు బాలరాజునకు విషప్రయోగము చేసినాడన్న అపవాదుతో బంధింపబడి, దృష్టి కోల్పోవుట, అది తిమ్మరుసుకు లభించినశిక్ష. దానితో అతనిదృష్టి పూర్తిగా అంతర్ముఖమైనది!; అదియే భగవదనుగ్రహము కూడ!

బాలరాజైన తిరుమలరాయలు శివదీక్షాపరురాలైన మోహినిని, తనకు నమస్కరించలేదన్న కోపంతో, కొరడాతో కొట్టిస్తాడు. విరూపాక్షస్వామికే ఆ దెబ్బలు తగిలినవి. ఉత్తరక్షణమే బాలరాజు మృత్యువువాత బడినాడు. అందులో శిక్షా, దైవానుగ్రహమూ రెండూ ఏకమైనవి. ఇదీ శివలీలా వైవిధ్యమూ, వైచిత్ర్యమూ నవలలో ఏకవస్తువుగా రూపొందింపబడిన తీరు.

నక్కీరుని ఉదంతముపై సుదీర్ఘముగా నడచిన గోష్ఠి, శ్రీకృష్ణదేవరాయల సభావైభవాన్నీ, సభాసదుల భిన్నవ్యక్తిత్వాలనూ చక్కగా వ్యక్తం చెయ్యడమే కాకుండా, కావ్యనాయకుడైన ధూర్జటిలోని భక్తి వైశిష్ట్యాన్నీ, తద్ద్వారా అతని ప్రముఖ్యాన్నీ ఎత్తిచూపిన ఘట్టం అయింది. అంతకంటెకూడా శివానుగ్రహము ఎంత విచిత్రంగా, శిక్షారూపంలో కూడా ఉండగలదో వివరించేందుకు కల్పించుకొన్న అవకాశమై రచయిత నవలలోని మూలవస్తువును వ్యాఖ్యానించడం జరిగింది. ఇలాంటి ప్రయోజనమే సిరిలాత ఉగ్రనరసింహమూర్తిని గండరించేందుకు సంకల్పించి పూనుకోవడంలోనూ రచయిత సాధించారు. బాలరాజు మృతితో మనోవైకల్యం కలిగిన శ్రీకృష్ణదేవరాయలు గతాన్ని నెమరువేసుకుంటూ, తండ్రి నరసానాయకుల రూపం స్ఫురించేటట్లు నృసింహస్వామి మూర్తిని గండరించమని శిల్పికి ఆజ్ఞ యిస్తాడు. శిల్పి సిరిలాత ధూర్జటిని సంప్రదించి తనకుతోచిన ఉగ్రమూర్తినే తయారుచేస్తాడు. ఆ సమయంలోనే రాజు కోపోగ్రత అందరిమీద ప్రసరిస్తూ ఉంటుంది, అది రాజ్యానికే చేటుగా భయం గొల్పుతూ ఉంటుంది. ముఖ్యంగా రాజు ధూర్జటిమీద ఆగ్రహావేశుడై ఉన్న సమయంలో ధూర్జటి శిల్పితో నృసింహమూర్తి కన్నులలోని రౌద్రాన్నిగూర్చి ప్రసంగిస్తూ ఉంటాడు. 'నృసింహస్వామిని రుద్రమూర్తిగా భావించుట కూడ కాదనను. అది తాంత్రికభావన. హిరణ్యకశిపునికి ప్రత్యక్షమైనది నృసింహమూర్తి. ఆ మంత్రరాజములోనే నృసింహతాపినిలో రుద్ర శబ్దమునకు బదులు భద్ర శబ్దమున్నది. అది ప్రహ్లాదాది భక్తులకు ప్రత్యక్షమైన స్వామి మూర్తి. ఒక్క అక్షరమే కదా భేదము?' ఇది చెప్పి ధూర్జటి రాజు దగ్గరకు వెళ్తాడు. రాజతణ్ణి విద్యానగరం నుంచి బహిష్కృతుణ్ణి చేస్తాడు. ఇక్కడ రాజులో ప్రత్యక్షమైన రుద్రమూర్తి, శ్రీ కాళహస్తీశ్వరుని భద్రమూర్తికి పర్యాయమే తప్ప భిన్నము కాదు! ఇది శ్రీకాళహస్తిస్వామియే అనుగ్రహించి విద్యానగరము నుండి ధూర్జటిని చేరబిలుచుట! సిరిలాతకు కూడా అలానే నగర నిర్గమనము తప్పలేదు. అతను కూడా శ్రీకాళహస్తినే చేరుకుంటాడు. ఇలా భక్తులైన ధూర్జటి, మోహిని, సిరిలాత విద్యానగరంనుండి రాజాగ్రహం కారణంగా శ్రీ కాళహస్తికి తరలి వెళ్ళడమే నవలలోని కథా పరిణామం. అంటే విరూపాక్ష స్వామి (రుద్రమూర్తి) సన్నిధినుండి శ్రీ కాళహస్తీశ్వర స్వామి (భద్రమూర్తి) సన్నిధి చేరుకోవడాన్ని—అపచారము, శిక్ష, అనుగ్రహము అనే క్రమ పరిణామ రూపంలో భక్త చరిత్రగా, ఈ చారిత్రక నవలని తీర్చిదిద్దారు శ్రీ నరసింహ శాస్త్రిగారు. చక్కని ఆకృతి, సౌష్ఠవం కలిగిన రచన.

నవలయొక్క కావ్యాత్మ శివభక్తి, శివమహిమ, శివానుగ్రహము కావడంతో కొంత వైష్ణవాన్ని కించపరచే ధోరణి ఉన్నదేమోననే సందేహానికి ఆస్కారం లేకుండా, ఎక్కడికక్కడే జాగ్రత్తపడుతూ, వివరిస్తూ, మూర్తులు వేరేతప్ప మూలతత్త్వం ఒక్కటే అనే భావాన్ని ప్రస్ఫుటం చేస్తూ రచన చేశారు శాస్త్రిగారు. దీనికి వారిని అభినందించక తప్పదు.

శ్రీ కృష్ణదేవరాయలు వట్టి ఉత్సవ విగ్రహమే, రాజ్యానికి మూలవిరాట్టు తిమ్మరుసుమంత్రి ఒక్కడే అనే అపోహ ఎవరికైనాఉంటే దాన్ని పోగొట్టడానికి వాచ్యాప్రయత్నం చేశారు శాస్త్రిగారు. (252–253 పుటలు).

రాయలు తిమ్మరుసును బంధవిముక్తుణ్ణి చేస్తూ పశ్చాత్తాపాన్ని ప్రకటించే సందర్భంలో ఆ పాత్ర నోట శాస్త్రిగా రిలా పలికించారు: 'అప్పాజీని, ఆయన తమ్ముని, కుమారుని, చెరనుండి విడిపించి వారి క్షమాభిక్షవేడి...గౌరవించుట మా విధి. ఇందుకు వెనుకాడినచో...భవిష్యత్కాలమున నృసింహమూర్తులు మాకు కృతఘ్నతా దోష మారోపించి వర్ణింతురు...' రాయలు 'నరసింహశాస్త్రివంటి' చారిత్రక నవలా రచయితల్ని ఊహించి తిమ్మరుసుకు న్యాయం చెయ్యబూనుకోవడం కూడా ఔచిత్యాన్ని పోషించే ఒక చమత్కారమే అయింది!

నవలలో ఉల్లేఖింపబడిన శ్రీ కాళహస్తీశ్వర శతక పద్యాలకు, ఆయా సందర్భాల మూలంగా కొత్త స్ఫూర్తి, ప్రశస్తి వచ్చాయనడంలో సందేహంలేదు. ఇది ధూర్జటికి శ్రీ శాస్త్రిచేసిన మేలు!

'ఈనవలా రచనలో తరచుగా స్వామి నన్ను ఆవేశించి ఉండెననియే నా విశ్వాసము' అని చెప్పకున్నారు పీఠిక చివర శాస్త్రిగారు. వారి దృక్పథంతో మనం ఏకీభవించినా ఏకీభవించకపోయినా వారి మనస్స్నిగ్ధత, సంస్కారము నవలలో ప్రతిబింబించి మనల్ని రంజింప జేస్తున్నాయి.

— ఆర్. ఎస్.

చైత్రపూర్ణిమ

(కాశ్మీర చరిత్ర కథలు; రచయిత : పిలకా గణపతిశాస్త్రి; ప్రచురణ : యం. శేషాచలం అండ్‌కో, మచిలీపట్టణం — మద్రాసు — సికింద్రాబాదు; 191 పేజీలు; వెల రూ. 2)

కల్హణుని రాజతరంగిణి చారిత్రక గ్రంథమే కాక సాహిత్య రత్నాకరం కూడ. అందులో అమూల్యమైన అనేక కథలు నేటికీ నిత్యనూతనంగా ఉండి చదువరులను ఆనందింపజేస్తున్నాయి. 'తాత తాతల నాటి కథలు తవ్విపోయటం'లో శ్రీ పిలకా గణపతి శాస్త్రిగారు సిద్ధహస్తులు. 'ప్రాచీన గాథాలహరి' అనే పేరుతో శ్రీ గణపతిశాస్త్రిగారు ఆంధ్రీకరించిన ఎన్నెన్నో ప్రాచీన గాథలు సంప్రదాయ ప్రియులైన వారందరూ భద్రపరచుకోదగినవి. తెలుగు భాషలో తగినన్ని ప్రాచీన గ్రంథాలు అందుబాటులో లేవని, సంస్కృత భాషలోనే 'రాజతరంగిణి'వంటి అద్భుతమైన గ్రంథాలు ఉండిపోతే తెలుగువారి కా సంపద కొరవడుతుందని భావించి కీ. శే. శివలెంక శంభుప్రసాద్‌గారు గణపతిశాస్త్రిగారివంటి సంస్కృత విద్వాంసులచేత తెనుగున రచింపజేశారు. అందులోని పదికథల సంకలనమే 'చైత్రపూర్ణిమ' కథాసంపుటి. గణపతిశాస్త్రిగారు పేర్కొన్నట్లు ఒక్క రాజతరంగిణి కోసమే ప్రత్యేకించి సంస్కృతం నేర్చుకోవచ్చునన్నా అతిశయోక్తి కాదేమో!

రాజతరంగిణీగాథలకు యీ కథలు కేవలం అనువాదాలుగాని అనుసరణలుగాని కావు. ఆ గ్రంథంలోని సంఘటనలు, పేర్లు, తేదీలు, తిథులు ఆధారంగా తీసుకొని మళ్ళీ స్వతంత్ర కల్పన లనిపించే విధంగా రచించినది. సులభశైలిలో యింపుగొలిపే గణపతిశాస్త్రిగారి రచన యీ గాథలకు మెరుగు పెట్టిందనటం అన్యాయం కాదేమో! 'అప్పటి రాజులను, రాణులను, వారి వారి అంతరంగాలను, అంతఃపుర విశేషాలను, ఆచార వ్యవహారాలను, సాంఘిక పరిస్థితులను, సంస్కృతి విశేషాలను' యీ కథలలో వర్ణించారు. ఈ వర్ణించటంలో గణపతి శాస్త్రిగారితో ప్రగతి కాముకులైన చదువరులు పెక్కుమంది ఏకీభవించరు. ఆ నాటి రాజుల స్త్రీలౌల్యాన్ని, కొన్నిచోట్ల స్త్రీల దుర్నీతిని, చాతబడులు, జ్యోతిష్యాలు, పూర్వజన్మలు వీటికి సంబంధించిన మూఢనమ్మకాలను గణపతిశాస్త్రిగా రతి మక్కువతో వర్ణించటం సబబుగా కన్పించదు.

'కశ్మీరాః పార్వతీ తత్ర
రాజాజ్ఞేయః శివాంశజః

సావజ్ఞేయః సదుష్టోపి
విదుషా భూతి మిచ తా'.

'కాశ్మీరభూమి సాక్షాత్తు ఆ పరమేశ్వరుని అర్ధాంగి పార్వతీదేవి స్వరూపమే. రాజు పరమశివుని అంశను పుట్టిన మహనీయుడు. అటువంటి రాజు దుష్టుడైనా అతనిని అవమానించరాదు'— ఇటువంటి భావం ఉన్న పూర్వకాలంలో కల్హణమహాకవి రసవత్తరంగా రాజతరంగిణిని రచించినా, వాటిలోని గాథలను చదివి, మైమరచి 'లేతబుట్టలు కొక్కిరించినా' సరేనని, ఆ గాథలలో కల్హణమహాకవి చెప్పిన దానికంటె ఎక్కువ వివరాలను చెప్తూ, మరింత బట్టబయలుగా గణపతిశాస్త్రిగారు రచించటం విచారకరం.

'చైత్రపూర్ణిమ' అనే పేరు గలిగిన మొదటి కథ చదవగానే భాష, వర్ణనలు, చారిత్రక వివరాలు ముచ్చట గొలిపినా శ్రీలేఖ, జయాకరుల అక్రమమైన సమాగమాన్ని రచయిత సానుభూతితో వర్ణించటం దుస్సహంగా కన్పిస్తున్నది.

'సంపూర్ణాహుతి' ఈ సంపుటిలో కంతటికీ మంచికథ. యశస్కర మహారాజు మరణించిన తరువాత ఆయన భార్య సర్వమంగళ కాలానుగుణంగా ఆచారాలను పాటించి విధవగా మారి తదనుగుణంగా జీవించలేదు. పైగా నానాటికి నూతన వధువువలె అలంకరించుకుంటూ లోకాపవాదానికి గురి అవుతుంది. పర్వగుప్తుడనే రాజు సర్వమంగళాదేవిని మోహించి, ఆమె అంగీకారం లభించదని తెలిసి, ఆమె స్వయంగా కట్టించే దేవాలయనిర్మాణానికి విఘ్నాలు కల్పించి, ఆమెనెలాగైనా తన సహాయాన్ని కోరేటట్లుగా చేస్తాడు. సర్వమంగళ గొప్పవన్నాగంతో, పర్వగుప్తుని కోర్కె కంగీకరించినట్లు నటించి, దేవాలయ నిర్మాణం పూర్తయేవరకు గడువుపెట్టి, ఆలయం పూర్తయి, సంప్రోక్షణ మహోత్సవంలో బాగా అలంకరించుకుని భుగభుగ వెలిగే హోమజ్వాలల్లో తనను ఆహుతి చేసుకొంటుంది. ఒక సతీమతల్లి చారిత్రక గాథను గణపతి శాస్త్రిగారు రసవంతంగా చెప్పారు.

'భవిష్యద్వాణి' కథ జ్యోతిశ్శాస్త్రంపట్ల నమ్మకంఉన్న వారికెంతగా నచ్చుతుందో దానిని నమ్మనివారికి అంత పరిహాసాస్పదంగా ఉంటుంది. తన నమ్మకాలకు, ఆశలకు భిన్నంగా జ్యోతిశ్శాస్త్ర ఫలితాలు వెల్లడైనప్పుడుగూడ ఆ శాస్త్రవేత్తను ఘనంగా సత్కరించటం ఆ నాటి బాలాదిత్య సార్వభౌముని ప్రత్యేకత. నాగేశ్వర భట్టారకుడు, మేధావి భట్టు అనే జ్యోతిషవేత్తల పట్టుదలతో కూడిన వాగ్వాదాలు ఈ కథను ఉత్కంఠతో చదివిస్తాయి.

అనంగలేఖ అనే రాణి తమదేశపుమంత్రి అయిన ఖంఖమంత్రిని కామించి, ఒకనాటి విషమ పరిస్థితిలో తనకోర్కెను నెరవేర్చుకొంటుంది. ఆమె భర్త దుర్లభవర్ధనుడు మంత్రి తప్పేమీలేదని భావించి 'మానాభిమానాలుజ్జగించిన ఒక చపలవనితకోసం మీవంటి సౌహార్దమూర్తిని బలిపెట్టటం సముచితమనిపించలేదు' అని వర్తమానం పంపి, క్షమించి వదిలేస్తాడు. తరువాత యుద్ధభూమిలో మంత్రి ప్రాణాలకు తెగించి పోరాడి రాజుకు తోడ్పడతాడు. ఇటువంటి కథలను నేటి చదువరు లెంతవర కాదరిస్తారన్నది సందేహాస్పదమే.

'కవితాగౌరవ' మన్నది భర్తృమేంఠకవి తాను వ్రాసిన హయగ్రీవవధ మహాకావ్యాన్ని కాశ్మీరరాజు మాతృగుప్తుని కొలువుకూటంలో వినిపించి ఘన సత్కారాలను పొందిన ఘట్టాన్ని వివరించేది.

పౌరులందరినీ సమాన దృష్టితో చూడని రాజోద్యోగులందరికీ గుణపాఠంచెప్పి ఒక పేదకుటుంబీకుడు మంకణుడు త్రిభువనస్వామి ఆలయ నిర్మాణానికి పూనుకొన్న రాజుకు దేవుని దృష్టిలో అందరూ సమానులేనని హెచ్చరిక చేస్తాడు. ఇది త్రిభువనస్వామి అనే పేరుగల కథ.

'చాతబడు'లంటే నమ్మకాన్ని కలిగిన కాశ్మీర ప్రజలు 'మంత్రమహిమ' అనేకథలోని సంఘటనలను నమ్మిఉంటే ఉండవచ్చుగాక. కల్హణకవి వ్రాసినా గణపతి శాస్త్రిగారి వంటి విజ్ఞులు వాటికి విలువయిచ్చి ప్రచారాన్ని కల్పించటం విచారకరం. దీని వంటిదే పూర్వజన్మలపైన నమ్మకాన్నికల్గించే కథ 'మహనీయ నర్తకి!'

రోమ్ నగరాన్ని తగులబెట్టిన నీరో చక్రవర్తి వంటివాడే మన చరిత్రలోను ఒక ప్రబుద్ధుడున్నాడు. కాశ్మీరాధిపతి లలితాదిత్య చక్రవర్తి మద్యపానపు

మత్తులో ప్రవరపురాన్ని స్త్రీబాల వృద్ధు లందరి తోను తగులబెట్టవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. కాని ప్రధానమంత్రి రాజాజ్ఞను ధిక్కరించి రాజును మాత్రం ప్రవరపురం తగులబడిపోతున్న భ్రమ కలగ టానికి పెద్ద పెద్ద గడ్డిమేటుల్ని తగలబెట్టిస్తాడు. తరువాత నిజం తెలుసుకొన్న రాజు పశ్చాత్తప్తు డైనా మంత్రి మాత్రం తానటువంటి రాజు కొలువులో ఉండలేనని చెప్తాడు. రాజెంతో బతిమి లాడిన పిమ్మట మళ్లీ మంత్రిపదవిని స్వీకరించటానికి అంగీకరిస్తాడు. ఇది ఆజ్ఞాధిక్కారమనే కథ.

కాశ్మీరరాజ్యం పరిపాలించిన యశోవతీదేవికి రాజ్య వారసత్వం ఏ పరిస్థితులలో సంక్రమించినదో చెప్పేకథ కాశ్మీరదేవత.

'కశ్మీరాః పార్వతీతత్ర
రాజాజ్ఞేయః శివాంశజః'

అని తలంచిన కాశ్మీరప్రజలు ఆమెను పర్వత రాజ తనూజ ప్రభావరాశి అంశతో అవతరించినట్లు తలంచి గౌరవించారట.

ఈ పది కథలలోను భాష చారిత్రక గాథలను ఆస్వాదించటానికి అనువుగా, హృద్యంగా ఉన్నది. ప్రాచీనగాథాలహరితో ఇంతవరకు ప్రసిద్ధులైన గణ పతి శాస్త్రిగారు 'రాజతరంగిణి' నంతటిని ఆంధ్రు లకు అందిస్తే మరింత బాగుంటుంది.

క వి త

(ఖండకావ్య సందోహము; కవి: గుఱ్ఱము వేంకట సుబ్రహ్మణ్యము; ప్రచురణ: సాహితీ సమితి, వేదంవారి అగ్రహారము, నెల్లూరు; మూల్యము. రూ. 3–00.)

నేడు నామమాత్రావశిష్టంగా ఉన్నప్పటికీ సాహితీ సమితి సభ్యుణ్ణని చెప్పుకోవటం గర్వకార ణంగా ఉండేది ఒకప్పుడు. నవ్యకవిత్వపు ఆరంభదినా లలో సాహితీసమితి సేవ గణనీయమైనది. చెట్టు ఎంత ముసలిదైనా కాయల రుచిలో మార్పేముంటుంది? కాకపోతే కొందరు చెట్టుపేరుచెప్పి కాయలమ్ము కోవచ్చు. శ్రీ గుఱ్ఱము వేంకట సుబ్రహ్మణ్యముగారు సాహితీ సమితి తొలి రోజులనుండి ఆ నాటి గొప్ప కవులతో మిత్రత్వం నెరపిన వారు. వీ రప్పుడప్పుడూ వ్రాసిన కావ్యఖండికల నొకచోట చేర్చి 'కవిత' పేరుతో వెలువరించారు. ఇందులో స్వేచ్ఛాగానము, హృదయామోదము; గాథావళి; వకుళావళి; ఆర్యావళి; బాష్పావళి; దుఃఖోత్తరణము అనే భాగాలున్నాయి.

'భిదుర సంపాతము' అనే కావ్యఖండికలో
'హృదయ గవాక్షము తెఱచితి
మృదులపవన మాశించితి'నని చెప్తూ

'అకట! తిమిర కాలుష్యము
వికృత మేఘ సంఛన్నము
భీకర రవ నిర్ఘోషము
తాకె భిదుర సంపాతము'

అని వాపోయారు. ఆనందోద్వేగాలను అక్షరబద్ధం చేస్తూనే 'హృదయ వనమున నొక్క భావదళమైన గదలకున్నది' అని స్తబ్ధతను సైతం ఎంతో చక్కగా కవితగా మలచారు.

'హంపీక్షేత్రము'వంటి రసవత్కావ్యం వెలు వడిన తరువాత గూడ హంపీ శిథిలాలు కవుల హృద యాలను స్పందింపజేసి, నిత్యనూతనమైన కవితా ప్రేరణ కల్గిస్తూనే ఉన్నాయి. 'హంపి' అనే ఖండ కావ్యములో

'అరుణాస్పదము దీని నొరవడిగా నుంచు
కొనియె పెద్దన్న వర్ణనముసేసె
గిరినదీప్రణయమ్ము గీల్కొల్పెభట్టుమూ
ర్తియు పంపయొరగిల్తిరు సూచి
సిద్ధయక్షాదుల జిత్రించె నిచ్చటి
తీర్థాధ్వగులజూచి తిమ్మనకవి
ఋష్యమూక మతంగ హేమకూట సమీక్ష
రామాభ్యుదయకర్త వ్రాసెగృతిని
రామలింగన నిగమశర్మను దదీయ
సోదరిని చుట్టుపట్లన చూడబోలు

కావ్యలోకమునకు దానకటక మనగ
పరిఢవిల్లిన పురమిది పాడువడియె'

నని అలనాటి వైభవాన్ని తలచుకొని వాపోయారు. ఇంకా యిదేవిధంగా

'ద్వారపాలికల సుందరమూర్తి చెడిపోయె
పాలిండ్లు ఛేదింప వాడిమొనలు'

'పూచినకాన చిచ్చేచి కాల్చినయట్లు
తుఱకలు పురలక్ష్మి చెఱచివైవ'

మొదలైన సీసపద్యాలలోని భావాలు రసవంతంగా ఉన్నాయి.

దేశభక్తి, మహాపురుషభక్తి, ఆర్యధర్మభక్తి కలిగిన సుబ్రహ్మణ్యముగారు తమ భక్తి ప్రపత్తులను ఛందోరూపములో నిర్దుష్టంగా వెలువరించారు. 'బాష్పావళి' అనే భాగంలో వ్రాసిన ఎలిజీలు రెండూ చదువరుల నంతగా కదిలించేవికావు. తమ దుఃఖాన్ని ఛందస్సులో వెల్లడించినంత మాత్రాన అవి మంచి ఎలిజీలైపోవు.

'రామబాణమునకు రాక్షసులెల్లరు
ప్రమందినారుగాని ప్రమందడొకడు
కాలరాక్షసుండు ఘటనాఘటన దక్షు
డేలుజగతి దురితజాలనిరతి!'

వంటి పద్యంలోని తీవ్రతైనా మిగిలిన పద్యాలలో లేదు. మొత్తంమీద కవితలో ఛందో వ్యాకరణ అలంకారాలన్నీఉన్నా కవితమాత్రం తక్కువే.

—శ్రీ రామమోహనరాయ్.

ఆంధ్ర పరాశరస్మృతి

(పద్యకావ్యము)

(రచయిత : కీ. శే. ఆదిపూడి ప్రభాకరామాత్యులు; పేజీలు95; వెల—సాదాప్రతి రు.2.00లు. ప్రతులకు—ఎ. వి. ఎస్. సుబ్బారావు, (ప్రచురణ కర్త.) 1—8—155 5; మెండలే లేన్; ప్రెండరు గాస్టురోడ్డు; సికింద్రాబాదు—3.)

ఇది శాస్త్రకావ్యం; శాస్త్ర విషయము పద్య రూపంగా రాయబడినది కావ్యారంభమునకు పూర్వం కవిరాజ సందర్శనమనుపేర ఇరవయి ఏడు పద్యములు చేర్చబడినవి. ఆ పద్యములు కీ. శే. మంత్రి ప్రగడ భుజంగరావు జమీందారును కవిగారు దర్శించినపుడు రాసినవి.

'ఆంధ్ర పరాశర స్మృతి' అనబడే ఈ కావ్యం మూడు బింబములుగా విభజింపబడినది. మొదటి బింబమునందు నాలుగు అధ్యాయములు, రెండవ బింబమునందు అయిదు అధ్యాయములు, మూడవ బింబమునందు మూడు అధ్యాయములు—మొత్తము పన్రెండు అధ్యాయములు గలవు. కావ్యం 'కలికాల యోగ్యమగు శౌచాచారముల'నుగూర్చిన చర్చతో నిండి ఉంది.

చతుర్వర్ణము లాచరించవలసిన ధర్మస్వరూపం ఈ కావ్యంలో వివరింపబడినది. కలియుగమునకు సంబంధించిన అనేక పాపకార్యములు వాటికి తగిన ప్రాయశ్చిత్త విధములు ఈ కావ్యములో వివరముగా తెలుపబడినవి.

మునులు వ్యాసమహర్షిని కలికాలమునకు తగిన ఆచారములను తెలుపమని అడిగినపుడు వ్యాసుడు మునులకిచ్చిన సమాధానము—

'సర్వతత్త్వజ్ఞుఁడనుకాను సదయులార!
ధర్మములు బోధఁజేయ నా తరముకాదు
కలఁడు మా తాత సర్వమ్ముఁ దెలియువాఁడు
ప్రజ్ఞ నీ సమాను డతఁడు సర్వమ్ముఁ దెలియు
వాఁడు.'

ఇది సంస్కృతమునుండి తెనుగునకు అనువదింపబడిన కావ్యము. వ్యాసుడు పరాశరునికి కొడుకు అని, మనుమడని రెండు వాదాలున్నవి. అయితే కొడుకు అనే వాదమే అనేకమందిచేత ఆమోదింపబడింది. 'తాత' అనే పదానికి సంస్కృతంలో తండ్రి

అనే అర్థం ఉంది. అయితే తెలుగులో 'తాత' అంటే తండ్రి తండ్రిగాని, తల్లి తండ్రిగాని అవుతాడు. పై పద్యంలో 'తాత' అనే శబ్దానికి బదులు తండ్రి అనే శబ్దాన్ని ఉపయోగించవచ్చు.

విషయం ప్రధానంగా ఆచార ధర్మాలకు సంబంధించినది కాబట్టి పద్యప్రక్రియలోకంటే వచనంలోనే బాగుంటుంది. ఈ కాలంయొక్క చైతన్య స్వరూపానికి, ఇలాంటి శాస్త్ర కావ్యాలకి ఏవిూ సంబంధం లేదు.

కావ్యగత శిల్పానికి దాని వివరణకు ఇలాంటి కావ్యాల్లో స్థానం లేదు. ఈ జాతి కావ్యాలకు శైలి ప్రాణభూతమైన లక్షణం. ఆ శైలి ఈ కవిగారిలో పరిపూర్ణస్థితిలో ఉంది. చెప్పదల్చుకున్న విషయం కాబట్టి శైలి నలుగురికీ అర్థమయ్యేలా చక్కగా సరళంగా ఉంది. చాతుర్వర్ణ్య వర్గసమాజంమీద దానితాలూకు ఆచారాలమీద ఇంకా విశ్వాసంఉన్న వాళ్లు ఈ కావ్యాన్ని చదవవచ్చు; తెలియని విషయాల్ని తెలుసుకోవచ్చు.

— శ్రీ టి. ఎల్. కాంతారావు.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.